తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 03.04.2025 | సంపుటి : 11 సంచిక : 254 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# బీసీలంటే భాజపాకు పడదు

## తెలంగాణలో బలహీనవర్గాలకు రిజర్వేషన్లు ఇస్తే మోదీకి కష్టమేంటి?

బీజేపీ కావాలనే జనగణనను వాయిదా వేస్తోంది

రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రిజర్వేషన్లపై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసిన కేంద్రానికి పంపాం

దానిని వెంటనే ఆమోదించండి

బీజేపీ పాలిత గుజరాత్‌లో అమలుచేయాలని కోరడం లేదు

జంతర్ మంతర్ వద్ద బీసీ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2(జనంసాక్షి):** బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరి తంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కుటగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు.

*"బీసీల గొంతుక వినిపించడానికే కార్యక్రమం ఏర్పాటు చేశాం. జనాభా తెలియకుంటే రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయి. స్థానిక సంస్థ లు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలి. రిజర్వేషన్ల అంశాన్ని రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకువచ్చాం. రిజర్వేషన్ల అంశానికి శాశ్వత పరిష్కారం లభించాలని రాహుల్‌గాంధీ చెప్పారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. తెలంగాణలో బలహీవర్గాలకు రిజర్వేషన్లు ఇస్తే మోదీకి కష్టమేంటి?. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకుంటామని తీర్మానం పంపితే స్పందించలేదు. ప్రధాని మా ఆలోచనలు పంచుకుంటే గౌరవం ఉంటుంది."*

\- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 2లో..

# శాంతిచర్చలకు సిద్ధం





మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదల

## కాల్పుల విరమణకు సర్కారు ముందుకు రావాలి

- మావోయిస్టు పార్టీ ప్రకటన
- పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదల

**చర్ల(జనంసాక్షి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలకు తాము సిద్ధమని సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ లేఖ విడుదల చేశారు. తక్షణ కాల్పుల విరమణ శాంతి చర్చలకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. మద్య భారతంలో సాగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. బేషరతుగా కాల్పుల విరమణ చేసి శాంతి చర్చలకు జరపాలన్నారు. ఈ అంశంపై హైదరాబాద్‌లో గత నెల 24న శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించినట్లు ఈ లేఖలో ఆయన వెల్లడించారు . ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి కమిటీ ఏర్పాటు, రౌండ్ టేబుల్ సమావేశ నిర్ణయాలను తాము స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల పట్ల తమవైఖరిని ఆ లేఖలు అభయ్ వివరించారు. ఈ శాంతి చర్చల్లో భాగంగా భారత ప్రభుత్వం సిపిఐ మావోయిస్టు పార్టీ రెండూ భేషరతుగా కాల్పుల వీరమణ జరగాలని, భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ 'కగార్ ను ప్రారంభించిందనన్నారు. ఈ ఆపరేషన్ ఫలితంగా పెద్ద ఎత్తున హత్యలు మరియు సామూహిక అరెస్టులు జరిగాయన్నారు. ప్రమాదాలు మన హక్కుల ఉల్లంఘన జరిగిందని ,400 మందికి పైగా మావోయిస్టు నాయకులు ,కార్యకర్తలు గిరిజన పౌరులు మరణించినట్లుగా తమకు సమాచారం ఉందన్నారు. మహిళా మావోయిస్టులు విస్తృతమైన లైంగిక హింస ఉరిశిక్షలను ఎదుర్కొన్నట్లు నివేదించబడిందన్నారు. అనేకమంది పౌరులను అరెస్టు చేసి చట్ట విరుద్ధంగా నిర్బంధించి హింసించారని పేర్కొన్నారు .శాంతి చర్చలకు ముందు మావోయిస్టు ప్రభావిత గిరిజన ప్రాంతాల నుండి భద్రతా దళాలను వెంటనే ఉపహరించుకోవాలని కోరారు .కొత్త సైనిక మోహరింపులకు ముగింపు పలకాలన్నారు. విప్లవాత్మక ఉద్యమాలను అణిచివేయడానికి గిరిజన వర్గాలపై జాతి నిర్మూలన యుద్ధం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వంపై ఆరోపణలు ఉన్నాయన్నారు .పౌర ప్రాంతాల్లో సైనిక బల ప్రయోగం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.

మిగతా 2లో..



కడవెండిలో

# ఎగిసిపడ్డ కన్నీటి కెరటం

రణంబిడ్డ రేణుకకు అశేష జనవాహిని కన్నీటి వీడ్కోలు

ముగిసిన మావోయిస్టు నేత అంత్యక్రియలు

ఎర్రని జెండాలతో ఎరుపెక్కిన విప్లవాల గడ్డ.. ప్రముఖుల నివాళులు



2లో

# హెచ్‌సీయూ వద్ద ఆగని ఆందోళన



## విద్యార్థుల, అధ్యాపకుల నిరసనలు..పోలీసుల లాఠీఛార్జి

## ఉద్రిక్తంగా యూనివర్సిటీ పరిసర ప్రాంతాలు

**శేరిలింగంపల్లి(జనంసాక్షి):** హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరు బాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా

మిగతా 2లో..



## కంచ గచ్చిబౌలి భూములపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర అటవీశాఖకు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కంచ గచ్చిబౌలి భూములపై ఆందోళనలు వ్యక్తం అవుతున్న వేళ.. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. భూములపై నిజనిర్ధరణ

మిగతా 2లో..

# ఒక్కరోజు పనులు ఆపండి

హెచ్‌సీయూ భూముల వివాదంపై తెలంగాణ హైకోర్టు ఆదేశం

విచారణ నేటికి వాయిదా



**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి.వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్,

మిగతా 2లో..

## రియల్ ఎస్టేట్ కోసమే సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బీఆర్‌ఎస్ ఫిర్యాదు

వార్త 2లో



## ఎస్ఎల్‌బీసీ మృతుల కుటుంబాలకు

# త్వరలో నష్టపరిహారం

మరో 15 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తాం

ఎన్ని ఇబ్బందులొచ్చినా పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరందిస్తాం

టన్నెల్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (జనంసాక్షి):** ఎస్ ఎల్ బి సి సొరంగంలో ప్రమాదం చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమనీ, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.ఎస్ ఎల్ బి సి సొరంగంలో ప్రమాదం జరిగిన రోజు నుండి( ఫిబ్రవరి 22) నేటి వరకు (ఏప్రిల్ 2) జరుగుతున్న సహాయక చర్యల గురించి ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మంత్రికి వివరిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు

మిగతా 2లో..

# చట్టసవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు • లోక్‌సభలో వక్ఫ్‌చట్ట చట్టసవరణ బిల్లుపై వాడీవేడి చర్చ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ

# కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులు



నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా చూస్తూ ఉండాల్సిందేనా?

సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని ఆయనకు ఆదేశించలేమా?

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రశ్న

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో

మిగతా 2లో..

## ముస్లిములను బీసీలంటే ఒప్పుకోడట..!

బీసీల జాబితాలో చేరిస్తే ఇతరులకు న్యాయం జరగదట

లిస్టులో ఎందుకు చేర్చారో సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన బండి సంజయ్

మతపరమైన రిజర్వేషన్లకు మోడీ వ్యతిరేకమని వెల్లడి

ముస్లింలకు లబ్ధి చేకూర్చేందుకే రిజర్వేషన్లు తెస్తున్నారని వ్యాఖ్య

**హైదరాబాద్(జనంసాక్షి) :** మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, ఈ విషయం మీకు తెలియదా అని సీఎం రేవంత్‌ని కేంద్ర మంత్రి బండి ప్రశ్నించారు. విషయం

మిగతా 2లో..

## అమ్మే అంతమొందించింది..

అమీన్‌పూర్ పిల్లల మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి..

వివాహేతర మోజులో పడి పిల్లలు, భర్తను చంపాలని కుట్ర

పెరుగు అన్నం తినకపోవడంతో ప్రాణాతో బయటపడ్డ భర్త

విచారణలో విస్తుపోయే నిజాలు

వార్త 3 పేజీలో

## ప్రేమోన్మాది ఘాతుకం

విశాఖలో యువతి, ఆమె తల్లిపై దాడి

తల్లి మృతి..కూతురు పరిస్థితి విషమం.. ఆస్పత్రిలో చికిత్స

నిందితుడిని గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

వార్త 2లో



## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు 30 వరకు..

ఫీజు చెల్లింపు తేదీని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

2లో



2లో

ప్రతి నియోజకవర్గం నుంచి

## లక్షమందిని తరలించాలి

రజతోత్సవాలపై పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ

## ఆదిలాబాద్ విమానాశ్రయానికి లైన్‌క్లియర్

వాయుసేన నుంచి గ్రీన్‌సిగ్నల్

ఆరు నెలల్లోనే రెండు విమానాశ్రయాలకు అనుమతులు

త్వరలోనే నివేదిక కేంద్రానికి పంపిసాం:మంత్రి కోమటిరెడ్డి

వార్త 2లో

## ఆంధ్రలో తొలి బర్డ్‌ఫ్లూ మరణం

వ్యాధి సోకి చిన్నారి మృతి

## కడవెండిలో ఎగిసిపడ్డ కన్నీటి కెరటం

**పాలకుర్తి/దేవరుప్పుల (జనంసాక్షి):** 35 ఏళ్ల ఉద్యమ జీవితం... ఆదివాసి గిరిజనుల హక్కుల కోసం అసువులు బాసిన అరుణతార గుమ్మడవెల్లి రేణుక అలియాస్ చేతు, అలియాస్ సరస్వతి, అంత్యక్రియలు ముగిశాయి. చత్తీస్ గడ్ అడవుల్లో ఎన్కౌంటర్లో మృత్యువాత పడిన గుమ్మడవెల్లి రేణుక అంత్యక్రియలు స్వగ్రామమైన జనగామ జిల్లా, దేవరుప్పుల మండలం కడవెండి గ్రామం లో బుధవారం అశేష జన వాహిని విప్లవ నినాదాల నడుమ ముగిసాయి. రేణుక మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి కడవెండి గ్రామానికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం నుండి ప్రజలు బారులు తీరి రేణుకకు భాష్పాంజలి అర్పించారు. రేణుక అమరహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ విప్లవకారులు, సానుభూతిపరులు, పౌర సంఘాల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, అరుణోదయ కళాకారులు. ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘన నివాళి అర్పించారు. దీంతో కడవెండి గ్రామమంతా కన్నీటి సంద్రమైంది, రేణుక అంతిమయాత్ర మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు 4 గంటల పాటు జరిగింది. మావోయిస్టు రేణుకకు నివాళి అర్పించేందుకు విప్లవ సానుభూతిపరులు, ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు భారీగా తరలివచ్చారు. రేణుక కు నివాళి అర్పించిన వారిలో పౌర హక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ప్రజాయుద్ధ నౌక గద్దర్ కుమార్తె జీవి వెన్నెల, కుమారుడు జీవి సూర్యకిరణ్, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, అరుణోదయ కళాకారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

చితికి నిప్పు పెట్టిన విప్లవకారులు

మావోయిస్టు నేత అరుణ చితికి విప్లవకారులు, కుటుంబ సభ్యులు నిప్పు పెట్టారు. రేణుక తండ్రి సోమయ్య సోదరుడు మావోయిస్టు పార్టీ మాజీ అధికార ప్రతినిధి, సీనియర్ జర్నలిస్టు వెంకట కిషన్ ప్రసాద్ ఆలియాస్ హుసేన్ది మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు చితికి నిప్పంటించారు.

## హెచ్‌సీయూ వద్ద ఆగని ఆందోళన

బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## ఒక్కరోజు పనులు ఆపండి

హెచ్‌సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరఫున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. "గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి" అని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ఏజీ వాదనలు వినిపించారు. ఇప్పటివరకు ఈ భూమి అటవీ భూమి అని ఒక్క వాదన కూడా లేదు. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని.. అటవీ భూమి కానే కాదన్నారు. నిజాం కాలం నుంచి ఈ భూమి.. బీడు భూమిగానే ఉందని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ 400 ఎకరాలు పరిశ్రమల భూమి అని రికార్డుల్లో ఎక్కడైనా ఉందా? అని హైకోర్టు ఏజీని ప్రశ్నించింది. సర్వే నెంబర్ 25లో ఉన్న ఈ భూములను పలు అవసరాలకు కేటాయిస్తూ వచ్చారని న్యాయస్థానానికి తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

## కంచ గచ్చిబౌలి భూములపై నివేదిక ఇవ్వండి

నివేదిక పంపాలని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సమాచారం అందించింది. కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని, అటవీ చట్టానికి లోబడి వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. వాస్తవ నివేదిక, తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది.

## రియల్ ఎస్టేట్ కోసమే సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం

న్యూఢిల్లీ(జనంసాక్షి): రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం సెంట్రల్ యూనివర్సిటీని సీఎం రేవంత్‌రెడ్డి విధ్వంసం చేస్తున్నాడని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీఆర్ఎస్వీ, హెచ్‌సీయూ విద్యార్థులతో పాటు ఎమ్మెల్సీ కలిశారు. భూములను కాపాడాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు కేంద్రమంత్రిని కలిశామన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. మానవత్వం లేకుండా కర్కషత్వంతో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ–లో 400 ఎకరాలను విధ్వంసం చేస్తున్నారని.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం యూనివర్సిటీ–ని విధ్వంసం చేస్తున్నారన్నారు. ఒక జింకను చంపితే ఐదేళ్ల శిక్ష సల్మాన్ ఖాన్‌కు పడితే.. వందల నెమళ్లు.. జింకలను చంపుతున్న రేవంత్‌రెడ్డికి ఎన్నేళ్ల శిక్ష పడాలని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ లా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని.. యూనివర్సిటీ– విధ్వంసంపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రాజ్యంలో నోరులేని మృగాలు, పేదలు బతకొద్దా? అంటూ నిలదీశారు. ఇదిలావుంటే ఢిల్లీ బాసుల జేబులు నింపేందుకు.. గల్లీలో భూములను తెగనమ్ముతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగినట్లుగా సెంట్రల్ యూనివర్సిటీలోనూ లాఠీఛార్జ్ జరుగుతుందని మండిపడ్డారు.

# బీసీలలంటే భాజపాకు పడదు



మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని సిఎం రేవంత్ అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు– 'అయిననూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారన్నారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారని.. ఆర్టికల్ 370 రద్దు చేశారని... వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చిందని ప్రశ్నించారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొళి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విహెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయానికి లైన్‌క్లియర్

ఆదిలాబాద్ విమానాశ్రయానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అనుమతి – ఆరు నెలల్లోనే రెండు విమానాశ్రయాలకు అనుమతులు – వివరాలు వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి ఆదిలాబాద్ పౌరవిమానాశ్రయానికి వాయుసేన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు తమకు లేఖ అందిందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు కావాలన్న ఎన్నో ఏళ్ల కల నేరవేరిందని, ఈ సందర్భంగా జిల్లా ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలందరికీ మంత్రి శు భాకాంక్షలు తెలిపారు. కొద్ది రోజుల క్రితం మామునూర్‌ఎయిర్?పోర్టుకు అనుమ తులు సాధించామని, ఇప్పుడు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు భారత వాయుసేన అధికారులు సముఖత వ్యక్తం చేయడంతో పాటు అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపారని మంత్రి తెలిపారు. వీటితో పాటు తెలంగాణ ప్రభుత్వానికి పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు కావాల్సిన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు వాయుసేన అధికారులు లేఖ ద్వారా తెలిపారని వివరించారు. ఈ విమానాశ్రయాన్ని పౌర విమానయానానికి, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్లు మంత్రి తెలిపారు. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం చేయడంతో పాటు, పౌర టర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ వంటి ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఇందుకు అవసరమైన భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు సమకూర్చుకోవాలని వాయుసేన అధికారులు లేఖలో సూచించినట్లు మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిటెయిల్డ్ ప్రపోజల్స్‌ను భారత వాయుసేనకు సమర్పించాలని కోరినందున అందుకు సంబంధించిన తదుపరి కార్యాచరణను అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. అతిత్వరలోనే నివేదికను కేంద్రానికి, సమర్పిస్తామన్నారు

## శాంతి చర్చలకు సిద్ధం

మేధావులు మానవ హక్కుల సంస్థలు, జర్నలిస్టులు, విద్యార్థులు, పర్యావరణ కార్యకర్తలు ,శాంతి చర్చల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం ముందస్తు షరతులకు అంగీకరిస్తే చర్చల్లో పాల్గొనటానికి మావోయిస్టు పార్టీ అందుకు సుముఖతను వ్యక్తం చేస్తుందన్నారు. ప్రభుత్వం సైనిక కార్యకలాపాలను ఆపిన వెంటనే కాల్పుల విరమణ ప్రకటిస్తామని సిపిఐ మావోయిస్టు పార్టీ ఈ లేఖలో వెల్లడించింది.

## ఆంధ్రలో లొలి బర్డ్‌ఫ్లూ మరణం

**పల్నాడు(జనంసాక్షి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తొలి బర్డ్ ఫ్లూ మరణం సంభవించింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన రెండేళ్ల చిన్నారి బర్డ్ ఫ్లూ వైరస్ తో మృతి చెందింది. పచ్చి కోడి మాంసం తినడం వల్ల బర్డ్ ఫ్లూ



సోకి మరణించిందని ఎయిమ్స్ వైద్యులు ధృవీకరించారు. గత నెల 4వ తేదీన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో మంగళగిరి ఎయిమ్స్‌లో చిన్నారిని జాయిన్ చేశారు. చిన్నారి మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. అయితే, చికిత్స అందించే సమయంలో చిన్నారి గొంతు, ముక్కు నుంచి స్వాబ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. నివేదిక అనుమానంగా రావడంతో పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్ కు శాంపిల్స్ పంపారు వైద్యులు. అయితే, చిన్నారికి హెచ్5 ఎన్1 వైరస్ గా నిర్ధారణ అయింది. బర్డ్ ఫ్లూ మృతిగా తేలడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

## ప్రొఫెసర్లపై లాఠీచార్జీ సరికాదు

### కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోంది:హరీశ్

**హైదరాబాద్(జనంసాక్షి):** విద్యావంతులైన ప్రొఫెసర్ల లాఠీచార్జీ చేయడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని రేవంత్ రెడ్డి సోకాల్డ్ ప్రజాపాలన తలపిస్తుందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చని అడవిని నాశనం చేయొద్దని శాంతియుతంగా నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. రేవంత్ సర్కార్ వల్ల ఏ వర్గం ప్రశాంతంగా లేదని విమర్శించారు. మొన్నటి నుంచి మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్.. ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల రక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు.

## ప్రేమోన్మాది ఘాతుకం

**విశాఖపట్టణం(జనంసాక్షి):** మధురవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. స్వయంకృషి నగర్‌లో ఓ అమ్మాయి, ఆమె తల్లిపై ప్రేమోన్మాది దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా.. కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ప్రేమను నిరాకరించిందనే కోపంతో మధురవాడ స్వయంకృషి నగర్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో యువతితో పాటు, ఆమె తల్లిపై ఓ వ్యక్తి కత్తితో అతి కిరాతకంగా దాడి చేసి పరారయ్యాడు. ఈ ఘటనలో తల్లి లక్ష్మి మృతిచెందారు. యువతి దివ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన యువకుడు నవీన్‌గా తెలుస్తోంది. పోలీసులు అక్కడకు చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ పేరుతో యువతిని నవీన్ అనే వ్యక్తి కొంత కాలంగా వేధింపులకు గురిచేశాడు. అయితే ప్రేమను నిరాకరించడంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించాడు. వెంటనే యువతి ఇంటికి వెళ్లిన యువకుడు కత్తితో యువతితో పాటు ఆమె తల్లిపైనా దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన తల్లి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా.. యువతి తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం యువతి.. గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 48 గంటలు గడిస్తే గాని ఆమె పరిస్థితి ఎలా ఉంది అనేది చెప్పలేమని వైద్యులు చెప్పారు.

## ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు 30 వరకు..

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది.

## ఎస్ఎల్‌బిసీ మృతుల కుటుంబాలకు త్వరలో నష్టపరిహారం



నిష్ణాతులైన అధికారులు, నాగర్ కర్నూల్ జిల్లా యంత్రాంగం, నిర్విరామంగా తమ సేవలను అందిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నామని, సహాయక బృందాలకు కావలసిన సామాగ్రిని అందుబాటులో ఉంచుతూ అత్యంత ఆధునికమైన యంత్రాలతో విపత్కర పరిస్థితులలో సహాయక చర్యలు చేపడుతున్నట్లు, నిరంతరాయంగా వస్తున్న నిమిషానికి పదివేల లీటర్ల ఊట నీటిని అత్యధిక సమర్థంగా పంపుల ద్వారా బయటికి తరలిస్తున్నట్లు, మట్టి తవ్వకాలను సహాయక బృందాల ద్వారా , ఆర్మీ హైడ్రా చెందిన ఎస్కవే టర్ల ద్వారా మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్ట్ గుండా బయటికి పంపుతున్నట్లు, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన బృందాలు స్టీల్ను కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు, సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆనవాళ్లు తెలుసుకునేందుకు కేరళకు చెందిన కడవర్ డాగ్స్ సేవలను ఉపయోగించుకుంటున్నట్లు వివరించారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమల పెంట లోని ఎస్ ఎల్ బి సి టన్నెల్ ను సందర్శించి, ఎస్ ఎల్ బి సి టన్నెల్ వద్ద సహాయక చర్యలపై ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం%ా%. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ, టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు 15 రోజుల్లో పూర్తికానున్నట్లు తెలిపారు. ఎస్ .ఎల్. బి. సి ప్రాజెక్టు ద్వారా నల్గొండ – ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసే కృష్ణానదీ జలాలు మరో రెండున్నర సంవత్సరాలలో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు ప్రభుత్వ పక్షాన సహాయక చర్యలు చేపట్టేవారికి ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, ప్రత్యేక పర్యవేక్షణాధికారి శివశంకర్ లోతేటి, కలెక్టర్, ఎస్పీ అధికారులు, తదితరులు ఉన్నారు.

## కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులు

విచారణ జరిగింది. తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల భారాస నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుంది. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు" అని ముకుల్ రోహత్గీ వాదించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో.. ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని.. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు. "2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు" అని కోర్టుకు తెలిపారు.

## ముస్లిములను బీసీలలంటే ఒప్పకోడట..!

తెలిసి కూడా ముస్లింలను బీసీ జాబితాలో ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కదా అని బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంచుకునేందుకు కేంద్రం అమోదం తెలపాలని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా బుధవారం జరిగిన బీసీ మహాగర్జన ధర్నాలో చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. 'తెలంగాణలో 56 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే 46 శాతానికి తగ్గించింది. 80 శాతానికి పైగా ముస్లింలను బీసీ జాబితాల్లో చేర్చి బీసీల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే కేంద్రం ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. కాంగ్రెస్ రూపొందించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లులో 10 శాతం మంది ముస్లింలే ఉన్నారు. అంటే ఈ బిల్లువల్ల ముస్లింలు అదనంగా 10 శాతం రిజర్వేషన్ల లబ్ది పొందితే, బీసీలకు అదనంగా దక్కేది 5 శాతం మాత్రమే. ఈ లెక్కన బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసినట్లా? అన్యాయం చేసినట్లా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరును చూస్తుంటే ముస్లింల కోసమే బీసీ రిజర్వేషన్లు తెచ్చినట్లు స్పష్టమవుతోంది' అన్నారు.

రిజర్వేషన్లు అమలు చేసుకునే అధికారం ఉంది

'రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ప్రకారం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా డెడికేషన్ కమిషన్ వేసుకుని చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేసుకునే అధికారం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఆ హామీ ఇచ్చేటప్పుడు మోడీ ప్రభుత్వాన్ని సంప్రదించి ఇచ్చారా? మరి ఇప్పుడెందుకు మోడీ ప్రభుత్వంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని నిలదీశారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని షో చేయడం కాదు... ఆ రాజ్యాంగంలో ఏముందో అర్థం చేసుకొని అమలు చేయాలనే ఇంగిత జ్ఞానం కాంగ్రెస్ నేతలకు లేదని ధ్వజమెత్తారు.

## ప్రతీ నియోజకవర్గం నుంచి లక్షమందిని తరలించాలి

**గజ్వేల్(జనంసాక్షి):** భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు– చూసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ–ఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

# టీజీఎస్ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణ

- యూనిట్ 12 బెడ్‌లకు పెంపు.. సీఎస్ఆర్ కింద ఐఓసీఎల్ ఆర్థికసాయం




**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** తమ ఉద్యోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించడంలో భాగంగా తార్నాక ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను విస్తరించాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ప్రస్తుతం ఆ యూనిట్‌లో 4 బెడ్‌లుండగా.. వాటికి అదనంగా 8 బెడ్‌లను సంస్థ ఏర్పాటు చేయనుంది. దీంతో 12 బెడ్ల ఎమర్జెన్సీ కేర్ యూనిట్ ఆర్టీసీ ఉద్యోగులకు అందుబాటులోకి రానుంది. ఈ యూనిట్ విస్తరణకు సీఎస్ఆర్ కింద నిధులు కేటాయించాలని ఆర్టీసీ అధికారులు పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ అయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) అంగీకరించింది. ఈ మేరకు రూ.కోటి సాయం చేసేందుకు ముందుకువచ్చింది. నిర్మాన్ డాట్ ఓఆర్‌జీ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ యూనిట్‌ను ఐఓసీఎల్ విస్తరించనుంది. దీంతో పాటు ఆర్టీసీ ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణను ఇచ్చేందుకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు సహకరించనుంది.

హైదరాబాద్ బస్ భవన్‌లో బుధవారం తార్నాక ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను విస్తరణకు సంబంధించిన ఒప్పందం టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సమక్షంలో జరిగింది. ఐఓసీఎల్, నిర్మాణ్ డాట్ ఓఆర్‌జీ ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తూ తార్నాక ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను విస్తరిస్తున్నామని, అందుకు సహకరిస్తోన్న ఐఓసీఎల్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే 12 బెడ్ల ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌తో పాటు క్యాథ్‌ల్యాబ్ సేవలు ఉద్యోగులకు అందుబాటులో వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ ప్రతినిధులు ఎస్‌సీ మెస్‌రాం, పి.కైలాష్ కాంత్, వీవీఎస్ చక్రవర్తి, నిర్మాన్ డాట్ ఓఆర్‌జీ సీవోవో పుల్లా అనురాధతో పాటు తార్నాక ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గెస్ట్ లెక్చరర్స్‌కు, గెస్ట్ ఫ్యాకల్టీకి నెలకు రూ.50 పెంచండి

- ఇచ్చిన హామీలు అమలు చేయండి
- ఖాళీ పోస్టులను భర్తీ చేయండి
- రాష్ట్ర ముఖ్యమంత్రికి సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** గెస్ట్ లెక్చరర్స్‌కు, గెస్ట్ ఫ్యాకల్టీకి నెలకు రూ.50 పెంచండని, ఇచ్చిన హామీలు అమలు చేయండని, ఖాళీ పోస్టులను భర్తీ చేయండని రాష్ట్ర ముఖ్యమంత్రికి సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ లేఖ రాశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్స్‌గా, గెస్ట్ ఫ్యాకల్టీగా, పార్ట్ టైమ్‌గా చేస్తున్నవారు సుమారు 1240 మంది వున్నారని, వీరు గత 20 ఏళ్ళకు పైగా పనిచేస్తున్నారు. వీరికి సాధారణ సెలవులతో పాటు, కనీస వేతనం ఇవ్వడం లేదని లేఖలో పేర్కొన్నారు. పని గంటలు పెరిగినా పనికి తగ్గట్టుగా వేతనం పెరగడం లేదని, నెలకు రు.28వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, వీరు పొందుతున్న తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను పోషించుకోలేక, ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలను చదివించుకోలేని పరిస్థితిల్లో వున్నారని తెలిపారు. నెలకు రూ.50వేల వేతనం పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, సంవత్సరం దాటినా హామీ అమలు జరగలేదని పేర్కొన్నారు. మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుండి స్పందన లేదని, తక్షణమే తమరు జోక్యం చేసుకుని వీరికి ఇచ్చిన హామీ ప్రకారం నెలకు కనీసం రు.50వేల వేతనం పెంచాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీల్లో, కళాశాలల్లో దాదాపు 1940 పోస్టులు ఖాళీలున్నాయని, ప్రభుత్వం ఇప్పటికీ ఈ పోస్టులను భర్తీ చేయడం లేదని, తగిన విద్యార్హతలు కూడా వీరికి ఉన్నాయని తెలిపారు. వాటిని భర్తీ చేసివుంటే 20 సంవత్సరాల క్రితమే వీరు రెగ్యులర్ అయ్యేవారని, తక్షణమే ఈ పోస్టులను ప్రాధాన్యత క్రమంలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఉగాది పురస్కారం అందుకున్న ఉపాధ్యాయుడు



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) :** ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కవి, రచయిత, అయిన క్యాస సంతోష్ కుమార్ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. శృంగేరి శ్రీ శారదా పీఠము మరియు శ్రీలక్ష్మీ గణపతి ఆలయము సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ అరుణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో భాగంగా ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. ఈ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్, శ్రీలక్ష్మీ గణపతి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మశ్రీ డాక్టర్ అరుణ్ కుమార్ శర్మ మరియు ప్రముఖ కవులు చింతల శ్రీనివాస్ గుప్తా, డాక్టరు కాసర్ల నరేష్ రావు తదితరులు సంతోష్ ను అభినందించి జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు.

# అమ్మే అంతమొందించింది!

- వివాహేతర సంబంధం కోసం పిల్లలను చంపిన తల్లి
- ఊపిరాడకుండా చేసి తన ముగ్గురు పిల్లలను కిరాతకంగా హత్య
- అమీన్ పూర్ ముగ్గురు పిల్లల మరణాలపై వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**ఉమ్మడి మెదక్ జిల్లా (జనంసాక్షి) :** తన వక్రబుద్ధితో ఓ తల్లి అభం శుభం తెలియని తన పిల్లలనే చంపిన ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. మానవత్వం అనేది మరిచి తన ముగ్గురు పిల్లలనే చంపిన సంఘటన పలచబడుతున్న కుటుంబ బంధాలను సాక్షంగా మిగులుతున్నాయి. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటి పరిధిలోని రాఘవేంద్ర కాలానికి గత నెల 28 మార్చి రోజున అనుమాస్పదంగా మరణించిన ముగ్గురు పిల్లల మరణాలు మిస్టరీ వీడింది. మార్చి 28 తేదిన తెల్లవారుజామున 3 గంటల సమయంలో ప్రయివేటు ఆస్పత్రి నుంచి డయల్ 100 కి కాల్ వచ్చింది. దింతో వెంటనే పోలిసు సిబ్బంది ఘటన స్థలం వెళ్లారు. పోలీసులు వెళ్లే సరికి ముగ్గురు చిన్నారులు నోటిలో నురగతో చనిపోయి ఉన్నారు. ముగ్గురు పిల్లల తల్లి రజిత కడుపునొప్పి అని హస్పటల్ చేరిడం, పిల్లలు చనిపోయి ఉండటంతో అందరు ఫుడ్ పాయిజన్ అని అనుకున్నారు . వెంటనే క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. మరణించిన పిల్లలముగ్గురి మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే తన భార్య ,పిల్లలందరు రాత్రి పెరుగన్నం తిన్నారని ,తను మాత్రం పప్పన్నం తిన్నాను అని రజిత భర్త చెన్నయ్య చెప్పడంతో విష ఆహారం తిని చనిపోయరనే అనుమానం పెరిగింది. కానీ పోలిసుల విచారణలో పిల్లల్ని తల్లే చంపినట్టు గుర్తించారు. పిల్లలపై ఎలాంటి విషప్రయోగం జరగలేదని డాక్టర్లు నిర్ధారించారు.

**ప్రియుడి పై మోజులో ..పిల్లల హత్య**

వివాహేతర సంబంధం కారణంగా తన ఈ ముగ్గురు పిల్లలను హత్య చేసినట్టు తల్లి రజిత ఒప్పుకుంది భర్త, భార్య మధ్య ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉండటంతో రజిత తన పాత స్నేహితుడితో పరిచయం పెట్టుకుంది. అతడితో వివాహేతర సంబంధం కారణంగా పిల్లల్ని అడ్డు తొలగించాలని అనుకుని హత్యకు ప్లాన్ చేసింది. ముగ్గురు పిల్లల్ని టవల్ తో ఊపిరాడకుండా చేసి చంపేసింది. ప్రియుడు శివ కుమార్ మోజులో పడిలో పడి కన్న తల్లినే అనే విషయంను మరిచి విచక్షణ కొల్పోయి, ప్రియుడితో సంతోషంగా కలిసి ఉండాలని హత్య చేసింది.

పోలీసుల వివరాల ప్రకారం రజిత ఏ లావణ్యకు ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం చదువుతున్న సమయం (2013) లో తనకన్నా వయస్సులో 20 సంవత్సరాలు పెద్ద వాడైన అవురిచింతల చెన్నయ్య వివాహ జరిగింది. వీరికి ముగ్గురు (1.సాయి కృష్ణ, వయస్సు: 12 సం,లు, 2. మధుప్రియ, వయస్సు: 10 సం,లు, 3. గౌతమ్, వయస్సు: 8 సం,లు) పిల్లల సంతానం కలదు. వీరి స్వస్థలం మెధక్ పల్లి గ్రామం, తలకొండపల్లి మండల్, రంగారెడ్డి జిల్లా. గత మూడు సంవత్సరాల క్రితం నుండి అమీన్పూర్ మున్సిపాలిటి బీరంగూడ, రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్ గా, రజిత ప్రైవేట్ స్కూల్ టీచర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు 6 నెలల క్రితం రజిత ఏ లావణ్య 10వ తరగతి క్లాస్మేట్స్ అందరూ కలిసి గెట్ టు గెదర్ పార్టీ జరుపుకుందామని ప్లాన్ చేసుకుంటున్న సమయంలో తన 10వ తరగతి క్లాస్ మేట్ అయిన శివతో స్నేహం ఏర్పడింది. పూర్వ విద్యార్థుల సమ్మేళనం తర్వాత వీరు మధ్య బంధం మరింతగా పెరిగి రోజు చాటింగ్, కాల్స్, వీడియో కాల్స్ మాట్లాడేవారు. భర్తకు తెలియకుండా చాలా సార్లు శారీరకంగా కూడా కలిశారు. శివ పరిచయం తర్వాత రజిత అలోచన సరళి పూర్తిగా మారింది రజిత కు భర్త చెన్నయ్యకు ఎక్కువ ఏజ్ గ్యాప్ ఉండడం వల్ల మొదటి నుండే రజితకు చెన్నయ్య అంటే ఇష్టం ఉండేది కాదు. భర్యభర్తలు తరచూ గొడవలు పడేవారు. శివ కలిసినప్పటి నుండి రజిత జీవితం ఆనందంగా ఉందని, శివకు పెళ్లి కాకపోవడంతో ఎలాగైనా అతన్ని పెళ్లి చేసుకుని జీవితాంతం సుఖంగా ఉండాలని అనుకుంది. పెళ్లి చేసుకోమని శివను ఆడగింది రజిత ... ఒకవేళ రజితకు పెళ్లి కాకపోయి ఉంటే, పిల్లలు లేకుంటే ఉంటే ఒంటరీగా తనతో వస్తా అంటే ఖచ్ఛితంతా పెళ్లి చేసుకుంటా అని శివ చెప్పడు. దింతో ప్రియుడు శివను పెళ్లి చేసుకోవాలంటే తనకు పుట్టిన పిల్లల అడ్డు తొలగించుకోవాల్సిందే అని నిర్ణయించుకున్నది. మార్చి 27 తేదిన మర్డర్స్ ప్లాన్ చేసారు రజిత ,శివ. అదే రోజు రాత్రి తన భర్త భోజనం చేసి రాత్రి 10.00 గంటలకి ట్యాంకర్ తీసుకొని చందానగర్ వెళ్ళగా అదే మంచి సమయం అని భావించి, మొదటగా పెద్ద కొడుకు సాయికృష్ణ ను, కూతురు మధుప్రియ ఆతర్వాత చిన్న కొడుకుని గౌతమ్ ను ఇలా ముగ్గురిని ఒకరి తరువాత ఒకరిని ముక్కు, మూతిపై టవల్ వేసి, చేతితో గట్టిగా అధిమి పట్టుకొని, ఊపిరాడకుండా చేసి, చంపివేసినట్లు విచారణలో తేలింది. ఏ-1 రజిత , ఏ-2 శివ లు కుట్ర పన్ని అత్యంత కిరాతకంగా ముగ్గురు పిల్లలను ఊపిరాడకుండా చేసి చంపివేసిందని, నిందితులిద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, రిమాండుకు తరలించడం జరుగుతుందని సంగారెడ్డి జిల్లా పరితోష్ పంకజ్ తెలిపారు. అమీన్ పూర్ ముగ్గురు పిల్లల మరణాలకు సంబంధించిన మిస్టరీని, నిందితుల వివరాలను సంగారెడ్డి జిల్లా పరితోష్ పంకజ్ మీడియాకు వివరించారు. ఈ ప్రెస్ మీట్ నందు పటాన్ చెర్వు డియస్పీ రవీందర్ రెడ్డి, అమీన్ పూర్ సి ఐ నరేష్, పటాన్ చెరువు డిఐ రాజు ఇన్స్పెక్టర్, అమీన్ పూర్ పిఎస్ ఎస్ఐలు సోమేశ్వరి తదితరులు ఉన్నారు.



# మెట్రో సమయం పొడిగింపు

**హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరవాసులకు మెట్రో సేవలు ఎంతో కీలకంగా మారాయి. ఎందుకంటే నగరంలో ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య వల్ల చాలా సమయం పడుతుంది. అదే మెట్రోలో వెళితే.. నిమిషాల్లో వెళ్లవచ్చు. అందుకే చాలామంది మెట్రోలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మెట్రో సేవల సమయాన్ని పొడిగించాలని ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తున్నారు. మన భాగ్యనగరంలో తక్కువ కాలంలోనే పాపులర్‌గా మారిన మెట్రో రైలు సర్వీసులు విషయంలోనూ అనేక మంది ప్రయాణికులు రాత్రి 12 గంటల వరకు సేవలు సేవలు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. ఎట్టకేలకు అది నెరవేరింది. ప్యాసింజర్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది హైదరాబాద్ మెట్రో. మెట్రో రైల్ సమయం పొడిగించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ సమయాన్ని పొడిగించారు హైదరాబాద్ మెట్రో అధికారులు. మారిన టైమింగ్స్ ప్రకారం.. ఇక మీదట సోమవారం నుంచి శుక్రవారం వరకు.. ఆయా టెర్మినల్ స్టేషన్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల 45 నిమిషాల దాకా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. శనివారం నాడు ఆయా టెర్మినల్ మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు తొలి మెట్రో స్టార్ట్ అవుతుంది. రాత్రి 11 గంటల వరకు రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక నుంచి ఆదివారం నాడు ఉదయం 7 గంటలకు ఆయా టెర్మినల్ స్టేషన్ నుంచి ఫస్ట్ మెట్రో రైలు మొదలవుతుంది. సండే కూడా రాత్రి 11 గంటల వరకే రైళ్ల రాకపోకలు ఉంటాయి.

# వరంగల్ చపాట మిర్చికి జీఐ ట్యాగ్ సర్టిఫికెట్

- నాటి కృషికి నేడు దక్కిన ఫలితం...
- మిర్చి రైతులకు శుభాకాంక్షలు : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 2 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలో పండుతున్న చాపాట మిర్చికి అంతర్జాతీయ గుర్తింపు జియాలాజికల్ ఇండికేషన్ ట్యాగ్ లభించడం ప్రపంచ స్థాయిలో వరంగల్ మరియు నర్సంపేట మిర్చికి లభించిన గొప్ప గుర్తింపు అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శాసనసభ్యునిగా నేను చేసిన కృషి నేడు గొప్ప ఫలితాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. దూర దృష్టితో రైతులను ఆర్థికంగా పరిపుష్టి చేయడానికి రైతులను ఐక్యం చేయాడానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి నేడు సత్ఫలితాలను అందించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కూడా మన ప్రాంతానికి లభించడం గర్వకారణం. అని ఆయన అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి మండలం తిమ్మంపేట పేరు మీద చపాట మిర్చికి జిఐ సర్టిఫికేట్ లభించడానికి కృషి చేసిన నాటి వ్యవసాయ అధికారులకు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో చపాట మిర్చికి మంచి ధర పలకడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునే సౌకర్యం కూడా లభిస్తుంది కావున ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు అనంతరం రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. మిరప రైతులకు రాబోవు రోజుల్లో మంచి రోజులు రానున్నట్లు ఆయన వెల్లడించారు.

# కోల్ ఇండియా పెన్షన్ ఫండ్‌కు టన్నుకు రూ.10 అదనంగా జమ చేయడానికి నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రస్తుతం కోల్ ఇండియా లిమిటెడ్ ద్వారా టన్నుకు రూ. 10 చొప్పున పెన్షన్ నిధికి జమ చేయడానికి నిర్ణయించిందని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ తెలిపారు. ఇక నుంచి అదనంగా టన్నుకు మరో రూ.10 అదనంగా జమ చేస్తామని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లకు సమాచారం అందించిందని, కోల్ కత్తా లో జరిగిన బోర్డు సమావేశంలో ఇతర విషయాలతోపాటు, 10 రూ.ల పెంపును ఆమోదించినట్లు యాజమాన్యం తెలియజేసిందని పేర్కొన్నారు. కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్- 1998 నిధికి సహకారం కోసం కోల్ ఇండియాలోని నియంత్రిత మరియు నియంత్రితేతర రంగాలకు బొగ్గు నోటిఫైడ్ ధరలో ప్రస్తుతం ఉన్న రూ. టన్నుకు 10 నుండి రూ. టన్నుకు రూ. 20, నాన్-కోకింగ్ కు రూ. కోకింగ్ బొగ్గుకు టన్నుకు 10 రూపాయలు అదనమని, ఇది ఏప్రిల్ 16, 2025 నుండి అమల్లోకి వస్తుంది.గతంలో జరిగిన కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశంలో, పెన్షన్ నిధిని బలోపేతం చేయడానికి టన్నుకు రూ. 10 చొప్పున ఎక్కువ ఇవ్వాలని ఏకాభిప్రాయం కుదిరిందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం కూడా ప్రతి టన్ను బొగ్గు పై రూ.10 పెన్షన్ ఫండ్ కు జమ చేయాలని కోరారు.

# మహనీయుల సేవలను మరిచిపోవద్దు

- వారి ఆశయాలను కొనసాగించాలి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 02(జనంసాక్షి) :** దేశం కోసం పేద పీడిత వర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుల సేవలను మర్చిపోవద్దని, వారి ఆశయ సాధనను కొనసాగించాలని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లోని సంక్షేమ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న 315 వ వర్ధంతి కార్యక్రమమునకు రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ పేద పీడిత అన్ని వర్గాల పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన మహా గొప్ప వ్యక్తి సర్దార్ పాపన్న అని కొనియాడారు. మహనీయుల చరిత్రను భావితరాల వారికి అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహనీయులను ఆదర్శంగా తీసుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రాజకీయ, ఉద్యోగలలో రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. మొగులు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో సర్దార్ పాపన్న ముందుండి పోరాటం చేశారని, పోరాటాలు చేసిన మహనీయులను నేటి యువతరం మర్చిపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పాపన్న ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, గౌడ సంఘం సభ్యులు రాజేందర్ గౌడ్, ముజ్యల భిక్షపతి, గౌడ కుల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆవరణలో క్షుద్రపూజలు




**ములుగు/ వెంకటాపూర్, ఏప్రిల్02 (జనంసాక్షి):** వెంకటాపూర్ పాఠశాల ఆవరణలో క్షుద్రపూజలు చేసిన ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ లో జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పసుపు,కుంకుమ, నిమ్మకాయలు పెట్టి ముగ్గుపోసి క్షుద్రపూజలు చేసినట్లు తెలిపారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పూజలపై స్థానికులు ఆరా తీస్తున్నారు.

**పాస్‌పోర్టు పోయినది**

నేను, అనగా **శ్రద్ధా అగర్వాల్ భర్త లోకేష్ అగర్వాల్ (36),** ఇంటి నెం. 6-3-1111/13, కీర్తిలాల్ జ్యువెలర్స్ వెనుక, ఆదిత్య ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా, హైదరాబాద్-500082. నా యొక్క పాస్‌పోర్ట్ నంబర్ **F6070130** గలది 17.01.2006న హైదరాబాద్‌లో జారీ చేసియున్నారు. ఇట్టి పాస్‌పోర్టు 16.01.2016న గడువు ముగిసింది. 25.10.20 24న నా ఇంటిని శుభ్రం చేస్తున్నప్పుడు అది ఎక్కడో పడిపోయింది. తర్వాత ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో దయచేసి ఈ క్రింది నంబర్‌కు తెలియజేయగలరు. తగిన పరితోషికం ఇవ్వబడును. సెల్ : 98490 46674

# విద్యార్థులపై అమెరికా కక్షసాధింపు




వందలాదిమంది విదేశీ విద్యార్థుల మీద ట్రంప్ కక్షకట్టి కఠిన నియమాలను విధించి, వారిని దేశం విడిచి స్వదేశాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేయటం ఎంత మాత్రం న్యాయం కాదు. విద్యార్థులు చేసిన తప్పేమిటి ? ఏడాదిన్నరకు పైగా గాజా, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఒక భయానక యుద్ధాన్ని అపమని కోరటం తప్పా? మానవ మారణ కాండకు శాంతియుతంగా నిరసిన తెలపడం నేరమా? అన్యాయాన్ని ఎదిరించటం ప్రజాస్వామిక హక్కు కాదా?

యుద్ధం వద్దు పిల్లలను, మహిళలను, వృద్ధులను కాపాడండి అని వేడుకోవటం ట్రంప్ దృష్టిలో దేశద్రోహం అయింది. స్వేచ్ఛాయుత భావ ప్రకటనకు పుట్టినిల్లని ఘనంగా చాటుకున్న అమెరికాలో విద్యార్థులను ఉగ్రవాదులకు మద్దత్తుదార్లుగా ముద్ర వేసి అమెరికా నుండి బహిష్కరించడం అమానుషం.

అమెరికాలో రాజ్యాంగ చట్టం ఏం చెబుతుందో ట్రంప్ కు అనవసరం. ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆయనకు గౌరవం లేదు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనే ఆయన తన అప్రజాస్వామిక నిజ స్వరూపాన్ని చూపించాడు. తనకు ఎన్నికల్లో ఓటమి తప్పదు అని తెలియగానే అధికారం కోసం తన పార్టీ కార్యకర్తలను,తన అభిమానులను అధ్యక్ష భవనం పైకి ఉసిగొల్పా డు. రెండోసారి అధ్యక్షుడుగా అధికారంలోకి రావడంతో ఇప్పుడు తన నియంత విశ్వ రూపాన్నే తిరిగి ప్రదర్శిస్తున్నాడు. వందలాదిమంది విదేశీ విద్యార్థులను తెల్లవారుజామునే నిద్ర లేపి వారిని తట్టాబుట్టా సర్దుకొని అమెరికాను విడిచిపెట్టి స్వదేశాలకు పోవాలంటూ ఆజ్ఞలు జారీ చేయటం మూరత్వం. ఈ విద్యార్థులు ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోలేదు విధ్వంసాలు సృష్టించిందీ లేదు. వారు తోటి ప్రజలు జీవించే హక్కు గురించి శాంతియుతంగా గుమిగూడి నినాదాలు మాత్రమే చేశారు. అది కూడా నేరమా?

**స్వేచ్ఛకు సమాధి**


విద్యార్థులుగా వారు గాజా ఘోరాకలిని ప్రశ్నించడం, ఆకలి దప్పికలతో అల్లాడుతున్న లక్షలాది మందిని ప్రజలను రక్షించమంటూ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లో నినాదాలు చేశారు. అది ప్రభుత్వంపై, రాజ్యంపై తిరుగుబాటు ఎలా అవుతుందో... ఊహకు కూడా అందదు. పాలస్తీనా పౌరుల మానవ హక్కులను గురించి మాట్లాడటమే ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడంగా, విద్యార్థుల నిరసనలను హమాస్ అనుకూల వాదంగా చిత్రించి అమాయకపు విద్యార్థులను దేశద్రోహులుగా ముద్ర వేసి శిక్షించడం అన్యాయం, అక్రమం.

అమెరికా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చేసిన శాంతియుత ఉద్యమాలు ఇజ్రాయెల్‌కు మొదటి నుండీ కొమ్ముకాస్తున్న అమెరికా ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేసింది. ఇజ్రాయిల్‌కు శక్తి మంతమైన ఆయుధాలను సమకూరుస్తూ,దారుణ మారణ కాండకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న అమెరికా పాలకులు ఈ విద్యార్థులు ఉద్యమం చేసిన కారణంగా ఇజ్రాయెల్ ను ఆక్షేపించవలసి వచ్చింది. మానవతాసాయం కొంత చేయాల్సి వచ్చింది. యూనివర్సిటీలు సైతం తమ నడవడికను, గతకాలపు విలువలను తడిమి చూసుకోవాల్సి వచ్చింది. యుద్ధాలు ఆపిన చరిత్ర విద్యార్థులకు ఉన్నదనీ, వియత్నాంలో తమ ప్రభువులను ప్రశ్నించే శక్తి వారికి ఉన్నదన్న సంగతి ట్రంప్ కు తెలుసు. అందుకే కాల్పుల విరమణను నీరుగార్చి, గాజాను ఖాళీచేయించే క్రమంలో నెతన్యాహూతో కలసి అమెరికా తిరిగి మారణకాండను అమలు చేస్తున్న ట్రంప్ కు స్వదేశంలో ఒక్క అసమ్మతి స్వరం వినిపించినా మళ్ళీ నిప్పురాజుకొనే ప్రమాదం ఉన్నదని ఆయనకు బాగా తెలుసు.

అందుకే, ఈ విదేశీ విద్యార్థులను వెదికి వెదికి, మరీ దేశంనుంచి గెంటేస్తున్నారు. విద్యార్థులకు తమ వివరణలు ఇచ్చుకొనే అవకాశం కూడా ఇవ్వటం లేదు. సమాధానం చెప్పుకొనే వేదిక కూడా లేదు. కేవలం ఏదో ఒక నేరారోపణ మోపడం. ఒకే ఒక్క ఈమెయిల్ సందేశంతో దేశ బహిష్కరణ జరిగిపోతోందంటూ బెదిరించటం పరిపాటైపోయింది. వీసాలు రద్దయినంత మాత్రాన విద్యార్థులు భయపడి తమ స్వ దేశాలకు పోనవసరం లేదని, యూనివర్సిటీల దయా దాక్షిణ్యాలున్నంత వరకూ విద్యార్థులు అక్కడ నిక్షేపంగా ఉండ వచ్చునని మరి కొందరు విద్యార్థులకు ధైర్యం చెబుతూ, సలహాలు ఇస్తున్నారు. కానీ, అమెరికా తన ఆదర్శాలకు , లక్షాలకు విలువలకు పాతర వేస్తూ, విజ్ఞానానికి నెలవుగా ఉండాల్సిన విశ్వ విద్యాలయాలను మిలటరీ క్యాంపులుగా మారుతున్న సమయంలో విద్యార్థులు అక్కడ ఉండి కూడా ప్రయోజనమేమిటన్నదే అసలు ప్రశ్న.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.




# తిట్ట పోరా... అనుకుంటూనే!

పార్లమెంట్‌లో బుధవారం వక్‌బోర్డులో ఉన్న హక్కులను దాదాపు రూపుమాపుతూ తెచ్చిన సవరణ బిల్లుపై హెూం మంత్రి అమీషా కేంద్ర మంత్రి ఇద్దరు కూడా మాట్లాడిన తీరు చాలా ఆందోళనకరంగా ఉంది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలన్నీ బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయించుకుని మాట్లాడడం జరిగింది. కాంగ్రెస్ ఇది ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివారం ఎజెండా అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారని పేర్కొంది. ముస్లిం మైనార్టీలకు, వారి హక్కుల ఉల్లంఘనలు బిల్లులో ఎక్కడ కూడా భంగం లేదని హెూం మంత్రి అమిత్ షా పేర్కొంటూనే వక్‌బోర్డుపై వందల వేల కోట్ల భూ ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇక ముస్లిం మైనార్టీలకు కవచం అని చెప్పుకున్న ఏపి సిఎం చంద్రబాబు టీడీపీ, అటు బీహార్ సిఎం నితీష్ కుమార్ మాత్రం వాళ్ళ ఎంపీలకు ఏమిచెప్పారో తెలియదు. సవరణ బిల్లుపై ఓటింగ్ డౌట్‌గా ఏమి కనిపించడం లేదు. పార్లమెంటులో ఇండియా కూటమికి 237 బలం ఉంది. ఎన్డియేకు 273 పైమాటే... టిడిపి, జేడీయూలు వ్యతిరేకిస్తే బిల్లు ఇరకాటంలో పడుతుంది. చూడాలి ఏమి జరుగబోతుందో.. మొత్తానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మిత్రపక్షాల భయం కూడా లేకుండా బిల్లులను తీసుకొస్తున్నారు. వాక్ బోర్డ్ సవరణ బిల్లు కూడా అందులో ఒక భాగంగానే పేర్కొనవచ్చు బీజేపీకి సింగిల్‌గా 240 ఎంపీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. కేవలం మిత్ర పక్షాల బలంతో ఈ బిల్లు తెచ్చారు. పార్లమెంటులో చర్చ మీద కూడా బీజేపీ ధోరణి బాగోలేదు.

**బీసీల ధర్నాతో దద్దరిల్లిన డిల్లీ.**

ఇదే బుధవారం డిల్లీలో బీసీలకు తెలంగాణ అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదింపచేయాలని, మొత్తం దేశంలో దీనిని అమలు చేయాలని చేసిన ధర్నాతో డిల్లీ దద్దరిల్లింది. ఏప్రిల్ 4తో పార్లమెంటు సమావేశాలు ముగుస్తాయి. బీసీ బిల్లు ప్రస్తావనే లేదు. తెలంగాణ సిఎం సహా ఇండియా కూటమి నేతలు అందరూ ధర్నాలో పాల్గొని మాట్లాడారు. అయినా కేంద్రం దీని మీద మాట్లాడలేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో బీసీ రిజర్వేషన్ బిల్లును అమలు చేయకుండా అడ్డుపడే పరిస్థితి కనిపిస్తున్నది ఇక్కడ అసెంబ్లీలో బిల్లుకు మద్దతు ఇచ్చిన బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఢిల్లీ ధర్నాలో కనిపించలేదు. అంతా ద్వంద పాలసీ కనపడుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెబితేనే ఏదైనా జరిగే పరిస్థితి ఉంది అనడంలో అతిశయోక్తి కాదు. బీసీల మీద ప్రేమ నటించే తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నేతలు కూడా ఈ విషయంలో కనీసం నిలబడలేదు. అయితే బీసీ రిజర్వేషన్ కోసం దేశవ్యాప్తంగా, మరోవైపు తెలంగాణ లోనూ ఆందోళన నిర్వహించడానికి ఇండియా కూటమి సిద్ధమవుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ సంకేతాన్ని తన ఉపన్యాసంలో చాలా స్పష్టంగా ఇచ్చినట్లు కనిపించింది.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,


## కవితాజననాలు

కవితలను రమ్మంటే రావు
చిన్నగాతియ్యగా ఊరుతాయి
తోడుకోమంటాయి త్రాగమంటాయి
కవితలను శాసిస్తే లొంగిపోవు
రక్తిశక్తిచూపమని కోరుకుంటేనే
వెలువడుతాయి వేడుకచేస్తాయి
కవితలను భయపెడితే లొంగవు
బ్రతిమలాడి బుజ్జగిస్తేనే కాగితాలకెక్కి
కనువిందుచేస్తాయి
కవితలను తొందరపెడితే ఒప్పుకోవు
నిదానంగా సహనంతో అభ్యర్థిస్తేనే
దిగివస్తాయి మురిపిస్తాయి
కవితలను కావాలంటే పుట్టవు
అందాలుచూపించి ఆనందంకలిగిస్తేనే
జనిస్తాయి
కవితలను పరుగుపెట్టమంటే ఒప్పుకోవు
ఓర్పునేర్పు చూపితేనే పెళ్ళికూతురులా
నడుచుకుంటూ వస్తాయి
కవితలను వెలిగిస్తామంటేనే
రవికిరణాల్లా రమణీయంగా
ముస్తాబయివస్తాయి
కవితలను గుభాళించమంటేనే
సౌరభాలు వెదజల్లుతూ సుమాల్లా
సంబరపరుస్తాయి
కవితలను ఆస్వాదించేలా ఉంటేనే
శ్రావ్యంగా సుతారంగా కళ్ళముందుకు
వస్తాయి
కవితలను కురవమంటే కురవు
వాణీదేవి కరుణిస్తేనే కలాలనుండి
జాలువారుతాయి



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

# ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి



నేడు దేశంలోని అనేక ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో సగానికి పైగా ప్రొఫెసర్ ఉద్యోగాలు భర్తీకి నోచుకోకపోవడం మూలంగా ఆయా ఉన్నత విద్యా సంస్థలలో విద్యా బోధనకు తీవ్ర ప్రతిబంధక పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్య, మహిళలు, పిల్లలు, యువత మరియు క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఉన్నత విద్యా శాఖ 2025 - 26 డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. భారత ఉన్నత విద్యా సంస్థల్లో ముఖ్యంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ మరియు సెంట్రల్ యూనివర్సిటీల ప్రొఫెసర్ పోస్టులలో ఏకంగా 56.18 శాతం పోస్టులు ఖాళీగా ఉండడాన్ని ఈ నివేదిక వెలుగులోకి తీసుకువచ్చింది. నేడు ప్రఖ్యాత ఐఐటిలు మరియు సెంట్రల్ యూనివర్సిటీలు సగానికి పైగా ఖాళీలతో ఈ దుస్థితికి నెట్టివేయబడడం కడు విచారకరం.

2025 జనవరి 31 నాటికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), నేషనల్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి ), ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎమ్), ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐ.ఐ.ఎస్.ఇ.ఆర్), సెంట్రల్ యూనివర్సిటీలు మరియు ఇతర ఉన్నత విద్యా సంస్థలలో మంజూరు చేయబడిన మొత్తం బోధనా అధ్యాపక పోస్టులలో 28.56 శాతం (18,940) ఖాళీగా ఉన్నాయి అని ఈ నివేదిక స్పష్టంగా వెల్లడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులలో 17.97 శాతం ( 11,298 ) ఖాళీగా ఉన్నాయని, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులలో 38.28 శాతం ( 5,102 ) ఖాళీగా ఉన్నాయని మరియు ప్రొఫెసర్ పోస్టులలో 56.18 శాతం ( 2,540 ) ఖాళీగా ఉన్నాయి అని ఈ నివేదిక స్పష్టం చేయడాన్ని గమనించవచ్చు.

కేంద్ర విశ్వవిద్యాలయాలలో గణనీయమైన సంఖ్యలో భర్తీ కాని రిజర్వ్ ఫ్యాకల్టీ పోస్టులను కూడా ఈ నివేదిక పరిగణనలోకి తీసుకుంది. ఇతర వెనుకబడిన తరగతుల (ఓ.బి. సి) కోసం మంజూరు చేయబడిన 3,652 స్థానాల్లో 1,521 ఖాళీలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి) కోసం 2,315 స్థానాల్లో 788 స్థానాలు ఖాళీలు మరియు షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి) కోసం 1,154 స్థానాల్లో 472 స్థానాలు ఖాళీలు ఉన్నాయి అని ఈ నివేదిక పేర్కొంది. అదేవిధంగా కేంద్ర విశ్వవిద్యాలయాలలో రిజర్వ్ బోధనేతర సిబ్బంది ఖాళీలను సైతం ఈ నివేదిక ఎత్తిపట్టింది. ఇతర వెనుకబడిన తరగతుల (ఓ.బి.సి) మంజూరు చేయబడిన 4,495 స్థానాల్లో 1,983 ఖాళీలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి) 2,013 స్థానాల్లో 1,011 స్థానాలు ఖాళీలు, షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి) 3,409 స్థానాల్లో 1,491 ఖాళీలు ఉన్నాయి అని ఈ నివేదిక వెల్లడించింది.

'ఉన్నత విద్యా సంస్థలలో ఖాళీలు ఉండటం అనేది అధ్యాపక - విద్యార్థి నిష్పత్తిని ప్రభావితం చేయడమే కాకుండా తద్వారా బోధనా నాణ్యతను పలుచన చేస్తుంది' అని ఈ నివేదిక వెల్లడించడం గమనార్హం. కాంట్రాక్టు ఉద్యోగాలను దశలవారీగా తొలగించడమే కాకుండా నిర్దేశిత అర్హత కలిగిన అభ్యర్థులను శాశ్వత ఉద్యోగాలలో నియమించటానికి ప్రాధాన్యతను ఇవ్వాలి అని నివేదిక వెల్లడించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

విద్యాసంస్థల్లో ఈ ప్రొఫెసర్ పోస్టుల సమస్యను పరిష్కరించటానికి నివేదికలో పలు సూచనలు పొందుపరచబడ్డాయి. ప్రొఫెసర్ పోస్టుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి అని, అయితే అన్ని నియామక ప్రక్రియలు పారదర్శకంగాను, మెరిట్ ఆధారితంగాను, సమాన అవకాశాలు కల్పించే విధంగాను మరియు వివక్షత లేని సూత్రాలకు కట్టుబడి ఉండే విధంగాను ఉండాలి అని నివేదిక నొక్కిపట్టి ప్రత్యేకంగా పేర్కొనడం ఆహ్వానించదగ్గ విషయం. ప్రభుత్వ ఉద్యోగాలలో అణగారిన వర్గాలకు ఏమాత్రం రాజ్యాంగ నిబంధనలను అణగదొక్కకూడదు అని నివేదిక నొక్కి చెప్పింది. మొత్తంగా నియామక ప్రక్రియల్లో బాహ్య జోక్యాన్ని నివారించడానికి ఆన్లైన్ దరఖాస్తులు, స్క్రీనింగ్ మరియు కమ్యూనికేషన్ను సులభతరం చేయడానికి సాంకేతికతలను ఉపయోగించాల్సిన ప్రాముఖ్యతను కూడా ఊటంకించడం గమనార్హం. ఏది ఏమైననూ విద్యాసంస్థల ప్రభావవంతమైన పనితీరుకు పూర్తిస్థాయి ఉద్యోగస్వామ్యం కీలకమమైన పాత్రని పోషిస్తుంది అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అందువలన స్టాండింగ్ కమిటి నివేదించినట్లు ప్రామాణిక పద్ధతులను అన్వయిస్తూ త్వరితగతిన ఆయా ఉన్నత విద్యా సంస్థలలో పూర్తి స్థాయిలో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690.



## భూమి అడిగింది

భూమి అడుగుతుంది మా పిల్లలు ఎక్కడని
భూమిపై పురుడు పోసుకున్న జీవ కోటికి
ప్రకృతి సృష్టించి వాటి అవసరాలు తీరుస్తూ
జలచర జీవారాసుకు ఆశ్రయం ఇచ్చింది....

భూమిలోంచి పుట్టుకు వచ్చిన మొక్కను
చూసి మురిసి పోతూ సమాజ మేలు కోరింది
వర్షం నుండి వచ్చిన నీరును ఒడిసి పట్టుకుని
సకల జీవ రాశికి స్వచ్ఛమైన నీరు ఇస్తుంది.....

భూ మండలం కలుషితం అవుతున్న వ్యర్థాలను
స్వీకరిస్తూ మంచి ఫలాలను అందించింది
జీవకోటి నేలపై సందడి చేస్తుంటే నాకింత
బలగం ఉందని మురిసిపోయింది.....

అంతరించిపోతున్న అడవులు, పశు పక్షాదులు
ఎక్కడా అని అడుగుతుంది భూమి.

మిద్దె సురేష్
కవి, వ్యాసకర్త, 9701209355



## నిజం నిప్పులాంటిది!

దేశమంటే మనుషులు
మట్టి కాదన్నాడు కవి!
ఒక ప్రవచన కారుడు
వట్టి మట్టిని చూపిస్తాడు!
పరమహంస గొప్పోడన్నా
రమణమహర్షి గొప్పోడన్నా
ఆధ్యాత్మికమే భారత్ అన్నా
జనానికి ఏం మేలు జరిగింది?
అందరికి అన్నం పెట్టే రైతు
వస్తువులుచేసే శ్రామికుడు
సేవలు అందించే దళితులు
వీళ్ళే నిజమైన దేవుళ్ళు!
వీళ్ళను అణచిపెట్టటమే
రాజ్యపాలకుల ప్రయత్నం!
కష్టజీవులకు కూడు గుడ్డ
లేకుండా చేస్తున్నది వీళ్ళే!
ఇప్పటికీ అదే ప్రయత్నం!
అబద్ధాలు ఫ్యాక్టరీలోవీళ్ళు
ఫేక్ న్యూస్ తయారు చేసి
నిరంతర గోబెల్స్ ప్రచారం!
కుల మత ఉన్మాదం పెంచే
ఎన్నిదుర్మార్గాలు చేసినా
నిజం తెలిసేది నిలకడ మీదే
ఇప్పుడు టెక్నాలజీ తోడైంది!
ఇంక వీళ్ళ పప్పులుడకవు!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# హరిత వ్యవసాయం 'లాభదాయకమేనా?

ప్రస్తుతం మనదేశ జనాభా సుమారుగా నూట నలభై కోట్లకు పైగానే ఉంది. కానీ అనేక కారణాలవలన పంటభూమి విస్తీర్ణం రోజురోజుకి తగ్గుతూనే ఉంది. దీని వలన ఆహార భద్రతకు ప్రాధాన్యత పెరుగుతోంది. సంప్రదాయ వ్యవసాయంలో అనిశ్చిత వర్షాలు, కరువులు, వరదలు, ఇతర వాతావరణ వైపరీత్యాలు మూలన పంటల దిగుబడిని ప్రభావితం చేస్తున్నాయి. భూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడం వలన పంటల దిగుబడి తగ్గిపోతున్నది. వ్యవసాయానికి అవసరమైన నీరు లభ్యంకాక పంటలు ఎండిపోతున్నాయి. లోతుగా బోర్లువేయడం వలన భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. రసాయన ఎరువులు, పురుగు మందులను అధికంగా వాడడంవలన నేల సారం క్షీణించిపోతుంది. దానితోపాటు పర్యావరణం కలుషితం అవుతుంది. నేల కోత వలన, పంటలను తెగుళ్ళు, వ్యాధులు ఆశించడం వలన పంటల దిగుబడి తగ్గిపోతుంది. వ్యవసాయ కార్మికుల సంఖ్య తగ్గడం, వేతనాలు పెరగడం వలన పంట ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు తగినంత అవగాహన ఉండడంలేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వలన దిగుబడి పెరుగుతుందని రైతులకు తెలియదు. ఈ సవాళ్లను అధిగమించడానికి, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి. ఇందులో గ్రీన్ హౌస్ వ్యవసాయం చెప్పుకోదగినది.

**గ్రీన్ హౌస్ వ్యవసాయం అంటే ?**

గ్రీన్‌హౌస్ వ్యవసాయం అనేది ఒక వినూత్న వ్యవసాయ నమూనా. స్థిరమైన ఆహార ఉత్పత్తిని సాధించడానికి ఒక సాధనం. నియంత్రిత వాతావరణాన్ని అందించే, కఠినమైన వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, వ్యాధుల నుండి మొక్కలను రక్షించే మూసివున్న నిర్మాణాలలో (గ్రీన్‌హౌస్‌లు) పంటలను పండించడం. ప్రత్యేకంగా తయారుచేసిన ఒక కట్టడంలో పంటలను పండించడం. ఈ కట్టడం సాధారణంగా గాజు లేదా ప్లాస్టిక్ వంటి పారదర్శక పదార్థాలతో నిర్మించబడి ఉంటుంది. దీని వలన సూర్యరశ్మి లోపలికి ప్రసరించి లోపల వేడిని నిలుపుతుంది. ఈ వేడి వలన మొక్కలు వేగంగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. గ్రీన్ హౌస్ వ్యవసాయ ముఖ్య ఉద్దేశ్యం పంటలకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులను సృష్టించడం.

**శాస్త్రీయత సూత్రం:**

సూర్యుని కాంతి పైకప్పు ద్వారా లోపలికి ప్రవేశించి భూమిని, మొక్కలను వేడి చేస్తుంది. ఈ వేడిని పైకప్పు బయటికి పోకుండా నిరోధించడం వలన లోపల ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ ప్రక్రియనే గ్రీన్ హౌస్ ప్రభావం అంటారు. లోపల ఉష్ణోగ్రత, తేమ, కాంతి, గాలి ప్రసరణ వంటి వాతావరణ పరిస్థితులను నియంత్రించే అవకాశం ఉండడం మూలాన పంటలకు అనుకూలమైన పరిస్థితులను కల్పించి దిగుబడి పేరుడుతుంది.

**గ్రీన్ హౌస్ వ్యవసాయం ఆవశ్యకత:**

గ్రీన్ హౌస్ వ్యవసాయంలో వాతావరణ పరిస్థితులను (ఉష్ణోగ్రత, తేమ, కాంతి) నియంత్రించడం ద్వారా ఈ నష్టాన్ని తగ్గిస్తుంది. తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి అందిస్తుంది. నీటిని సమర్థవంతంగా ఉపయోగించి నీటి కొరతను అధిగమించవచ్చు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం చాలా తక్కువగా వాడడం వలన పండించిన పంటలు నాణ్యంగా ఉంటాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలోనూ, సాధారణ వాతావరణంలో పండించడానికి వీలుకాని విలువైన పంటలను పండించవచ్చు. దీని వలన సంవత్సరం పొడవునా పంటలు అందుబాటులో ఉంటాయి. ఈ పద్ధతిలో నేలకోతకు గురికాదు. పంటలను తెగుళ్ళు, వ్యాధులు, వాతావరణ వైపరీత్యాల నుండి రక్షించవచ్చు. తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు.

**అనుకూలతలు ప్రతికూలతలు:**

గ్రీన్ హౌస్ వ్యవసాయం ప్రధానంగా అధిక విలువైన, వాతావరణ నియంత్రణ అవసరమయ్యే పంటలకు అనుకూలంగా ఉంటుంది. కొన్ని పంటలు గ్రీన్ హౌస్ వాతావరణంలో బాగా పెరుగుతాయి. టమోటాలు, దోసకాయలు, మిరపకాయలు, కరివేపాకు, గులాబీలు, లిల్లీలు, స్ట్రాబెర్రీలు, ద్రాక్ష, పుచ్చకాయలు, ఔషధ మొక్కలు, నారు మొక్కలకు గ్రీన్ హౌస్ వ్యవసాయం మరింత అనుకూలంగా ఉంటుంది. అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. గ్రీన్ హౌస్ నిర్మాణం,



పరికరాల నిర్వహణకు అధిక పెట్టుబడి అవసరం. చిన్న, సన్నకారు రైతులకు ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది. రైతులకు తగిన సాంకేతిక నైపుణ్యాలు లేవు. ఈ రంగానికి సంబంధించి మనదేశంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. గ్రీన్ హౌస్ లోపల ఉష్ణోగ్రత, తేమ, కాంతిని నియంత్రించడానికి విద్యుత్, నీరు అవసరం. కావలసిన ఉష్ణోగ్రతలను నిర్వహించడానికి, కాంతిని అందించడానికి వెంటిలేషన్ కోసం చాలా విద్యుత్తు అవసరం. ఇది శక్తి వినియోగాన్ని పెంచుతుంది. ఇది పర్యావరణానికి హానికి దారి తీయవచ్చు. ఈ సవాళ్లను అధిగమించడానికి, ప్రభుత్వాలు, రైతులు, పరిశోధకులు కలిసి పనిచేయాలి.

**మన దేశ పరిస్థితి:**

మన దేశంలో గ్రీన్ హౌస్ వ్యవసాయం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ అగ్రదేశాలతో పోల్చితే మన దేశ వాటా ఇంకా పరిమితంగానే ఉంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. గ్రీన్ హౌస్ వ్యవసాయ విస్తీర్ణం ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంది. అధిక పెట్టుబడి పెట్టడం లేదు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీని వలన రైతులు పూర్తి స్థాయిలో లాభాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వం గ్రీన్ హౌస్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ సహకారం మాత్రం అంతంత మాత్రమే ఉంది.


పండించిన పంటలను మార్కెట్ చేయడం, విక్రయించడం ఒక సవాలుగా ఉంది. మన దేశంలో గ్రీన్ హౌస్ వ్యవసాయంలో తన వాటాను పెంచుకోవడానికి ఈ సవాళ్ళన్నీ అధిగమించాలి. ఈ పద్ధతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇంకా అధికంగా ప్రభుత్వం రాయితీలు, సబ్సీడు అందించాలి. ముఖ్యంగా, చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకొని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలి. ఈ చర్యల ద్వారా, భారతదేశం గ్రీన్ హౌస్ వ్యవసాయంలో తన వాటాను పెంచుకోవచ్చు.

**భవిష్యత్తు:**

భారతదేశంలో గ్రీన్ హౌస్ వ్యవసాయం యొక్క భవిష్యత్తు చాలా ఆశాజనకంగా ఉంది. గ్రీన్ హౌస్ వ్యవసాయం రానున్న రోజులలో విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని అంచనా వేస్తున్నారు. గ్రీన్ హౌస్‌లలో సెన్సార్లు, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించబడుతుంది. గ్రీన్ హౌస్ వ్యవసాయం నీటిని ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా సుస్థిర వ్యవసాయానికి దోహదం చేస్తుంది. తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడిని పొందడానికి వర్టికల్ ఫార్మింగ్ పద్ధతులు ఉపయోగించబడతాయి. నగరాల్లో గ్రీన్ హౌస్ లను ఉపయోగించి పంటలను పండించడం పెరుగుతుంది. ఇప్పటికే గ్రీన్ హౌస్ వ్యవసాయం అనేక రాష్ట్రాలలో విస్తరిస్తోంది. కూరగాయలు, పువ్వులు, ఇతర విలువైన పంటలను పండిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిచెంది, ప్రభుత్వ సహకారం పెరిగితే ఈ రంగం మరింత వృద్ధి చెందుతుంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సమర్థవంతమైన నీటి యాజమాన్యంపై దృష్టి సారించడం ద్వారా పర్యావరణ ప్రభావాలను తగ్గించవచ్చు.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230






*హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ... తెలంగాణ రాష్ట్ర రాజధాని అయిన విశ్వనగరాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని దాటి ప్రస్తుతం జాతీయ స్థాయిలో రావణకాష్టమై రగులుతున్న అతిపెద్ద సంఘటన. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం లేని ప్రతిష్టకు దిగుతుండడంతో సరస్వతీ నిలయంగా వెలుగొందుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ... ప్రస్తుతం నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, పోలీసుల దాష్టీకంతో గత నాలుగు రోజులుగా రావణకాష్టమై రగిలిపోతుంది. రాష్ట్ర ఖజానాను నింపడానికి తమకు గచ్చిబౌలి పరిధి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మి సొమ్ము చేసుకోవడం తప్ప మరో దారి లేదన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగుతుండడం... ఆసియా ఖండంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయంగా బాసిల్లుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉనికిని కాపాడుకోవడం కోసం, ప్రకృతి ఒడిలో నెలకొన్న విశ్వవిద్యాలయం వాతావరణాన్ని కలుషితం కాకుండా కాపాడుకునే క్రమంలో విద్యార్థులు సైతం వెనక్కి తగ్గకపోవడంతో విశ్వవిద్యాలయం ఘటన కాస్త జాతీయ స్థాయిలో పతాక శీర్షికై కూర్చుంది.*

# రావణ కాష్టంలా..

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

### హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాష్టీకం... వీపులపై విరుగుతున్న లాఠీలు

### అధికారుల అష్టదిగ్బంధంలో యూనివర్సిటీ... పెరుగుతున్న జాతీయస్థాయి మద్దతు




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** అద్భుత ప్రతిభా పాటవాలకు, ప్రశాంతమైన వాతావరణానికి నెలవై యున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ... ప్రస్తుతం ఓవైపు ప్రభుత్వం... మరోవైపు పోలీసుల నియంతృత్వ పోకడ, ఉక్కు పాదం అణచివేతలతో తన పూర్వవైభవాన్ని కోల్పోతూ ప్రకృతి విలయంలో పశు పక్ష్యాదులు, మూగజీవాల కన్నీటిలో రోదిస్తూ చిన్నబోయి కూర్చుంది. గత శనివారం వరకు ఎంతో ప్రశాంతంగా ఉన్న విశ్వవిద్యాలయం ఆవరణ నేడు రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ ఒంటెద్దు పోకడ, పోలీసుల దాష్టీకం, లాఠీ చార్జీలతో అగ్నిగుండంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితులలో విశ్వవిద్యాలయ విద్యార్థులు బిక్కుబిక్కుమంటూనే మరోవైపు తమ తల్లి ఒడి లాంటి యూనివర్సిటీ ఆవరణను కాపాడుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతుండడం విద్యావంతులను మేధావులను విస్తుబోయేలా చేస్తుండగా, పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు ఉద్యమంలోకి తాము సైతం అని కథన రంగాన దూకడానికి వేదికగా మారుతుండడం గమనార్హం. లేని పంతాలకు పోతున్న రాష్ట్ర ప్రభుత్వం తమ అంగ బలాన్ని, అర్థ బలాన్ని, కండ బలాన్ని ఉపయోగిస్తూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పై జులుం ని ప్రదర్శిస్తుంటే... వారి ధమనకాండను ప్రతిఘటిస్తున్న విశ్వవిద్యాలయ విద్యార్థుల వీపులు మాత్రం పోలీసుల లాఠీలతో మోత మోగుతున్నాయి. ఎంతమంది విద్యార్థులను అరెస్టు చేసినా... మరి ఎంతోమంది విద్యార్థులను అణగదొక్కుతున్నా... ఇంకెంతో మంది విద్యార్థుల రక్తాలను చిందిస్తున్నా విశ్వవిద్యాలయ భూముల పరిరక్షణకు, ఉనికిని కాపాడుకోవడానికి అవసరమైతే ప్రాణ త్యాగాలకైనా సిద్ధమంటూ విద్యార్థులు సలుపుతున్న పోరు తెలంగాణ సాయుధ పోరాటాన్ని తలపిస్తుందని భాజపా, టిడిపి లాంటి జాతీయ పార్టీల నాయకులు, భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్), వామపక్ష నేతలు స్పష్టం చేస్తున్నారు.

**విద్యార్థుల ఆందోళన ఉధృతం... పెరుగుతున్న జాతీయ మద్దతు!**

సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణలో గత నాలుగు రోజులుగా భయానక వాతావరణం, పోలీసుల జులుం తాండవిస్తుండడంతో విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రాణాలు పోయినా పరవాలేదు... అడుగు భూమినైనా వదులుకోమని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుండడంతో యావత్ భారతదేశం చూపు ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పై కేంద్రీకృతమైందంటే అతిశయోక్తి కాదని పలువురు సామాజికవేత్తలు, మేధావులు, విద్యావంతులు వివరిస్తున్నారు. పచ్చగా ఉన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై రేవంత్ అండ్ కంపెనీ శీతకన్ను పడినందునే నేడు అనవసరమైన గొడవలు, దారుణాలు జరుగుతున్నాయని రాష్ట్రానికి మేలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలే విలువైన 400 ఎకరాల భూమిని దోచుకోవడానికి దుర్మార్గంగా వ్యవహరిస్తుండడం ఎంతవరకు సమంజసం అని, దీనిపై ఇప్పటికే జాతీయస్థాయిలో కదలిక వచ్చిందని, తప్పకుండా రేవంత్ సర్కారుకు తగిన గుణపాఠం లభిస్తుందని వారు పేర్కొన్నారు. న్యాయవాదులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, సామాజికవేత్తలు, ప్రజా సంఘాలు, రాజకీయ విపక్షాలు అందరూ ఏకతాటిపైకి వస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ సర్కారును రాజకీయంగా అంతం అందించడం ఒక్కటే వారి ముందున్న ప్రధాన కర్తవ్యం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వన్యప్రాణుల ఉసురు ముట్టి రేవంత్ సర్కారు నేలమట్టం అవుతుందని, రాష్ట్రానికి పట్టిన శని కూడా వదిలి పోతుందని పలువురు బి ఆర్ ఎస్ నాయకులు స్పష్టం చేస్తుండడం కోసమెరుపు.











## అసౌకర్యంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

- వలలో చిక్కుకొని మృత్యువాత పడ్డ పావురాలు తో దుర్వాసనతో వాకర్స్ అసంతృప్తి
- ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టాలి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** పదులకోట్లతో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించినా దాని సంరక్షణను గాలికొదిలేసిన జిహెచ్ఎంసి అధికారులు. ప్రతిరోజు యోగా, బ్యాట్మింటన్, స్కేటింగ్, వాలీబాల్, వాకింగ్ వివిధ రకాల క్రీడాకారులతో పాటు స్థానిక ప్రజలు ఉదయం సాయంత్రం గ్రౌండ్లో వాకింగ్ చేస్తుంటారు. పదులకోట్లతో నిర్మించబడ్డ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను జిహెచ్ఎంసి అధికారులు గాలికి వదిలేయడంతో పావురాలకు అడ్డగా మారింది. గత సంవత్సరం జిహెచ్ఎంసి పావురాలు రాకుండా చుట్టుముట్టి వలను ఏర్పాటు చేశారు. అదే వలలో చిక్కుకున్న పావురాలు వందల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. దీంతో పావురాల కళేబరాల నుంచి దుర్వాసనతో పాటు ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రజలు వస్తూ ఉంటే, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు రావడం వల్ల ఆరోగ్యం కాపాడుకోవడం దేవుడెరుగు అనారోగ్యాల పాలవుతున్నారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోకి వస్తున్న వివిధ క్రీడాకారులు వాకర్స్ అనారోగ్యాల బారిన పడుతున్నారు. జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో అధిక మొత్తంలో ముక్కు పిండి వసూలు చేస్తున్న ఆస్తి పన్నులో ఉన్న శ్రద్ధ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పర్యవేక్షణలో ఎందుకు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని జిహెచ్ఎంసి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను సంరక్షణను చేపట్టాలని కోరుతున్నారు.

## పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం దరఖాస్తులు




**షాద్ నగర్ (జనంసాక్షి) :** పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కొరకు నిర్వహించే పాలిసెట్ 2025 పరీక్ష ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయని ఏప్రిల్ 19 తేదీ వరకు ఈ దరఖాస్తులు స్వీకరించబడతాయని పాలిసెట్ షాద్ నగర్ కేంద్ర కోఆర్డినేటర్ ప్రిన్సిపల్ పరమేశ్వర్ తెలిపారు ఎస్సీ ఎస్టీలకు 250 ఇతరులకు 500 రూపాయలు చెల్లించి పాలీసెట్ తెలంగాణ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు గడువు తేదీ ముగిసిన తర్వాత ఏప్రిల్ 21 వరకు రూపాయలు 100 అపరాధ రుసుముతో మరియు ఏప్రిల్ 23 వరకు 300 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని మే నెల 13వ తేదీన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉంటుందని పరీక్ష జరిగిన 12 రోజుల తర్వాత ఫలితాలు వెలువడతాయని ఈ అవకాశాన్ని అర్హత కలిగిన వారు ఉపయోగించుకోవచ్చనీ అన్నారు..

## హెచ్‌సియూ భూముల వేలం పాటను నిలిపివేయాలి

- సిపిఎం నాయకులను అక్రమ అరెస్టులని నిర్బంధాలను ఖండించాలి
- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్




**తాండూరు ఎప్రిల్ 2(జనంసాక్షి) :** హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ భూములను కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయని వెంటనే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రశ్నించిన విద్యార్థులు సిపిఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఏత్తివేయాలని, సిపిఎం నాయకులు విద్యార్థుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ గచ్చిబౌలిలోని 400 ఎకరాల యూనివర్సిటీకు సంబంధించిన భూములను ప్రభుత్వం వేలంపాటను తక్షణమే ఆపి విశ్వవిద్యాలయానికి భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. భూమిలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశిస్తే పర్యావరణం దెబ్బతింటుందని ,జీవ వైవిధ్యం నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నూతన భవనాలు వసతి గృహాలు కోర్సులు తదితర అనేక అవసరాలకు ఉపయోగపడే భూములను విశ్వవిద్యాలయానికే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ప్రజల న్యాయమైన డిమాండ్‌ను ఆలోచన చేయకుండా ప్రశ్నించిన విద్యార్థులను రాజకీయ పార్టీలను నిరంకుశంతో అణచివేస్తుందని విమర్శించారు .యూనివర్సిటీకి సంబంధించిన భూములపై ప్రభుత్వం అడుగుపెట్టి అర్హత లేదని అన్నారు .భవిష్యత్తులో విశ్వవిద్యాలయాలను పరిశోధన కేంద్రాలుగా మార్చి అభివృద్ధి చేయడం మానేసి యూనివర్సిటీలలోకి ప్రభుత్వం ,కార్పోరేట్ శక్తులను ప్రోత్సహించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని 400 ఎకరాల భూమి హెచ్‌సియూకు అప్పగించాలని, రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన సిపిఎం నాయకత్వాన్ని విడుదల చేసి విద్యార్థులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను కలుపుకొని దీర్ఘ కాల ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తాండూర్ డివిజన్ కార్యదర్శి సీరియలా, సిపిఎం నాయకులు వెంకటేష్, బాలస్వామి, ధనియాలు పాల్గొన్నారు.



## ఉప్పల్‌లో సౌదీ కరెన్సీ పేరుతో మోసం

**ఉప్పల్ ఏప్రిల్ 2 ( జనం సాక్షి):** డబ్బులు ఇస్తే ఎక్కువ మొత్తంలో సౌదీ కరెన్సీ ఇస్తానని ఆశ చూపి బుధవారం ఒక వ్యక్తి నుండి రెండు లక్షల ఎనుబై వేలు తీసుకొని, చేతిలో పేపర్ కట్టలు పెట్టి బురిడీ కొట్టించి దుండగులు ఉడాయిం చారు. ఇండియన్ కరెన్సీ ఇస్తే, ఆరున్నర లక్షల విలువ చేసే సౌదీ కరెన్సీ ఇస్తామంటూ మాయమాటలతో, మహమ్మద్ హైమద్ అనే వ్యక్తి వద్ద 2,80,000వేల రూపాయలు తీసుకొని ఇద్దరు గుర్తు తెలియని దుండగులు మోసానికి పాల్పడ్డారు.




## ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలి

**శంషాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో పంచాయతీ వర్కర్ వాటర్ మెయిన్ గా కృష్ణ గత 30 సంవత్సరాలుగా నిధులు నిర్వహిస్తున్నారు. అతను నిన్న అనారోగ్యంతో చనిపోయారు. ప్రతి గ్రామపంచాయతీ వర్కర్ కు 20 సంవత్సరాలుగా రెండు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ ఉంది. చనిపోతే దహన సంస్కారాలకు ఖర్చులకు పదివేల రూపాయలు ఇచ్చారు. రెండు లక్షలు ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వలేదు. కుటుంబ సభ్యులకు ఈ సంగతి తెలియదు అన్నారు. పాలమాకుల గ్రామ పంచాయతీ ఆవరణలో కృష్ణ శవాన్ని ట్రాక్టర్ పై తీసుకువచ్చి సిఐటియు నాయకులు, సామిల్, అండాలు, రామచందర్, డివైఎఫ్ఐ అధ్యక్షులు పవన్ కుమార్, కుటుంబ సభ్యులు పంచాయతీ సభ్యులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. గ్రామ సెక్రెటరీ, ఎమ్మార్వో రవీందర్ దత్ వచ్చి సిఐటియు నాయకులు కుటుంబ సభ్యులను, పంచాయతీ కార్మికులతో మాట్లాడి మీ సమస్యని పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాని విరమించుకున్నారు.

### ఆత్మగౌరవం కోసం పోరాడిన

## యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న

- జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి
- ఘనంగా నివాళులర్పించిన డిఆర్ఓ సంగీత సిబ్బంది



**రంగారెడ్డి (జనంసాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయ భవనంలోని బిసిసంక్షేమశాఖ కార్యాలయంలో బిసిసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈసందర్భంగా డిఆర్ఓ సంగీత మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ ప్రజల ఆత్మగౌరం కోసం ఎనలేని కృషి చేశారని తెలంగాణలో మొగలాయి విస్తరణను తొలిసారిగా అడ్డుకున్నది సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు అతి సామాన్యమైన జీవితం నుంచి అత్యంత ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి అని కల్లుగీత కార్మికుడైన సర్దార్ సర్వాయి పాపన్న సైన్యాన్ని సమకూర్చుకోని రాజులను ఎదిరించి యుద్ధాలు చేసి రాజ్యాలను స్థాపించి పరిపాలించడం చరిత్రలో ఓ అరుదైన విషయం అని అన్నారు సర్వాయి పాపన్న యాదృచ్ఛికంగా జరిగిన ఓ ఘటన నుంచి సొంత సైన్యాన్ని సమకూర్చుకోని మొఘలాయిలను ఎదురించిన మొట్టమొదటి తెలంగాణ రాజు సర్దార్ సర్వాయి పాపన్న అని ఆ తర్వాత కల క్రమేణా 33 రాజ్యాలను స్థాపించాడన్నారు జీవించినన్ని రోజులూ రాజుగానే జీవించాడన్నారు అలాంటి అద్భుతమైన వ్యక్తి మన తెలంగాణ ప్రజలందరికీ ఆదర్శ ప్రాయుడని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి. కేశురాం కలెక్టరేట్ ఏఓ సునీల్ సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారులు పి.రమేష్ వై. మాధవ రెడ్డి కులసంఘం నేతలు బోయపల్లి సుధాకర్ గౌడ్, నర్సింహ గౌడ్, బండి రాజు గౌడ్, పాల్గొన్నారు.




## ఇంటొ్సా లెవెల్-2 పరీక్షలో శ్రీ చైతన్య పాఠశాల హవా

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 02 (జనంసాక్షి) :** జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో తమకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలు మరోమారు తమ సత్తాను యధావిధిగా చాటుకున్నాయి. శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కె. వాణి ప్రసాద్ బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఇంటొ్సా) లెవెల్-2 పరీక్షలు శ్రీ చైతన్య పాఠశాల శేరిలింగంపల్లి శాఖ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరచడం జరిగిందని తెలిపారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ లెవెల్-2 పోటీ పరీక్షలలో తమ పాఠశాల విద్యార్థులైన రిత్విక్ గ్రాండ్ ప్రైజులు సాధించి ల్యాప్టాప్ ను బహుమతిగా సొంతం చేసుకోవడం జరిగిందని, వరుణ్, నిఖిల్ శ్రీమాన్, జయకృష్ణ, లాస్య శ్రీ, సహస్ర, శ్రీహిత్, మనిమోక్షిత్, అద్విక్ కుమార్, క్రిత్విక్ గౌడ్ మరియు అదిత్రీ తదితర విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ స్థాయి బహుమతులను సాధించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో మొత్తం 244 మంది విద్యార్థులు బంగారు పథకాలను, 206 మంది విద్యార్థులు ఉత్తమ మెరిట్ సర్టిఫికెట్లను, 8 మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులను మరియు 65 మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులను అందుకోవడం జరిగిందని ప్రిన్సిపాల్ వాణి ప్రసాద్ వివరించారు. ఈ క్రమంలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బంగారు పథకాలను, ప్రశంసా పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించడం జరిగిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం శివరామకృష్ణ, ప్రాంతీయ ఇన్చార్జి పద్మజ, జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, అకాడమిక్ డీన్ రాజేష్, ప్రైమరీ ఇన్చార్జి మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ విజయ్‌కి విప్లవ జోహార్లు

**ఎండి మునీర్, ప్రత్యేక ప్రతినిధి, జనం సాక్షి :**



సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత విజయ్ ఊపిరి కోల్పోయాడు. సీనియర్ పార్టీ నాయకుడి మృతి తో పార్టీ లో విషాద ఛాయలు నెలకొన్నాయి. కా" విజయ్ బుధవారం తెల్లవారుజామున 4:30 కి హైదరాబాద్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించినాడు. కామ్రేడ్ విజయ్ కు పార్టీ జిల్లా కమిటీ విప్లవ జోహార్లు తెలియజేస్తుంది.కామ్రేడ్ విజయ్ స్వగ్రామం ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా) మండలం అంతర్గాం, గ్రామం. అంతర్గాం లో 1-1- 1973లో జన్మించిన విజయ్ పెద్దపేట,గోదావరిఖని ప్రాంత ఉద్యమాలలో ప్రభావితమైన తన చిన్ననాటి నుండి పార్టీ, పివైఎల్ సంఘంలో పనిచేశారు. పెద్దంపేట ప్రాంతంలో ఆత్మరక్షణ దళాల్లో కొనసాగాడు. ఆ ప్రాంత ఉద్యమంలో నిర్బంధాలను, ఎదుర్కొన్నాడు. జైలుకు వెళ్లాడు. పెద్దంపేట గ్రామంలో పిఓడబ్లు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ మంగను కులాంతర వివాహం చేసుకొని ఆదర్శంగా ఉన్నాడు. మంచిర్యాల మార్క్స్ భవన్ నిర్మాణ సమయంలో పోలీసుల అక్రమ కేసులను, నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. పార్టీలో కార్యకర్తగా పనిచేశాడు. తను సాధారణ జీవితం గడుపుతున్న సమయంలో కూడా పార్టీ శ్రేయోభిలాషి, సభ్యుడిగా పార్టీకి తన సహాయ సహకారాలు అందించాడు. ప్రధానంగా కామ్రేడ్ మంగను మహిళా సంఘంలో, పార్టీలో ప్రజా ఉద్యమాలలో పని చేసే విధంగా ప్రోత్సహించాడు. మంగకు సంపూర్ణ సహకారాన్ని అందించాడు. కామ్రేడ్ విజయ్ మరణం పార్టీ కి నష్టం.వారి కుటుంబానికి తీరని లోటు. కామ్రేడ్ విజయ్‌కి విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని కామ్రేడ్ విజయ్ అంత్య క్రియలు ఎల్లుండి 4-4-2025 ఉదయం 10 గంటలకు మంచిర్యాలలో జరుగుతున్నాయని ఏ.లాల్ కుమార్, న్యూ డెమోక్రసీ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి పేర్కొన్నారు.

# పది టెన్షన్ ముగిసింది..!

- బడి చదువుకు విద్యార్థులు బై బై
- ఆనందంతో కేరింతలు కొట్టిన విద్యార్థులు
- సెలవుల్లో పలు కోర్సుల్లో శిక్షణకు సిద్ధం అంటున్న విద్యార్థులు



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2( జనం సాక్షి) :** ఒంటిపై నున్న 'పది' టన్నుల బరువును దించేసినట్లు.. ఒత్తిడితో ఉన్న 'మది'లో 'టెన్'షన్ ఫ్రీ అయినట్లు.. అప్పుడే కొత్తగా ప్రపంచంలోకి వస్తున్నట్లు.. ఇప్పుడే స్వేచ్ఛా లోకంలో అడుగిడుతున్నట్లు... అందరిలోనూ ఒకటే సంతోషం.. ప్రతి మోములోనూ చిరు మంద హాసం.. ఇదీ పదో తరగతి పరీక్షల కేంద్రం వద్ద చివరిరోజు బుధవారం పిల్లల్లో కనిపించిన ఉత్సాహం. పదో తరగతి పరీక్షలు బుధవారం తో ముగిశాయి. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు మచ్చు 21 నుండి ఏప్రిల్ 2 వరకు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 122 పరీక్షా కేంద్రాలు ఉండగా 22 వేల 423 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. బుధవారం చివరి పరీక్ష కాగానే వివిధ పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు కేరింతలు కొడుతూ ఖుషి ఖుషీగా అందరికీ బాయ్ బాయ్ అంటూ బయటకు వచ్చారు.

**ఐదేళ్లుగా కలిసిమెలిసి ఒక్కటిగా.. :** ఐదేళ్లుగా కలిసిమెలసి చదివారు. ఒక్కటిగా మెలిశారు. కష్టాల్లో అండగా నిలిచారు. చదువు లో ఒకరికొకరు సహాయం చేసుకున్నారు. సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఉపాధ్యాయుల సూచనలతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా ముగించారు. ఓ వైపు వారిలో పట్టలేని ఆనందం.. మరోవైపు విడిపోతున్నా మన్న బాధ.. కన్నీళ్లతోనే తోటి విద్యార్థులకు టాటా చెప్పారు. జూనియర్లకు సూచనలిచ్చారు. విద్యను బోధించిన ఉపాధ్యా యులకు, చదువుల తల్లి ఒ(బ)డికి దూరమవుతున్నా మని వేదన చెందారు. భవిష్యత్ పై ఆశలతో ఇంటి బాట పట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినులను 'జనం సాక్షి' పలకరించగా మంచి మార్కులొస్తాయని, భవిష్యత్తు లక్ష్యాలను సాధిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



**పోలీస్ అవ్వడమే లక్ష్యం : రాథోడ్ సంజన, విద్యార్థిని**

న్యాల్ కల్ లోని శ్రీ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నాను. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను. న్యాల్ కల్ మండలంలోని రుక్మాపూర్ చెందిన తాండవాసిని. నా ప్రధాన లక్ష్యం పోలీస్ అవ్వడమే. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో పోలీస్ అయ్యేందుకు శక్తి వంచన మేర శ్రమిస్తాను.



**డాక్టర్ అవ్వడమే నా ప్రధాన ధ్యేయం : రాధిక విద్యార్థిని**

న్యాల్ కల్ మండలం, శంశర్ల పూర్ గ్రామ వాసిని. న్యాల్ కల్ లోని శ్రీ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యను అభ్యసించాను. నా ప్రధాన లక్ష్యం డాక్టర్ అవ్వడమే. పేద ప్రజలకు సేవలు అందించడమే నా ప్రధాన లక్ష్యం. ఇటీవల జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, కుటుంబ సభ్యుల సహకారంతో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను. డాక్టర్ అయ్యేంతవరకు కష్టపడి చదివి సాధిస్తాను.

# చండూర్‌లోని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించాలి

**గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లకు స్థలం చూపించాలి**

**సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి కదారి నాగరాజు**

**సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా**



**చిలప్‌చేడ్ (జనంసాక్షి) :** మండలంలోని చండూర్ గ్రామంలో అర్హులైన అనేక నిరుపేద కుటుంబాలు ఇండ్లు నిర్మించుకుందాం అంటే స్థలం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం పార్టీ నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కదారి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. చండూర్ గ్రామంలో సర్వే నంబర్ 2 ప్రభుత్వ భూమిలో అనేక సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని కానీ ఎలాంటి సర్టిఫికెట్ లు లేవని అధికారులు నేడు ఉన్న నిరుపేదలు ఇండ్లు కట్టుకుంటుంటే ఆపేయడం,కూల్చేయడం వంటివి చేయడం సరైన వైఖరికాదని ఆయన అన్నారు. ఒకవైపు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూనే నిరుపేదలు, దళితులు, వాడెరా కులస్థులు నిర్మించుకుంటున్న ఇండ్లను ఆపడం సరైనదికదాని ఆయన అన్నారు. గ్రామంలోని దళిత వాడా ఇండ్లు వంపులో ఉండటంతో వరద నీరు రావడమే కాకుండా గ్రామంలోని డ్రైనేజి మురికి నీరు రావడంతో తీవ్ర అనారోగ్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 2లో ఇండ్ల స్థలాలకోసం కేటాయింపు చేస్తే లబ్దిదారులకు సౌకర్యంగా ఉంటుందని గుర్తుచేశారు. గతంలో గ్రామంలోని నిరుపేద 65 కుటుంబాలకు ఇండ్లు నిర్మించుకునే సర్టిఫికెట్స్ ఇచ్చిన పొజిషన్ చూపలేదని కావున అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి అందరికి ఆమోదయోగ్యంగా స్థలం కేటాయించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మల్లేశం, శేఖర్, వెంకటేష్, ఏసుదాస్, లక్ష్మణ్, దాసు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అర్హుల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**రేషన్ బియ్యాన్ని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి**



**న్యాల్‌కల్, ఎప్రిల్ 02, (జనం సాక్షి) :** అర్హులైన పేదలందరికీ ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా "సన్న బియ్యం" పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని, ఏమాత్రం పౌరసరఫరాల్లో అక్రమాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, డప్పూర్ గ్రామంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బసవరాజ్, జహీరాబాద్ ఆర్డీఓ రామ్ రెడ్డి, స్థానిక ఉప తహసిల్దార్ రాజిరెడ్డిలతో కలిసి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించి పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలోని పేద ప్రజానీకానికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా "సన్న బియ్యం" పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని, ఎన్ని ఆర్థిక సమస్యలు ఉత్పన్నమైన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారిస్తోందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాంకాల్ సుభాష్, న్యాల్ కల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్, డప్పూర్ మాజీ ఎంపీటీసీ నాగన్న, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు బైకులిస్తే జీవితంలో కొత్త ప్రాబ్లమ్స్

**ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి**



**మెదక్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 2 (జనంసాక్షి):** మైనర్లకు సరదా కోసం బైకులు ఇస్తే జీవితంలో కొత్త ప్రాబ్లమ్స్ కొని తెచ్చుకున్నట్లేనని జిల్లా ఎస్పీ బీ ఉదయకుమార్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యలయంలో ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వెసవి సెలవులు సమీపిస్తుడడంతో పిల్లలు బావులలో, చెరువులలో, వాగులో, ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. లేదంటే ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలకు నీటి లోతు తెలవనందున అందులోకి జారీ చనిపోవడం జరుగుతుందన్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన భాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందుకు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. అదేవిదంగా చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పాటుకొని వాహన యజమానుల పై కేసు నామోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పిల్లలు మీ సరదా కోసం తలిదండ్రులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చవద్దు అని అన్నారు. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకుని ఏమైనా కొత్త విషయాలు నేర్పించాలని సూచించారు. వేసవిలో క్రీడా శిక్షణ కేంద్రాలకు పంపి మీ పిల్లలలో క్రీడా స్ఫూర్తి ని పెంపొంధిచలన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న పిల్లలు అర్ధాంతంగా చనిపోతే తల్లిదండ్రుల మనోవేదన ఎవ్వరూ తీర్చలేనిదని పేర్కొన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.

# ఉరుకొండ పేట గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

**కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్**



**తాడూర్/ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఎప్రిల్ 2 (జనంసాక్షి):** ఊరుకొండ మండలం ఊరుకొండ పేట దేవాలయం దగ్గర శనివారం రాత్రి కామందులు తప్ప తాగి ఒక మహిళపై అత్యాచారం చేసి తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి గాయపరచడం జరిగిందని ఇలాంటి సంఘటనలు జరగడం ప్రజాస్వామ్యంలో చాలా దుర్మార్గమైన చర్య అని ఇటువంటి సంఘటనలు ప్రజలందరూ ఖండించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం తాడూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న మాట్లాడుతూ గ్యాంగ్ రేప్ కి పాల్పడిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ చేపట్టి కఠినమైన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భాదిత మహిళలకు వైద్య చికిత్సలు అందించి పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవాలయం దగ్గర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని మహిళలకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములమ్మ చిన్నమ్మ కృష్ణమ్మ చిన్నయ్య చంద్రకళ నాగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సంక్షేమానికి పాటుపడతా

**తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టియూసి కార్యదర్శి బంగారి పర్వతాలు**



**బిజినపల్లి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** వికలాంగుల సంక్షేమం కోసం పాటుపడతానని తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టియుసి కార్యదర్శి బంగారు పర్వతాలు అన్నారు. బిజినేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా వికలాంగుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఐఎన్టీయూసీ తెలుగు రాష్ట్రల కార్యదర్శి, డిసిసి ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వికలాంగుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బంగారి పర్వతాలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వికలాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బడుగు బలహీనవర్గాలకు ప్రభుత్వ అందించే సంక్షేమ ఫలాలు అందేందుకు పాటుపడుతున్నాడని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీలో ఉన్నత స్థాయికి వెతికి పేదలకు మరిన్ని సేవలందించి కలకాలం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిజినపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మిద్దె రాములు, నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ మెంబర్ వాల్య నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎద్దుల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# గ్రామపంచాయతీ ఆస్తిని కాపాడాలని ధర్నా



**ఉర్కొండ ఏప్రిల్ 2 ( జనం సాక్షి ):** మండల కేంద్రంలో ఉన్న కొత్త కాలనీలో గ్రామపంచాయతీకి చెందిన ప్లాట్లను కొంతమంది ఆక్రమించుకొని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని గ్రామపంచాయతీకి చెందిన ఆస్తిని కాపాడాలని గ్రామస్తులు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో రామకోటికి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కొత్త కాలనీలో 401,404 సర్వే నెంబర్లో గల భూమి అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసి గ్రామంలోని నిరుపేదలకు మాత్రమే ఇవ్వడం జరిగిందనీ,గ్రామపంచాయతీ అవసరాల కోసం 88,91,92,93,94 నెంబర్లు గల ప్లాట్లను గ్రామపంచాయతీ ఆధీనంలో ఉంచడం జరిగిందనీ,కానీ కొంతమంది స్వార్థపరులు ఇట్టి ప్లాట్లపై కన్ను వేసి దొంగ పట్టాలను సంపాదించి వాటిని కబ్జా చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఇట్టి విషయంపై కొన్ని రోజులుగా గ్రామ కార్యదర్శి కి, ఎంపీడీవోకి , తహసిల్దార్ కి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కానీ ఇట్టి విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందుకే గ్రామ పంచాయతీ ఆస్తిని కాపాడుట కొరకు ఎమ్మార్వో ఆఫీస్ ముందర గ్రామస్తులందరూ ధర్నా చేయడం జరిగింది .ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నతధికారులు స్పందించకపోతే గ్రామస్తులు అందరం కలిసి రాస్తారోకో కలెక్టర్ ముట్టడి కూడా చేయడం జరుగుతుందని గ్రామస్తులు హెచ్చరించారు.

# సన్న బియ్యం పథకం చారిత్రాత్మకం


**మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 2 (జనం సాక్షి ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం చారిత్రాత్మక పథకమని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. మంగళవారం హవేలీ గన్ పూర్ మండలంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ సింధూ రేణుక, జిల్లా సివిల్ సప్లై అధికారి సురేష్ రెడ్డి, డిఎం సివిల్ సప్లై, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు, అనంతరం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ శాసనసభ నియోజకవర్గంలో 72, వేలమందికి సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని, ప్రజా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డ్ కలిగిన లబ్ధిదారులు అందరూ సన్న బియ్యంతో సంతృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ సన్న బియ్యం పథకం ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి మనిషికి 06 కేజీలు చొప్పున అందిస్తున్నట్లు వివరించారు నాణ్యమైన గుణాత్మక విద్య ఆనందించాలని ఉద్దేశంతో గన్ పూర్ మండల విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యం,ప్రజా ప్రభుత్వం, ఏర్పడిన సంవత్సర కాలంలోనే 30 వేల కోట్ల రూపాయలతో రైతు బీమా రైతు భరోసా అందించినట్లు తెలిపారు. మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమాన్ని భవిష్యత్తులో ఇంకా అగ్రగామిగా నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సంపన్నుడికి సామాన్యుడికి సమాన భోజనం

**సన్న బియ్యం పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 02 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్న రకం బియ్యాన్ని ఉచితంగా ఇవ్వడం చారిత్రాత్మకమైనదని, ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన ప్రభుత్వంలో నిరుపేదలు సైతం సన్న రకం బియ్యంతో నాణ్యమైన భోజనం చేయాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిమతమని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఘనపూర్,పెద్ద మందడి,వనపర్తి, మండలాల్లో చౌక ధర దుకాణలలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు తో కలిసి వనపర్తి జిల్లాలో సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని మొత్తం 324 చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందుకు 3309 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం అవసరం ఉంటుందనీ తెలియజేశారు. రాష్ట్రంలో ఆర్థిక స్థితిగతులు అంతగా బాగ లేకపోయినప్పటికీనీ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ వస్తున్నామని తెలియజేశారు. త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పెద్దమందడి మండలంలోని ఒకటవ నెంబర్ రేషన్ షాపు, వనపర్తి మున్సిపాలిటీలోని 1,9,20వ నెంబర్ జాతీయ ఉత్పత్తి పంపిణీ కేంద్రాల్లో , గోపాల్ పేట, పెబ్బేరు మండలాల్లో సైతం సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహశీల్దార్లు, ప్రజా ప్రతినిధులు రేషన్ డీలర్లు, తదితరులు శాసన సభ్యుల వెంట కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి కృషితో గ్రామీణ రోడ్లకు మహర్దశ



**బొంరాస్ పేట, ఏప్రిల్ 2 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు,బిటి రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించడంతో రోడ్ల నిర్మాణానికి మహర్దశ పట్టిందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శేరి రాజేశ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిఆర్ఆర్ నిధుల ద్వారా మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులోని పార్వతీ పరమేశ్వర దేవస్థానానికి వెళ్లేందుకు సిఆర్ఆర్ నిధుల ద్వారా మంజూరైన రూ.5 లక్షల విలువ చేసే సీసీ రోడ్డు పనులను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి,మల్లేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ సాఫీగా జరిగేలా చర్యలు

**సన్న బియ్యం అమ్మితే రేషన్ కార్డు కట్ చేస్తాం : మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**



**నర్సాపూర్ ఏప్రిల్ 02 (జనంసాక్షి) :** జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణానికి కేటాయించబడిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ ఉందా అని తెలుసుకున్నారు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సన్న బియ్యం ఎవరైనా అమ్మితే రేషన్ కార్డ్ కట్ చేస్తామని వారిపైన కేసు నమోదు చేస్తామని అన్నారు,జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన 2,13,820 , వారికి ప్రతీ నెల 4430.496 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కాగా, జాప్యానికి తావు లేకుండా సకాలంలో లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ జరిగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్, రేషన్ డీలర్ జిల్లా సంఘం అధ్యక్షులు ఆనంద్ కుమార్, నాయకులు పంబల బిక్షపతి, ఆంజనేయులు గౌడ్, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు సుధాకర్ నాయకులు జైపాల్, నర్సింలు, గోవర్ధన్ రెడ్డి, ఫయుం,రమేష్ గౌడ్,దశరథ్, రవి గౌడ్, కుమార్ అశోక్,శ్రీనివాస్,చందర్, రాజు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ కో ఆర్డినేటర్‌గా వెన్నవరం ఆదర్శ్ రెడ్డి



**ప్రత్యేక ప్రతినిధి (జనంసాక్షి, ఏప్రిల్ 2) :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కో అర్డినేటర్ గా వెన్నవరం అదర్శ్ రెడ్డి ని బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కెసీఆర్ నియామించారు. రామచంద్రపురం మండలానికి చెందిన అదర్శ్ రెడ్డి విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో ఉన్నారు. పెద్ద నాన్న భూపాల్‌రెడ్డి మూడుసార్లు శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. భార్య సింధు జిహెచ్ఎంసీ పరిధిలోని భారతీ నగర్ డివిజన్ కార్పొరేటర్‌గా రెండుసార్లు విజయం సాధించి ప్రస్తుత్తం కొనసాగుతున్నారు. సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరున్న అదర్శ్ నిత్యం ప్రజల్లో ఉంటూ రాజకీయంగా ఎదుగుతు వస్తున్నాడు. బిఆర్ఎస్ పార్టీ తరపున పటాన్ చెరువు నియోజకవర్గం నుండి గూడెం మహిపాల్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధంచాడు. గత యేడాది మహిపాల్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ చేరాడు. అప్పటి నుండి బిఆర్ఎస్ పార్టీకి పటాన్‌చెరువులో పెద్ద దిక్కుగా లేకుండా పోయింది. ఎమ్మెల్యే పార్టీ మారినప్పటి నుండి నియోజకవర్గ సీనియార్ నేత అయినా అదర్శ్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తు వస్తున్నాడు. పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యకర్తలను సమన్వయం చేయడానికి, మరింతగా పార్టీ కార్యక్రమాలను ముందుకు నడిపించడానికి అధిష్టానం కో అర్డినేటర్‌గా అదర్శ్ రెడ్డిని నియామించారు. వరంగల్ రజితోత్సవ సభను బిఆర్ఎస్ అధిష్టానం ప్రతిష్టత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఈరోజు వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులతో సమీక్షాను మాజీ సీఎం కెసీఅర్ నిర్వహించారు. ఈ సంధర్భంగా పటాన్ చెరువు నియోజక వర్గ కోఅర్డినేటర్‌గా అదర్శ్ రెడ్డి ని నియమించడం జరిగింది.

**పార్టీని బలోపేతం చేస్తా : ఆదర్శ్ రెడ్డి**

తనను పటాన్ చెరువు నియోజకవర్గ కోఅర్డినేటర్ నియమించినందుకు మాజీ సీఎం కెసీఅర్‌కు, మాజీ మంత్రి హరీష్ రావుకు కృతజ్ఞతలు. నియోజకవర్గంలోని బిఆర్ఎస్ కార్యకర్తలను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తాం. కార్యకర్తలకు అండగా, అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన పోరాటం చేస్తా.

# రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి



**హుస్నాబాద్, ఏప్రిల్02(జనంసాక్షి)**

గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిజమైన కళాకారులకు మొండి చేయి చూపించిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వమైన ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చే ప్రయత్నం చేయాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో డప్పు చప్పుల్లతో పాటలు పాడుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఊరు ఊరు తిరిగి ప్రజలను చైతన్య పరచడంలో కళాకారులు కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గత ప్రభుత్వంలో చాలామంది అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిందని,

ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి నిజమైన కళాకారులకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాంత కళాకారుల అధ్యక్షులు తాడూరి సురేష్,ఉపాధ్యక్షులు పొన్నాల అశోక్, ప్రధాన కార్యదర్శి,కొడముంజ రవీందర్,గడిపే చిన్న,కళ్ళేం లక్ష్మణ్ ,దారపు చంద్రమౌళి,గజ్జల వినోద ,గొల్లపల్లి వినోద్ తదితరులు కళాకారులు పాల్గొన్నారు .

# మిల్లర్లను అర్థం చేసుకొని ఆదుకోవాలి

## మంత్రి సీతక్క కు వినతి



**ములుగు బ్యూరో,ఏప్రిల్02 (జనంసాక్షి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ధనవంతులు తినే సన్నబియ్యాన్ని ప్రతి పేదవాడికి అందించాలనే సదుద్దేశంతో సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇచ్చినటువంటి గొప్ప ప్రభుత్వం, ప్రభుత్వానికి రైతులకు మధ్యల అనుసంధానం అయినటువంటి రైస్ మిల్లర్లను పాలసీ తయారు చేసే సమయంలో ప్రభుత్వాలు అధికారులు రైస్ మిల్లర్లను కూడా భాగస్వామ్యం చేసినట్లయితే గ్రౌండ్ లెవెల్ లో ఉన్నటువంటి నిజాలు తెలిసే అవకాశం ఉంటది. కానీ ఇంత పెద్ద వ్యవస్థలో నిర్ణయాలు తీసుకునే సమయంలో రైస్ మిల్లర్ల ప్రమేయం లేకపోవడం బాధాకరం. సివిల్ సప్లై మినిస్టర్ ఉత్తంకుమార్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పండించినటువంటి ఏ దాన్యమైన రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చినట్లయితే కేంద్ర ప్రభుత్వం ధాన్యంకు సంబంధించి బియ్యం సేకరణ చేయదు. అందువల్ల ఇప్పుడు పండించిన సన్నధాన్యం మేం బాయిల్డ్ బియ్యం ఇస్తాము అన్నా కూడా సెంట్రల్ గవర్నమెంట్ ఎఫ్సీఐ వారు తీసుకోరు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో మిల్లర్లు ఉన్నారు.

# పరిశోధనలు విద్యార్థుల కెరీర్‌కు దోహదపడతాయి

## ఐఐసిటి చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ శ్రీధర్



**నర్సాపూర్, ఏప్రిల్ 02 (జనంసాక్షి)**

: పరిశోధనలు విద్యార్థుల కెరీర్లను నిర్మించడంలో సామాజిక పురోగతికి ఎంతగానో దోహదపడతాయని ఐఐసిటి చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ శ్రీధర్ అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణ సమీపంలో గల బివిఆర్ఐటి కళాశాలలో నిర్వహించిన 2025 పరిశోధన మూడవ ఎడిషన్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. బివిఆర్ ఐ టి కళాశాల పరిశోధన అభివృద్ధి సెల్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వైపు అనే అంశంపై దృష్టి సారించి ఆర్ అండ్ డి 2025 మూడవ ఎడిషన్ నిర్వహించిందన్నారు. 14 విభాగాల నుండి 500 కంటే విద్యార్థి ప్రాజెక్టులు ఆవిష్కరణ విద్య నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. అనంతరం బి వి ఐ టి ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే మాట్లాడుతూ పరిశోధనలకు కేంద్ర బిందువుగా బివిఆర్ఐటి ఎల్లప్పుడూ నిలబడుతుందని ఆయన గుర్తు చేశారు.

# గ్రూప్ 1 ర్యాంకర్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని, (జనంసాక్షి)**

: గ్రూప్ - 1 పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన మంథని కి చెందిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన ఛాంబర్ లో తనను కలిసిన గ్రూప్-1 అభ్యర్థి జక్కుల అరుణ కుమార్ ను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 1 పోటీ పరీక్షల్లో మంథని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ కుమార్ రాష్ట్రస్థాయిలో 114వ ర్యాంకు, మల్టి జోనల్ 1 స్థాయిలో 64వ ర్యాంకు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత విద్యార్థిని, అతని తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్ , తల్లిదండ్రులు మల్లేశ్వరి , లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ముఖ్య నేతలతో కెసిఆర్ భేటీ



**నర్సాపూర్, ఏప్రిల్ 02 (జనంసాక్షి)**

: బిఆర్ఎస్ పార్టీ రజ తోత్సవాల మహాసభ ఏర్పాటు చేయనున్నందున బుధవారం ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫామ్ హౌస్ లో ఉమ్మడి మెదక్ జిల్లా ఆయా నియోజకవర్గాలకు చెందిన బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలతో, మాజీ ఎమ్మెల్యేలతో, ముఖ్య నేతలతో కెసిఆర్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల కోసం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నర్సాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరయ్యారు.

# ఈద్ మిలాప్‌లో మంత్రి రాజనర్సింహ





**మునిపల్లి ఏప్రిల్ 2( జనం సాక్షి)**

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామంలోని అభిషేక్ గార్డెన్ లో పవిత్ర రంజాన్ పండుగ ను పురస్కరి ం చుకొని ఏర్పాటుచేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, రాయికోడు మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి అసద్ పటేల్, మాజీ ఎంపీపీ తాటిపల్లి రామిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ బి. పాండు, మునిపల్లి మండల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నాంపల్లి కోర్టులో విచారణకు మంత్రి శ్రీధర్ బాబు



**మంథని,(జనంసాక్షి)**

: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 2017 సంవత్సరంలో పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన కాళేశ్వరం ప్రజాబి ప్రాయా సేకరణ సమయంలో నమోదైన కేసులో విచారణలో భాగంగా బుధవారం హైదరా బాద్ నాంపల్లి కోర్టుకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. వారితో పాటు ప్రభుత్వ సలహాదారు హర్కల వేణుగోపాల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, శశి భూషణ్ కాచే, చొప్పరి సదానందం, ఉప్పట్ల శ్రీనివాస్, సెగ్గం రాజేష్, పోలు శివ, పోతారవేణి క్రాంతి కుమార్, ఇనుముల సతీష్, ఇందారపు అనిల్,

పేరవేన రాజు యాదవ్ తదితరులు ఈ కేసులో విచారణ నిమిత్తం కోర్టుకు హాజరయ్యారు.

# మానవత్వం చాటుకున్న బి.ఎన్.రావు ఫౌండేషన్

## కోమాలో ఉన్న రోగి కుటుంబానికి ఇరవై వేలు ఆర్థిక సాయం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 02 (జనంసాక్షి)**

: గత నెల 2వ తేదీన ప్రమాదానికి గురైన చట్ల సమ్మయ్య కు బి ఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.నరేందర్ రావు స్పందించి బుధవారం రోజు 20వేల ఆర్థిక సాయం అందించారు. మార్చ్ 2 తేదీన ప్రమాదానికి గురైన చట్ల సమ్మయ్య నెల రోజులుగా కోమాలో ఉన్నాడు, హైదరాబాదులో తలకి ఆపరేషన్ చేయించుకుని రెండు వారాల తర్వాత కరీంనగర్ ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడ ఒక వారం రోజులు ఉన్న తర్వాత రోగి ఆరోగ్యం కుదుట పడకపోవడంతో నగరంలోని ఒక రిహాబిడేషన్ సెంటర్లో వైద్యం పొందుతున్నందున నెల రోజులుగా వైద్య ఖర్చులు సుమారు పది లక్షల వరకు ఖర్చ ఖర్చు అయినాయి. కడు నిరుపేద కుటుంబమైన సమ్మయ్య కుటుంబానికి డాక్టర్ బి.ఎన్ రావు తమ ఫౌండేషన్ ద్వారా ఇరవై వేలు ఆర్థిక సాయం చేసి వారి కుటుంబానికి అండగా నిలబడ్డారు. అంతేకాకుండా ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి పేషెంట్ కి తగిన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పేషంట్ కు సంబందించిన వారు బి ఎన్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు.

# చరవాణీలు జాగ్రత్తగా పెట్టుకోండి



**పాపన్నపేట,ఏప్రిల్ 2(జనంసాక్షి):**

రద్దీ ప్రాంతాలలో ప్రజల తమ చరవాణీ లు సురక్షితంగా పెట్టుకో వాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. బుధవారం పాపన్నపేట ఠాణాలో విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడారు .ఆధునిక టెక్నాలజీ సిఈఐఆర్ వెబ్ పోర్టల్ ఉపయోగించి 22 ఫోన్లు రికవరీ చేశామన్నారు.ఠాణాలో బాధితులకు ఫోన్లు అందజేశారు.మొబైల్స్ చోరీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు .ఐఎంఈఐ నెంబర్ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.ఈసందర్భంగా మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్,స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

# కొండాపూర్ ఆర్ఐ సస్పెన్షన్, తహసిల్దార్ బదిలీ

## వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరులో అవకతవకలు

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2 (జనంసాక్షి)** : వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరులో అవకతవకలకు పాల్పడిన కొండాపూర్ ఆర్ఐ మహాదేవు సస్పెన్షన్, వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణంగా తాహసిల్దార్ ఏస్తేరు అనిత ను నారాయణఖేడ్ ఆర్ డిఓ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండాపూర్ మండలంలో ఆర్ఐ తప్పుడు పంచనామా నివేదిక ఆధారంగా తహసిల్దార్ వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఈ విషయం కలెక్టర్ కు బాధితులు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన కలెక్టర్ ఆర్ఐని సస్పెన్షన్ చేస్తూ తాహసిల్దార్ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు.

# యూట్యూబ్ ఛానల్ పై దాడి

**45 మంది పై నాన్ బెయిలబుల్ కేసు**

**రాజేంద్రనగర్, ఏప్రిల్2(జనం సాక్షి)**

: రాజేంద్రనగర్ లోని హైదర్ గూడ లో చిత్రగుప్తా యూటూబ్ చానెల్ యజమాని యూటూబర్ గిరిష్ పై దాడి కేసులో 45 మహిళలు ఉన్నట్లు గుర్తించిన రాజేంద్రనగర్ పోలీసులు. గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 45 మంది పై నాన్ బెలబుల్ సెక్షన్ల కింద 115 (2), 127 (2), 324 (4), 325 (4), 351 (2), 191 (2), రెడ్ విత్ 62/2 కింద కేసులు నమోదు చేశారు. దాడిని అడ్డుకునే ప్రయత్నం లో పోలీసుల పై దాడి చేసిన బీజేపీ శ్రేణులు, బీజేపీ కార్యకర్తల పై బిఎన్ఎస్ 121(1) రెడ్ విత్ 3/5 కేసు నమోదైంది.ఇప్పటి వరకు 5 మంది మహిళలని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన రాజేంద్రనగర్ పోలీసులు.మిగితా 40 మంది కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. గీతాంజలి సినిమా లో ఉన్న నందికొండ వాగుల్లో పాట ని వక్రీకరించి పాడాడని బీజేపీ శ్రేణులు ఆరోపించారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయురాలు సస్పెన్షన్

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2( జనం సాక్షి)** : విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా ప్రైవేటు వ్యక్తిని అనుమతి లేకుండా వాలంటరీగా నియమించిన ఉపాధ్యాయురాయురాలు బి. సుజాత పై జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సస్పెన్షన్ వేటు వేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం మయూరి నగర్ మండల ప్రజా పరిషత్ పాఠశాలకు బుధవారం డిఇఓ ఆకస్మికంగా వెళ్లారు ఉదయం 08:20 గంటలకు డీఈఓ వెళ్లగా ఉపాధ్యాయురాలు సుజాత (ఎస్ జి టి) 08:45గం.లకు హాజరు కావడం జరిగినది. అలాగే ఎటువంటి అనుమతి లేకుండా డిసెంబర్ 2024 నుండి ప్రైవేటు వ్యక్తిని ఉపాధ్యాయుడిగా పాఠశాలలో నియమించడంతో ఆగ్రహించిన జిల్లా విద్యాధికారి ఉపాధ్యాయురాలు సుజాతను సస్పెన్షన్ చేశారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

# బీసీ బిల్లు పార్లమెంటులో ఆమోదించాలి

**రాజేంద్రనగర్,ఏప్రిల్2(జనం సాక్షి)**

: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాల ధర్నాలో రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పాల్గొని బీసీలకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును పార్లమెంటులో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ బిసి రిజర్వేషన్ బిల్లు అమలుపై ధర్నాలు పాల్గొన్నారు.



# కొలిక్కి వచ్చిన ఎస్ఆర్ హెచ్, హెచ్ సిఏ



**ఉప్పల్ ఏప్రిల్ 2 ( జనం సాక్షి) :**

ఎస్ ఆర్ హెచ్ ప్రతినిధులు, సభ్యులతో ప్రభుత్వం భేటీ, ఎస్ ఆర్ హెచ్, హెచ్సీఏ మధ్య వివాదం పై చర్చించిన ప్రభుత్వం. ప్రభుత్వ జోక్యంతో సద్దుమణిగిన వివాదం. స్టేడియం సామర్థ్యంలో 10 శాతం టికెట్లను తమకు కేటాయించాలని కోరిన హెచ్ సి ఏ ప్రతినిధులు. హెచ్ సి ఏ కి 3.900 ఉచిత పాసులను కేటాయింపు. ఇది ఇలా

ఉండగా ఉప్పల్ స్టేడియం వద్ద ఉద్రిక్తత ఉప్పల్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. హెచ్ సి ఏ బ్లాక్ లో టిక్కెట్లు మార్కెట్ లో అమ్ముతున్నట్టు అకారపు అర్జున్ పటేల్ కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ సి ఏ ప్రెసిడెంట్ జగన్ మోహన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.జగన్ డాం డాం నినాదాలు చేశారు. దీంతో యూత్ కాంగ్రెస్ నాయకులను ఉప్పల్ పోలిస్ లు అరెస్ట్ చేశారు.

# రాజీవ్ యువ వికాసంలో జర్నలిస్టులకు ప్రాధాన్యం

- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ స్పందన
- మంచి ఆలోచనని టీడబ్ల్యూజేఎఫ్ కు కలెక్టర్ అభినందనలు
- అదనపు కలెక్టర్ శ్రీజాకు జాబితా ఇవ్వాల్సిందిగా సూచన



ఖమ్మం, ఏప్రిల్ 2 (జనంసాక్షి) : రాజీవ్ యువ వికాసం పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఐడీవోసీలో బుధవారం అందజేసిన వినతిపత్రంపై కలెక్టర్ స్పందించారు. మంచి సూచన చేశారంటూ టీడబ్ల్యూజేఎఫ్ నేతలను అభినందించారు. అప్లికేషన్ చేసుకుని జాబితాను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజాకు ఇస్తే ఆమె వాటిని పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటారన్నారు. నిరుద్యోగులకు ఉద్దేశించిన పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వటం సముచితమన్నారు. జర్నలిస్టులు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు కాబట్టి వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ సూచన మేరకు అల్పాదాయ వర్గాలకు చెందిన జర్నలిస్టులకు రాజీవ్ యువ వికాసంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. జర్నలిస్టులు దరఖాస్తు చేసుకొని, అప్లికేషన్ నంబర్ టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు సమర్పిస్తే వారు ఆ వివరాలను అదనపు కలెక్టర్ కు అందజేస్తారన్నారు. రాజీవ్ యువ వికాసంలో ఎక్కువ మంది జర్నలిస్టులకు లబ్ధి చేకూర్చేలా చూస్తామన్నారు. కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్, ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నేతలు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, కూరాకుల గోపీ, ఆవుల శ్రీనివాస్, వేగినాటి మాధవ్, షేక్ జానీపాష, మధుశ్రీ, దేవేందర్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, అర్షద్, గణేశ్, ఫయాజ్, జాకీర్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

# యువ వికాసం అమలుకు కట్టుదిట్టమైన చర్యలు

- ఏప్రిల్ 14 వరకు యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ
- మండల కార్యాలయాల్లో ఆన్ లైన్ దరఖాస్తుల నమోదుకు సహాయకుల ఏర్పాటు
- మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించిన ఖమ్మం జిల్లా కలెక్టర్



ఖమ్మం (జనంసాక్షి) : యువ వికాసం అమలుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, రాజీవ్ యువ వికాసంపై అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్ల క్రింద 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కొరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ఓబిఎంఎంఎస్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎంపిడిఓ, తహసిల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ను మంచి కంప్యూటర్, ఇంటర్నెట్ కనెక్షన్ తో ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సహకారం అందించాలని అన్నారు. గ్రామాలలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన డాక్యుమెంట్ లపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఆధార్, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల లోపు) మొదలైనవి అవసరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాలు మాత్రమే యాక్సెప్ట్ చేయడం జరుగుతుందని, లబ్దిదారులకు అర్హత ఉంటే తహసిల్దార్ ఫాస్ట్ ట్రాక్ లో అవసరమైన సర్టిఫికెట్ జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్దిదారులకు అవసరమైన బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని అన్నారు. మనకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి ప్రాక్టికల్ గా నడిచే యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లబ్దిదారులకు నడిచే యూనిట్లపై ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజావాణి తరువాత సమావేశం నిర్వహించి దరఖాస్తుల స్క్రూటిని, చేపట్టాల్సిన చర్యల పై చర్చించాలని అన్నారు. సెక్టార్ స్పెసిఫిక్ యూనిట్ లను సంబంధిత అధికారులు తప్పనిసరిగా సర్టిపై చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 14 తర్వాత రాజీవ్ యువ వికాసం క్రింద వచ్చిన దరఖాస్తులు, ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సరి చూసుకుని స్క్రూటినీ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో ధృవీకరించిన దరఖాస్తులలో కొంత శాతం జిల్లా స్థాయి అధికారులు మరొకసారి పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. జూన్ నెల నాటికి యూనిట్ల గ్రౌండింగ్ కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ఎన్. విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, బ్యాంక్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు

ఖమ్మం టౌన్ (జనంసాక్షి) : శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఘన నివాళులు అర్పించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొని, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, గౌడ సంఘం నాయకులు మిత్రు గౌడ్, అంజయ్య, ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టరెట్ పరిపాలన అధికారి ఎన్. అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ల జయంతిని విజయవంతంగా నిర్వహించాలి

- నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ బ్యూరో,ఏప్రిల్ 2 (జనం సాక్షి) : బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ల జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.ఏప్రిల్ 5 న బాబు జగ్జీవన్ రామ్,ఏప్రిల్14 న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ విషయమై బుధవారం ఆమె ఉదయాదిత్య భవన్ లో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ రెండు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణలో తీసుకోని విజయవంతం చేసేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.అందువల్ల సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.ముందుగా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జయంతిల సందర్భంగా పారిశుధ్యం,డెకరేషన్,టెంట్లు,ఇతర ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.అనంతరం ఏర్పాట్లపై వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిల సందర్భంగా రిజిస్టర్డ్ సంఘం నుండి ఒకరికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని, డివిజన్ వారిగా ఉత్సవాలు నిర్వహించాలని,మర్రి గూడ జంక్షన్ కు అంబేద్కర్ జంక్షన్ గా నామకరణం చేయాలని,అంబేద్కర్ విగ్రహానికి బాబు జగ్జీవన్ విగ్రహానికి దండలు వేసేందుకు ఇబ్బంది ఉందని,ఆ సమస్య తొలగించాలని,అంబేద్కర్ కల్చరల్ భవనాన్ని బాగు చేయాలని,ఉత్సవాలకు హాజరయ్యే విద్యార్థులకు ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని,టెంట్ వెయ్యాలని,రోడ్డు విస్తరణ సందర్భంగా తొలగించిన జగ్జీవన్ రామ్,అంబేద్కర్ విగ్రహాలను పునరుద్ధరించాలని, జయంతిలతోపాటు, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని కోరారు.అదనపు ఎస్ పి రమేష్,జడ్పి సి ఈ ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు,డి సి ఓ పత్యా నాయక్,తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# రెండు రోజుల్లో 2500 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ

- సన్నబియ్యం పంపిణీని పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) : ప్రతి ఒక్కరు రోజు సన్నబియ్యం తినాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి ఒక్కరికి 6 కేజీల ఉచిత సన్నబియ్యం పంపిణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 610 రేషన్ దుకాణాలలో రెండు రోజులలో 1.24 లక్షల మంది లబ్ధిదారులకి 2500 మెట్రిక్ టన్నుల పంపిణి చేయటం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.సూర్యాపేట పట్టణం లోని రేషన్ షాప్ నెంబర్ 14ని అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో బియ్యం నాణ్యత బాగుందా అని అడగగా గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం తినే విధంగా లేవని ఇప్పుడు ఇస్తున్న సన్న బియ్యం నాణ్యతతో పాటు ప్రతి ఒక్కరు తినేలా చాలా బాగున్నాయని కలెక్టర్ తో సంతోషంగా చెప్పారు.రేషన్ షాప్ లో ఉన్న స్టాక్, బియ్యం నాణ్యత,ఈ పాస్ మిషన్ లో జరుగుతున్న లావాదేవీలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డిటి నాగలక్ష్మి, రేషన్ డీలర్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ జరగాలి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలను భర్తీ చేస్తాం
- కొత్త రేషన్ కార్డులు, సభ్యుల చేరిక నిరంతర ప్రక్రియ
- తిరుమలగిరి సాగర్ లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే జైవీర్



తిరుమలగిరి (సాగర్) ఏప్రిల్ 02, (జనంసాక్షి): సన్న బియ్యం పంపిణీ పారదర్శకంగా జరగాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ పథకం నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యుడు కుందూరు జైవీర్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలన్నారు. చౌక ధర దుకాణాలలో తూకం సరిగా ఉండేలా చూడాలని ,మండలంలో ఖాళీగా ఉన్న అన్ని చౌక ధర దుకాణాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని, కొత్త రేషన్ కార్డులకు మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, రేషన్ కార్డులో పేర్లను సైతం మీసేవ కేంద్రాల ద్వారా చేర్చుకోవచ్చని తెలిపారు. మరణించిన వారి పేర్లను అధికారులే స్వచ్ఛందంగా రేషన్ కార్డుల నుండి తొలగిస్తారని ,ఈ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలన్నారు .ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ సన్నబియ్యం పథకం చారిత్రక కార్యక్రమమని, 40 ఏళ్లుగా దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్నప్పటికీ , ప్రజలు వాటిని తినడం లేదని, అవి రీసైక్లింగ్ అవుతున్నాయని, ప్రతి పేదవాడు ధనవంతులతో పాటు సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రభుత్వం రైతులు, మహిళల సంక్షేమం కోసం ఎల్లప్పుడు పాటుపడుతున్నదని ,దానిలో భాగంగానే ఉచిత బస్సు, 500 రూపాయలకే సిలిండర్, గృహజ్యోతి ,రైతులకు బోనస్ రైతు భరోసా వంటి పథకాలన్నింటిని అమలు చేస్తున్నామన్నారు. ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం తాము నిరంతరం పనిచేస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ,తిరుమలగిరి సాగర్ స్పెషల్ ఆఫీసర్ ఏపీడి శారద, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్, తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, షాగం పెద్దిరెడ్డి , రాఘవరెడ్డి ,శ్రవణ్ కుమార్, పగడాల సైదులు నెమలి శ్రీధర్ రెడ్డి కట్టబోయిన తదితరులు పాల్గొన్నారు.

# గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక లాభాలు

- లాభాల బాటలో డిసిసిబి బ్యాంక్
- చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 2 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక లాభాలు సాధించిందని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి తెలిపారు.బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యాపార వృద్ధి,తక్కువ ఎన్ పి ఏ సాధించడం జరిగిందన్నారు. మేనేజ్మెంట్,ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. బ్యాంకు రు.2850.81 కోట్ల టర్నవర్ తో లాభాల బాటలో నడుస్తుందని చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.తమ పాలకవర్గం అధికార చేపట్టిన నాటి నుండి రూ 900 కోట్ల టర్నోవర్ లో ఉన్న బ్యాంకును సభ్యులు,అధికారుల సమిష్టి సహకారంతో ఈ ఆర్థిక సంవత్సరం రూ 42.31కోట్ల ప్రాఫిట్ సాధించామన్నారు.బ్యాంకు రాష్ట్రంలో గతంలో 8వ స్థానంలో ఉండగా నేడు రెండవ స్థానానికి తీసుకొచ్చామన్నారు. పంట రుణం ఎకరానికి రూ1 లక్ష ఉండగా దానిని రూ1.5 లక్ష వరకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో నూతనంగా 5 రైతు సేవ సహకార సంఘాలను తిప్పర్తి, ఆత్మకూర్,గరిడేపల్లి, నారాయణపూర్, దామరచర్ల మండలాలలో పర్మిషన్ ఇవ్వడం జరిగిందన్నారు. అవసరమైన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కొత్తగా 6 బ్రాంచీల ఏర్పాటు కొరకు ఆర్.బి.ఐ పర్మిషన్ కొరకు కోరడం జరిగిందని చెప్పారు. ఈ పాలకవర్గం సొసైటీల అభివృద్ధికి ఎంతో కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వందకోట్ల డిపాజిట్లను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని నేటికీ కొత్తగా సహకార లక్ష్మి,సహకార సమృద్ధి, స్కీం ల ద్వారా రు.100 కోట్ల డిపాజిట్లను సేకరించామన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ పాలకవర్గం పనిచేస్తుందని పేర్కొన్నారు.గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో ఇంటి నిర్మాణం కొరకు రు.35 లక్షల వరకు భూమి తనఖా పై రుణ పథకాన్నిప్రారంభించామన్నారు. నూతన సభ్యులకు వంద కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకు ద్వారా రైతులకు రు.614 ఓట్ల రుణాలు బట్వాడా చేశామని చెప్పారు. గొర్రెలు నాటు కోళ్ల పెంపకానికి సబ్సిడీ స్కీమ్ ఎన్ ఎల్ ఎం ను ప్రారంభించామన్నారు.ఈసమావేశంలో డిసిసిబి వైస్ చైర్మన్,సీఈవో శంకర్ రావు, డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి,బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అదుపుతప్పిన ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆటో

- అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి



పెన్ పహాడ్, ఏప్రిల్ 02 (జనంసాక్షి) : రోడ్ పై ఆగివున్న ట్రాక్టర్ ట్రక్కును వెనుకభాగంలో ఢీకొట్టిన ఆటో, అక్కడికక్కడే డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సింగరెడ్డిపాలెం గ్రామం చివరలో జరిగింది.ఎస్ ఐ గోపీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటలోని జే జే నగర్ కు చెందిన చిన్నపంగు జనార్ధన్ తండ్రి రాములు (36) తన ఆటోలో గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామం నుండి సూర్యాపేట వెళుతుండగా మండలంలోని సింగరెడ్డి పాలెం గ్రామ చివరలో చింతకాయల బాలకృష్ణ అనే ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ ను నిర్లక్ష్యంగా రోడ్డుపైన నిలుపగా ఆటో అదుపుతప్పి ట్రాక్టర్ ట్రక్కువెనుక భాగంలో ఢీకొట్టగా ఆటో నడుపుతున్న జనార్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య లక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ గోపికృష్ణ తెలిపారు...




# క్రికెట్ బిజినెస్‌లోకి సారా

## ముంబై ఫ్రాంచైజీని కొనుగోలు సచిన్ గారాల పట్టి



**జనంసాక్షి:**క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గారాలపట్టి సారా టెండూల్కర్ క్రికెట్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. గ్లోబల్ ఈ–క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో సారా ముంబై ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. ఈ లీగ్ గతేడాదే పరిచయం చేయబడింది. తొలి సీజన్ విజయవంతం కావడంతో రెండో సీజన్‌లో కొత్త జట్లను ఆహ్వానించారు. ఈ లీగ్‌లో ఆటగాళ్లు రియల్ క్రికెట్–24 అనే డిజిటల్ ప్లాట్‌ఫాంపై పోటీపడతారు. ఈ లీగ్ యొక్క గ్రాండ్ ఫినాలే ఈ ఏడాది మేలో జరుగుతుంది. ఈ లీగ్ డిజిటల్ స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్ యొక్క సరిహద్దులను అధిగమించడానికి కృషి చేస్తుంది. ఈ లీగ్‌లో సారా ప్రవేశం తమకు మేలు చేస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్పోర్ట్స్‌పై సారాకు ఉన్న ఆసక్తి తమ లీగ్‌ను అన్ని వర్గాల ప్రజలకు పరిచయం చేస్తుందని అన్నారు. సారాకు ఉన్న అపారమైన ప్రజాదరణ తమ లీగ్‌ను భారత్‌లోని అన్ని మూలలకు తీసుకెళ్తుందని ఆకాంక్షించారు.గ్లోబల్ ఈ–క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఫ్రాంచైజీనే కొనుగోలు చేయాలన్న సారా నిర్ణయం ఈ ప్రాంతంతో ఆమెకున్న లోతైన అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. సారా తండ్రి సచిన్ ముంబైలోనే పుట్టి పెరిగాడు. సచిన్ దేశవాలీ కెరీర్ మొత్తం ముంబైతోనే సాగింది. రిటైరయ్యాక కూడా సచిన్ ముంబైతో అనుబంధం కలిగి ఉన్నాడు. సచిన్ ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌లో (ఐపీఎల్ ఫ్రాంచైజీ) భాగమై ఉన్నాడు. సారా సోదరుడు అర్జున్ టెండూల్కర్ కూడా ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.


స్వయంకృషి.. పట్టుదల.. కఠోరశ్రమకు నిర్వచనం..

# బిలియనీర్ నిర్మల్ మిండా





**జనంసాక్షి:**కృషి, పట్టుదల ఉంటే మనిషి దేన్నైనా సాధించగలడు. తాను ఏ స్థితిలో ఉన్నా భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరగలడు. అందుకు ప్రముఖ వ్యాపారవేత్త నిర్మల్ మిండా(66) జీవితమే ఉదాహరణ. తన తండ్రికి చెందిన చిన్న మెకానిక్ షాపులో వాహనాలకు ఎలక్ట్రిక్ పరికరాలను తయారు చేసే నిర్మల్ మిండా క్రమంగా వ్యాపారంలో ఎదిగి ఏకంగా రూ.66,904 కోట్ల విలువైన యునో మిండా కంపెనీకి సారథిగా నిలిచారు. తాను ఇంత స్థాయికి ఎలా ఎదిగారో ఈ కథనంలో తెలుసుకుందాం. నిర్మల్ మిండా హరియాణాలో జన్మించారు. తనకు చిన్నతనం నుంచి ఇంజినీరింగ్ పట్ల అభిరుచి ఉండేది. తన తండ్రి షాదీలాల్ మిండాకు ఢిల్లీలోని కమలానగర్‌లో మోటారు సైకిళ్లకు అవసరమైన ఎలక్ట్రికల్ విడిభాగాలను తయారు చేసే ఓ చిన్న షాపు ఉంది. ఇక్కడే ఆయన విజయానికి పునాది పడింది. నిత్యం తండ్రి చేస్తున్న పనిని గమనిస్తూ ఈ రంగంలో కీలక మార్పులు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. దాంతో ఆటోమోటివ్ ప్రొడక్షన్‌లో కెరీర్ ప్రారంభించాలని భావించి మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. ఇంజినీరింగ్‌లో ఉన్నప్పుడే తాను కారు ఉత్పత్తికి అవసరమైన అన్ని అంశాలను నేర్చుకున్నారు. 1977లో తన 20వ ఏట తన తండ్రి కంపెనీలో చేరారు. అప్పటికే తన ఆలోచనలతో చిన్న షాపుగా ఉన్న వారి కుటుంబ వ్యాపారం కాస్తా చిన్నపాటి కంపెనీగా రూపాంతరం చెందేందుకు కృషి చేశారు. ఆయన మొదట్లో సంస్థలో మార్కెటింగ్ విభాగంలో పనిచేసి కొత్త ఆలోచనలు, ఆశయాలను పంచుకున్నా రు. 1990ల్లో నిర్మల్ తన సోదరుడితో విడిపోయి సొంతంగా వ్యాపారం ప్రారంభించారు. గతంలో మిండా ఇండస్ట్రీస్ అని పిలువబడే యునో మిండాకు పునాది వేశారు. అతని వ్యూహాత్మక దూరదృష్టితో కేవలం మోటారుసైకిల్ భాగాల్లో మాత్రమే కాకుండా ఇతర విడిభాగాలను తయారు చేయడం ప్రారంభిం చారు. సెన్సార్లు, లైట్లు, అల్లాయ్ వీల్స్‌తో సహా విస్తృత శ్రేణి ఆటోమోటివ్ భాగాలను మార్కెట్‌లో ప్రవేశపె ట్టారు. ఇవి ద్విచక్ర వాహనాలు, కార్లు రెండింటి అవసరాలను తీర్చాయి. దాంతో కొద్ది కాలంలోనే కంపెనీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది. ప్రస్తుతం యునో మిండా హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో వంటి ప్రధాన ఒరిజినల్ పరికరాలతోపాటు అంతర్జా తీయ బ్రాండ్లకు సరఫరాదారుగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 73 తయారీ ప్లాంట్లను కలిగి ఉంది. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) రంగంలోకి ప్రవేశిం చడం యునో మిండా వృద్ధికి కీలకంగా మారింది. 2020 నుంచి కంపెనీ సెన్సార్లు, లైటింగ్ వంటి విభాగాల్లో అధునాతన విడిభాగాలను ఉత్పత్తి చేస్తుంది. ఇందుకోసం చైనాకు చెందిన సుజౌ ఇనోవాన్స్ ఆటోమోటివ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆటోమోటివ్ పరిశ్రమలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు తోడ్పడుతుందని కంపెనీ నమ్ముతుంది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.50,268 కోట్లు కాగా, ప్రపంచవ్యాప్తంగా ఆటో కాంపోనెంట్స్ రంగంలో అతిపెద్ద సంస్థల్లో ఒకటిగా నిలిచింది. నిర్మల్ మిండా వ్యక్తిగత సంపద అతని వ్యాపార విజయాన్ని ప్రతిబింబిస్తుంది. ఇప్పటివరకు అతని సంపద నికర విలువ 3.5 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది సుమారు రూ.30,000 కోట్లకు సమానం. దాంతో గురుగ్రామ్‌లోనే అత్యంత సంపన్నుడిగా నిలిచారు. దాంతోపాటు భారతదేశంలోని బిలియనీర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. గురుగ్రామ్‌లోని రెండో అత్యంత ధనవంతుడైన దీపిందర్ గోయల్ సంపద కంటే మిండా సంపద మూడు రెట్లు ఎక్కువ. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024 ప్రకారం మిండా సంపద 2018లో ఒక బిలియన్ డాలర్ల నుంచి 2025 నాటికి 3.5 బిలియన్ డాలర్లకు చేరింది. నిర్మల్ మిండా కేవలం బిజినెస్ టైకూన్ మాత్రమే కాదు. ఆయన పరోపకారిగా కూడా గుర్తింపు పొందారు. సామాజిక అభ్యున్నతికి సుమన్ నిర్మల్ మిండా ఫౌండేషన్ (ఎస్ఎన్ఎమ్ఎఫ్) స్థాపించి దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమన్ మిండాను వివాహం చేసుకున్న అతను నిత్యం వందల సంఖ్యలో పిల్లలకు ఆహారం, ఆశ్రయంతోపాటు విద్యను అందించేలా మిండా బాల్ గ్రామ్ అనే అనాథాశ్రమాన్ని స్థాపించారు. నిరుపేద పిల్లల కోసం ప్రాథమిక పాఠశాల మిండా విద్యా నికేతన్‌ను ఏర్పాటు చేశారు. అతని కృషికి 'హరియాణా రత్న' అవార్డు, ఇండియా యమహా మోటార్స్ నుంచి 'గోల్డ్ అవార్డు ఫర్ క్వాలిటీ' వంటి ప్రశంసలు లభించాయి. నిర్మల్, సుమన్ దంపతులకు పరిధి, పల్లక్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.






# ఆల్‌టైమ్ గరిష్ఠానికి పసిడి..

**జనంసాక్షి:**
స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధరలు ఇటీవల కొంత శాంతిం చినట్లు కనిపించినా తిరిగి జీవితకాల గరిష్ఠాలను చేరుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో మంగళవారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై, చెన్నై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.85,100 (22 క్యారెట్స్), రూ.92,840 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. దేశ రాజధాని నగరం దిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.85,250కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.92,990గా ఉంది. బంగారం ధరలు నిన్నటితో పోలిస్తే ఎలాంటి మార్పులు చెంద లేదు. స్థిరంగా ఉన్నాయి. బంగారం ధరలు స్థిరంగా ఉన్నట్లే వెండి ధరల్లోనూ బుధవారం ఎలాంటి మార్పు లు రాలేదు. కేజీ వెండి రేటు ప్రస్తుతం రూ.1,14,000గా ఉంది.




# జొమాటోలో ఉద్యోగాల కోత..

**జనంసాక్షి:**ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో గత ఏడాది ప్రారంభించిన అసోసియేట్ ప్రోగ్రామ్ నుంచి దాదాపు 500 మంది జూనియర్ స్థాయి ఉద్యోగులను తొలగించింది. జొమాటో అసోసియేట్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ (జాప్)లో భాగంగా గత ఏడాది 1,500 మందిని కస్టమర్ సర్వీస్ రోల్స్ కోసం నియమించుకుంది. ఈ ఉద్యోగులను ఆపరేషన్స్, మార్కెటింగ్, సేల్స్, సప్లై చైన్‌తో సహా వివిధ విభాగాల్లో సేవలకు ఉపయోగించుకుంది. ప్రస్తుతం జాప్‌లో ఉన్న వారిలో 1,000 మందిని కొనసాగించాలని, మిగతావారి(సుమారు 33 శాతం మంది) పనితీరు సరిగా లేదనే కారణంతో లేఆఫ్స్ ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.పనితీరు సరిగా లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం వంటి కారణాలతో ఈ ఉద్యోగులను తొలగించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఉద్యోగం కోల్పోయిన వారికి నష్టపరిహారంగా రెండు నెలల వేతనం ఇచ్చినట్లు చెప్పాయి. అయితే కొందరికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఉద్యోగం నుంచి తొలగించారని సోషల్ మీడియా వేదికగా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పరిణామంపై జొమాటో స్పందించలేదు. ఇటీవల తన మాతృసంస్థ పేరును ఎటర్నల్‌గా మార్చిన జొమాటోకు పెరుగుతున్న పోటీ, క్విక్ కామర్స్‌లో వస్తున్న మార్పుల వల్ల లాభాలు క్షీణిస్తున్నాయి. 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 57 శాతం క్షీణించి రూ.59 కోట్లకు పరిమితమైంది. క్విక్ కామర్స్ బిజినెస్ వేగంగా వృద్ధి చెందుతున్నప్పటికీ జొమాటోకు అతిపెద్ద ఆదాయ వనరుగా ఉన్న ఫుడ్ డెలివరీ విభాగం వృద్ధి మందగిస్తుంది.

కొవిడ్ తరహా..

# రష్యాలో కొత్త వైరస్.. కలకలం..

**అంతుచిక్కని వ్యాధి విజృంభిస్తున్నట్లు పలు వార్తాసంస్థల కథనాలు**

**తీవ్రమైన శ్వాసకోస సంబంధిత వ్యాధులతో, దీర్ఘకాలిక జ్వరంతో బాధపడుతున్న ప్రజలు**

**అవన్నీ తప్పుడు ప్రచారాలే అని కొట్టిపారేస్తున్న అధికారులు**




**మాస్కో:** రష్యాలో అంతుచిక్కని వైరస్ విజృంభిస్తున్నట్లు పలు వార్తాసంస్థలు పేర్కొంటున్నాయి. అక్కడి ప్రజలు తీవ్రమైన శ్వాసకోస సంబంధిత వ్యాధులతో.. దీర్ఘకాలిక జ్వరంతో బాధపడుతున్నారని తెలిపాయి. వైరస్ కారణంగా వారు దగ్గుతున్నప్పుడు రక్తం పడుతోందనే నివేదికలు ప్రపంచ దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. రష్యాలో మిస్టరీ వైరస్ విజృంభిస్తోందని మార్చి 29న పలు నివేదికలు వెలువడ్డాయి. పలు నగరాల్లో ప్రజలు వారాలతరబడి జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్ర దగ్గుతో బాధపడుతున్నారని.. ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని అవి పేర్కొన్నాయి. అయితే కొవిడ్ టెస్టులు చేసినప్పుడు నెగిటివ్ వచ్చిందని.. ఇది మరో కొత్త వైరస్ అయి ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశాయి.రష్యాకు చెందిన అలెగ్జాండ్రా అనే మహిళ ఐదు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుందని.. కొన్ని రోజులకు దగ్గుతున్న సమయంలో రక్తం పడుతున్నట్లు తెలిపిందని నివేదికలు వెల్లడించాయి. ఎన్ని మందులు వాడినప్పటికీ తగ్గుదల కనిపించట్లేదని ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటువంటి అనేక ఇతర కేసుల గురించి వివరించాయి. మరికొందరు నెటిజన్లు తాము తీవ్రమైన రక్తంతో కూడిన దగ్గుతో బాధ పడుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

**అవన్నీ తప్పుడు ప్రచారాలు..**

కాగా ఈ నివేదికలను రష్యన్ అధికారులు ఖండించారు. తాము జరుపుతున్న పరీక్షల్లో దేశంలో ఎలాంటి నూతన వ్యాధి కారకాలు బయటపడలేదని.. కొత్త వైరస్ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని వెల్లడించారు. రకరకాల వదంతులు, తప్పుడు ప్రచారాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ అందులో నిజం లేదన్నారు. నివేదికల్లో పేర్కొన్న మహిళకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు మైకోప్లాస్మా న్యుమోనియా ఉన్నట్లు నిర్ధరించారని తెలిపారు. ఒకవేళ కొవిడ్ తరహా వైరస్ వస్తే దానిని ఎదుర్కోవడానికి తగిన సదుపాయాలు ఉన్నాయన్నారు.

# పొంచివున్న పెనుముప్పు?

## మహాభూకంపంతో లక్షల సంఖ్యలో మరణాలు



**న్యూఢిల్లీ:** భవిష్యత్‌లో మహా భూకంపం రానుందా? దీని తీవ్రతకు 3,00,000 మంది ప్రాణాలు కోల్పోనున్నారా? లెక్కలేనన్ని నగరాలు సముద్రంలో మునిగిపోతాయా?ఈ సామూహిక విధ్వంసానికి సమయం ఆసన్నమయ్యిందా?.. ఒళ్లు గగుర్పొడిచే ఈ ప్రశ్నలకు 'అదే జరగవచ్చు' అంటూ జపాన్ తన అంచనాలను, భవిష్యవాణిని వెల్లడించింది.ఏజెన్సీ ఫ్రాన్స్–ప్రెస్ (ఏఎఫ్‌పీ) తెలిపిన వివరాల ప్రకారం జపాన్ ప్రభుత్వ సంస్థ భవిష్యత్‌లో మెగా భూకంపం రానున్నదని అంచనా వేసింది. ఈ భారీ భూకంపం భూమిపై అపరిమిత వినాశనాన్ని కలిగిస్తుందని, మూడు లక్షల మంది మరణానికి కారణమవుతుందని తెలిపింది. ఈ భారీ భూకంపం కారణంగా సునామీ సంభవిస్తుందని, ఇది అనేక నగరాలను సముద్రంలో కలిపేస్తుందని పేర్కొంది. 'మెగా క్వేక్ అనేది చాలా శక్తివంతమైన భూకంపం. దీని తీవ్రత 8 లేదా అంతకన్నా అధిక తీవ్రతతో ఉంటుంది. ఇది భారీ విధ్వంసానికి కారణంగా నిలుస్తుంది. సునామీని కూడా సృష్టిస్తుంది.ఇటీవల మయన్మార్ 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇది వేలాది మందిని పొట్టన పెట్టుకుంది. వేలాది మంది ప్రస్తుతం ఆస్పత్రులలో జీవన్మరణ సమస్యతో పోరాడుతున్నారు. లెక్క లేనంత మంది గల్లంతయ్యారు. పలు నగరాల్లో, ఎత్తైన భవనాలు, ఇళ్లు, దేవాలయాలు శిథిలమయ్యాయి. మయన్మార్‌లో సంభవించిన భూకంపం థాయిలాండ్‌లోనూ వినాశనాన్ని మిగిల్చింది. బ్యాంకాక్‌లో అత్యవసర పరిస్థితిని విధించాల్సి వచ్చింది. ఈ పరిస్థితులను మరువక ముందే జపాన్ మహాభూకంపం అంచనాలను చెప్పడంతో అందరూ ఆందోళనకు గురవుతున్నారు. జపాన్ ప్రభుత్వం తమ దేశ పసిఫిక్ తీరంలో వినాశకరమైన మెగా క్వేక్ సంభవించవచ్చని తెలిపింది. దీని కారణంగా సునామీ వస్తుందని, ఇదే జరిగితే జపాన్‌లో లక్షలాది మంది ప్రజలు కొన్ని నిమిషాల్లోనే మృత్యువాత పడతారని పేర్కొంది. మృతదేహాలను లెక్కించడం కూడా కష్టమయ్యేంత విధ్వంసం జరుగుతుందని అంచనా వేసింది. జపాన్ ఆర్థిక వ్యవస్థ దాదాపు నాశనమవుతుందని పేర్కొంది. అందుకే మెగా భూకంపాన్ని ఎదుర్కొనేందుకు సన్నాహాలు ఇప్పటి నుంచే ప్రారంభించినట్లు వెల్లడించింది.భూకంపాల పరంగా జపాన్ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన జోన్‌లో ఉంది. ఇక్కడి సముద్ర తీరప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం 80 శాతం ఉందని పలు నివేదికలు చెబుతున్నాయి. వార్తా సంస్థ ఏఎఫ్‌పీ నివేదిక ప్రకారం జపాన్‌లో 9 తీవ్రతతో భూకంపం సంభవిస్తే, 13 లక్షల మంది నిరాశ్రయులు కానున్నారు. భవనాలు కూలిపోవడం వల్ల సుమారు 3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే జపాన్ ఆర్థిక వ్యవస్థ 2 ట్రిలియన్ డాలర్లు (అంటే రూ. 171 లక్షల కోట్లకు పైగా) నష్టపోతుంది. ఈ నష్టం నుండి కోలుకోవడం జపాన్‌కు చాలా భారంగా మారుతుంది.




# రూ.61.74 లక్షల కోట్లు

## భారత్ విదేశీ రుణాలు..

**'క్వార్టర్లీ ఎక్స్‌టర్నల్ డెట్' నివేదిక గణాంకాల వెల్లడి**



**జనంసాక్షి:**భారత్ విదేశీ రుణాలు 2024 డిసెంబర్ చివరికి 717.9 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.61.74 లక్షల కోట్లు) చేరాయి.2023 డిసెం బర్ చివరికి ఇవి 648.7 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన 'క్వార్టర్లీ ఎక్స్‌టర్నల్ డెట్' నివేదికలోని గణాంకాలు కింది విధంగా ఉన్నాయి.2024 సెప్టెంబర్ చివరికి ఇవి 712.7 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు తెలుస్తోంది. అంటే అంతక్రితం త్రైమాసికంతో పోల్చి చూస్తే 0.7 శాతం.. ఏడాది క్రితం ఇదే కాలంతో పోల్చి చూస్తే 10 శాతం అధికమయ్యాయి. జీడీపీలో విదేశీ రుణాలు డిసెంబర్ చివరికి 19.1 శాతానికి చేరాయి. 2024 సెప్టెంబర్ చివరికి 19 శాతంగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా రూపాయితోపాటు ఇతర ప్రధాన కరెన్సీలతో డాలర్ బలపడడం విదేశీ రుణ భారం విలువ పెరిగేందుకు దారితీసింది.యూఎస్ డాలర్ మారకంలోని బకాయిలు మొత్తం విదేశీ రుణాల్లో 54.8 శాతంగా ఉన్నాయి. ఆ తర్వాత రూపాయి మారకంలో విదేశీ రుణాలు 30.6 శాతంగా ఉంటే, జపాన్ యెన్ మారకంలో 6.1 శాతం, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) రూపంలో 4.7 శాతం, యూరో మారకంలో 3 శాతం చొప్పున ఉన్నాయి.

# విలాస నౌకలో నోరో వైరస్..

## 200 మందికి పైగా ప్రయాణికులకు అస్వస్థత

**జనంసాక్షి:**ఒక భారీ పర్యటక నౌకలో నోరో వైరస్ కలకలం రేపుతోంది. క్వీన్ మేరీ 2 లగ్జరీ విలాస నౌకలో ఈ వైరస్ కారణంగా 200 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు.యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) ఈ విషయాన్ని వెల్లడించినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి.క్వీన్ మేరీ 2 కునార్డ్ లైన్స్ అని పిలిచే ఈ క్రూయిజ్ నౌక మార్చి 8న సౌతాంప్టన్ నుంచి తూర్పు కరేబియన్‌కు బయలుదేరాయి. నౌకలో మొత్తం 2,538 మంది ప్రయాణికులు, 1,232 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో 224 మంది ప్రయాణికులు, 17 మంది సిబ్బంది ఈ నోరో వైరస్ బారినపడినట్లు నిర్ధరణ అయ్యింది. ఒక ట్రాకింగ్ సైట్ ప్రకారం.. మార్చి 18న ఆ నౌక న్యూయార్క్‌లో ఆగింది. ఆ సమయంలోనే ఈ వైరస్ వ్యాపించినట్లు తెలుస్తోంది. వైరస్ బారిన పడినవారికి చికిత్స అందించడంతో పాటు నౌకను సానిటైజ్ చేసినట్లు కునార్డ్ తెలిపింది. మిగిలిన వారికి ఈ వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటోన్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఈ నౌక నార్త్ వెస్ట్ అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న క్వీన్ మేరీ 2, సౌతాంప్టన్ మార్గంలో ఉంది. ఇది మొత్తం 29 రోజుల ట్రిప్ కాగా.. ఏప్రిల్ 6న ఇది ముగియనుంది. నోరో వైరస్‌ను 'వామిటింగ్ బగ్' అని కూడా అంటారు. ఈ వైరస్‌కు వేగంగా వ్యాప్తి చెందే లక్షణముంది. అన్ని వయసుల వారికి ఇది సోకుతుంది. కలుషితమైన ఆహారం కారణంగా మన శరీరంలోకి ప్రవేశిస్తుందని అమెరికన్ సీడీసీ వెల్లడించింది. నోరో వైరస్ సోకిన 12 నుంచి 48 గంటల్లో దాని లక్షణాలు కనిపిస్తాయి. అవి మూడు

# మృత్యుంజయుడు..

## భూకంపం శిథిలాల నుంచి.. ఐదు రోజుల తర్వాత సజీవంగా



భారీ భూకంపంతో మయన్మార్ థాయ్‌లాండ్‌లు వణికిపోతున్నాయి. ఈ ప్రకృతి విపత్తు కారణంగా మయన్మార్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది.అదేవిధంగా శిథిలాల కింద చిక్కుకుపోయిన వేలాది మందిని రక్షించేందుకు సహాయక సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈక్రమంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన ఓ వ్యక్తిని సిబ్బంది రక్షించారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్, టర్కిష్‌కు చెందిన సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈక్రమంలోనే రాజధాని నేపిడాలోని ఓ భవనం శిథిలాల కింద 26 ఏళ్ల వ్యక్తిని గుర్తించారు. వెంటనే అతడిని రక్షించి, ఆస్పత్రికి తరలించారు. ఇటీవల రెస్క్యూ సిబ్బంది మాండలేలోని గ్రేట్‌వాల్ హోటల్ శిథిలాల నుంచి ఒక గర్భిణీని సజీవంగా బయటకు తీసిన సంగతి తెలిసిందే. ఇక, ఈ భూకంపం కారణంగా మధ్య, వాయువ్య మయన్మార్‌లో మొత్తం 10 వేల భవనాలు కులిపోవడం లేదా పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.నిమిషాల వ్యవధిలో వచ్చిన భారీ భూకంపాలతో ఇటీవల మయన్మార్ కుదేలైంది. బలమైన ప్రకంపనల ధాటికి పలు నిర్మాణాలు, భవనాలు ఎక్కడికక్కడ పేకమేడల్లా కూలిపోయాయి. ప్రకృతి విపత్తు కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 2,719 మంది మృతిచెందగా.. 4,521 మంది గాయపడ్డారు. ఇంకా 441 మంది ఆచూకీ తెలియరావాల్సి ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విపత్కర సమయంలో పొరుగుదేశానికి అండగా నిలిచేందుకు 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట భారత్ పెద్దఎత్తున సహాయక సామగ్రిని చేరవేస్తోంది. 80 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యల్లో పాల్గొంటోంది. భారత్‌తో పాటు వివిధ దేశాలు కూడా మయన్మార్‌కు సాయాన్ని అందిస్తామని ప్రకటించాయి. ఇక, థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఇప్పటివరకు 13 మృతదేహాలు బయటపడ్డాయి. భూకంపం కారణంగా నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# జలమండలికి వరల్డ్ వాటర్ అవార్డు




**హైదరాబాద్ (జనంసాక్షి)**

జలమండలిని వరల్డ్ వాటర్ అవార్డు వరించింది. వాటర్ డైజెస్ట్ అనే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 2024-2025 సంవత్సరానికి వరల్డ్ వాటర్ అవార్డ్స్ లో జలమండలికి గవర్నమెంట్ కేటగిరీలో ఉత్తమ ఎస్టీపీ అవార్డు లభించింది. యునెస్కో భాగస్వామ్యంతో నిర్వహించిన 19వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్స్ (2024-2025) సంవత్సరానికి ఎస్టీపీ/ మురుగు నీటి శుద్ధి అవార్డు లభించింది. ఈ అవార్డును జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ ప్రధాన కార్యాలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్ లో ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ లకు బుధవారం అందజేశారు. ఈ అవార్డు రావడంపై ఎండీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అందరికీ తాగు నీరు అందించడంతో పాటు.. ఉత్పన్నమయ్యే మురుగును శుద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాగోల్ 320 ఎమ్మెల్డిల ఎస్టీపీ పర్యావరణ అనుకూలత, సమర్థవంత మైన మురుగు నీటి శుద్ధి మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విశేష ప్రాముఖ్యతను చూపినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. మురుగు శుద్ధి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం, మరియు సమాజానికి పరిశుభ్రమైన.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని




అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. అలాగే అధునాతన నీటి నిర్వహణ, సర్క్యులార్ ఎకానమీ విధానాలు, మురుగు నీటి పునర్వినియోగం వంటి అంశాలలో చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. నాగోల్ ఎస్టీపీ మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో పెద్ద ప్లాంట్ ప్రసిద్ధి చెందింది. చాదర్ ఘాట్ నుంచి ప్రారంభమయే మురుగు నీరు.. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ఎన్నో నాలలను కలుపుకుంటూ నాగోల్ వద్దకు చేరుకుంటుంది. ఇక్కడ నిర్మించిన ప్లాంట్ ద్వారా నిత్యం 320 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం మార్చ్ 31న ఢిల్లీలో జరిగింది. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్-I

సుదర్శన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం కుమార్, డీజీఎం నిరుపమ మేనేజర్లు పాల్గొన్నారు.

# గ్రూప్-1లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల అత్యుత్తమ ర్యాంకులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :**



టీజీపీఎస్సీ గ్రూప్-1 పోస్టులకు నిర్వహించిన రాత పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు పొంది కొలువులు సాధించిన తమ ఉద్యోగుల పిల్లలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో నారాయణపేట డిపోనకు చెందిన కండక్టర్ ఎరుకలి శ్రీనివాస్ కూతురు వీణ 118 వ ర్యాంకును.. టీఐ-2 గా పనిచేస్తున్న వాహిద్ కూతురు ఫాహిమినా ఫైజ్ 126 ర్యాంకును, వనపర్తి డిపోలో పనిచేస్తోన్న టీఐ-2 ఎస్.బాల్ రెడ్డి, కండక్టర్ బి.పుష్పలతల కుమారుడు రాఘవేందర్‌రెడ్డి 143 ర్యాంకును సాధించారు. హైదరాబాద్ బస్ భవన్‌లో బుధవారం గ్రూప్-1లో మెరిసిన వీణ, ఫాహిమినా ఫైజ్, రాఘవేందర్‌రెడ్డిలతో పాటు వారి కుటుంబ సభ్యులను టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ఘనంగా సన్మానించారు. అనంతరం అసమాన ప్రతిభను కనబరిచి గ్రూప్-1 ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ కొలువుగా భావించే గ్రూప్-1లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు రాణించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజా రవాణా వ్యవస్థకు వారి తల్లిదండ్రుల చేస్తోన్న సేవ, కష్టించే తత్వాన్ని ఆదర్శంగా తీసుకుని.. నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఉషా దేవి, డిప్యూటీ సీపీఎం శీరిష, నారాయణపేట డీఎం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు సాగు నీరు చేరేలా చర్యలు

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**మంథని (జనంసాక్షి) :**



చివరి ఆయకట్టు వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కమాన్ పూర్, పెద్దపల్లి ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి మండలం రంగాపూర్ 43.5 కిమీ వద్ద ఎస్సారెస్పీ డీ 83 కాలువ ను , కమాన్ పూర్ మండలం గుండారం వద్ద ఆర్.ఎస్.బీ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ నుంచి విడుదలయ్యే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సాగునీటి సరఫరా లో ఎలాంటి అవాంతరాలు ఉండటానికి వీలు లేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. చివరి విడత నీటి విడుదల జరుగుతున్నందున ఎక్కడ పోలాలు ఎండిపోకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. కాల్వలో సిల్ట్ తొలగింపు, చిన్న చిన్న మరమ్మత్తులకు ప్రతిపాదనలు అందిస్తే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎస్. ఈ. సత్య రాజ్ చంద్ర, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కే .శ్రీనివాస్,ఈ.ఈ మంథని బలరామయ్య, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా కలెక్టరేట్లో పాపన్న గౌడ్ వర్ధంతి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 2 (జనం సాక్షి) :**



సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ విక్టర్, జెడ్పి సీఈవో చందర్ నాయక్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. సర్వాయి పాపన్న వరంగల్ జిల్లాలో జన్మించడం జరిగినదని. భువన గిరి స్థానంగా ఎన్నో పోరాటాలు చేసి సమ సమాజ స్థాపన కోసం, బడుగు, బలహీన అభ్యున్నతికి పోరాటం చేసిన మహనీయుడని చెప్పడం జరినది. తరువాత గౌడ సంఘ ప్రతినిధులు మరియు ఇతర సంఘాల నాయకులు పూలు అర్పించి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి చక్రధర్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి నరేష్, పవన్, స్వప్న, సునీత, రాజేశ్వర్ మిగతా ఆఫీస్ సభ్యులు మరియు గౌడ సంఘ నాయకులు రాజాగౌడ్ తిరుమల గౌడ్, కల్లు గీత కార్మికులు. సంఘ నాయకులు మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# పేదల గుండెల్లో శాశ్వతంగా సన్నబియ్యం పథకం

## చొప్పదండీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 02 (జనంసాక్షి)**

: దేశ చరిత్రలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విప్లవాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ పథకం పేదలకు ఒక వరమని, ధనికులు తినే సన్నబియ్యాన్ని పేదలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని రామడుగు మండలం వేదిర గ్రామం లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సన్న బియ్యాన్ని లబ్దిదారులకు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... ఈ పథకం నిరుపేదలకు ఒక వరమని, ఏ ప్రభుత్వం ఉన్నా సన్నబియ్యం పథకాన్ని అమలు చేసి తీరాల్సిందేనని పేర్కొన్నారు. ఆ విధంగా పేదల కోసం పకడ్బందీగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వానాకాలం వరి పంట కొనుగోలు సమయంలో రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించి సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

## ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
## సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**





ఈ నెల 4 నుండి జరగనున్న కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం ఇల్లందకుంట తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగింది. బ్రహ్మోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌస్ ఆలం సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4 నుండి 16 వరకు ఇల్లందకుంట దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు అంతరాయం లేకుండా చూడాలని, అధిక లోటును దృష్టిలో ఉంచుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులు వివిధ మార్గాల ద్వారా వచ్చే అవకాశం ఉన్నందున సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. భారీకేడ్లు, లైటింగ్, తాగునీటి సదుపాయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లా నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించాలని సూచించారు. స్వామివారి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా లైవ్ టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు అవసరమైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి భోజన వసతి కల్పించాలని అన్నారు. ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఇల్లందకుంట దేవస్థానం అతి పెద్దదని అన్నారు. ఈసారి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి భక్తుడికి భోజనం, తాగునీరు అందిస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఉత్సవాల కోసం 6 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు వెయ్యి వాహనాలు పార్కింగ్ చేయవచ్చని అన్నారు. సీసీ కెమెరాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫోల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో రమేష్, ఏసీపి శ్రీనివాస్, ఆలయ ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

# గోల్కొండ కోటను ఏలిన దీరుడు పాపన్న



**పాలకుర్తి, ఏప్రిల్ 02(జనంసాక్షి)**

గోల్కొండ కోటను ఏలిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటను జయించిన బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన తొలి బహుజన చక్రవర్తి పాపన్న అని కొనియాడారు. రాజ్యాధికారం కోసం పాపన్న పోరాడిన తీరు ఎందరికో స్పూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి,ఎండి మదార్, మూల వెంకటేశ్వర్లు, పులి గణేష్, మాదాసు హరీష్, బై కానీ ఐలేష్, రాజేష్ నాయక్. సురేష్ నాయక్, కమ్మగాని మహేష్, తదితరులు ఉన్నారు.



# పోలీసుశాఖ ప్రతిష్ట పెంచాలి

## కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి : ఎస్పి.యోగేష్ గౌతం

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

పోలీసు శాఖలో పనిచేస్తూ సమాజ సేవలో పాలుపంచుకునీ ప్రతిష్ట పెంచాలని పదవి విరమణ తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. పోలీస్ శాఖలోఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వివిధ పోలీస్టే షన్లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, 35 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించి మార్చ్31న పదవీ విరమణ పొందిన డి సి ఆర్ బీ హెడ్ కానిస్టేబుల్ రాజా రామ్ నీ బుధవారం ఉదయం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించి వారి సేవలను అభినందిం చారు. పోలీస్ శాఖ మీకు ఎల్లవేళలా అండగా ఉంటదని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో ఆర్ ఐ. నరసింహ, ఎస్సై లు సునీత, రమేష్, నరేష్,ఆర్ ఎస్సై లు శివ శంకర్, మద్దయ్య, పదవి విరమణ పొందిన రాజా రామ్ భార్య లక్ష్మీ, పిల్లలు పవన్ కుమార్, వెంకటేష్,డి సి ఆర్ బి స్టాఫ్,డి పి ఓ, ఎస్ బి, ఐటి కోర్ స్టాఫ్, ఆర్ముడు రిజర్వు పోలీసులు, తదితరులు పాల్గొన్నారు

# కళకు వన్నె తెచ్చిన అల్ఫోర్స్ "ప్రథమోత్సవ్"

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 02 (జనంసాక్షి)**




: విద్యార్థులకు కళల పట్ల ఆసక్తి కలిగించాలని వాటిలో పాల్గొనటానికి ప్రోత్సాహం అందించి సమాజం పట్ల పట్టు సాధించే విధంగా ప్రణాళికలను రూపొందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో "ప్రథమోత్సవ్" పేరుతో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు సంప్రదాయాన్ని పాటిస్తూ సరస్వతి మాత విగ్రహానికి పూజ కార్యక్రమాన్ని ఆచరించి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకగా కార్యక్రమాన్ని విద్యార్థుల కేరింతల మధ్య అట్టహాసంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా సాధన చేస్తూ విశ్లేషిస్తూ వివిధ విషయాలలో పట్టు సాధించి సమాజంలో అత్యుత్తమంగా స్థిరపడాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విశేషంగా కృషిచేసి వారికి మంచి పేరు తీసుకురావాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో గత 35 సంవత్సరాలుగా విద్యారంగా అభివృద్ధికై ఎనిలేని కృషి చేస్తున్నదని విద్యార్థులకు అన్ని రకాలుగా వసతులను కల్పించి విజేతలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు. ప్రతి విద్యార్థి సమాజంలో పై చేయి సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు నిర్వహించినటువంటి వివిధ పోటీ పరీక్షలలో, ప్రతిభాపాటవ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నాటికలు ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముంబైకి జైస్వాల్ రాంరాం



**ముంబయి:** యువ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీల్లో కొంతకాలం నుంచి ముంబయి తరపున ఆడుతున్న అతడు.. ఉన్నట్టుండి ఆ జట్టుకు రాంరాం చెప్పాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు లేఖ రాశాడు. గోవాకు మారేందుకు తనకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని కోరగా, అతడి అభ్యర్థనను జట్టు పాలక వర్గం కూడా అంగీకరించినట్లు తెలిసింది. "ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక ఏదైనా కారణం ఉండొచ్చు. అతడి రిక్వెస్ట్‌ను అంగీకరించి జట్టు నుంచి రిలీవ్ చేశాం" అని ముంబయి క్రికెట్ అసోసియేషన్ అధికారి ఒకరు బుధవారం పీటీఐకి వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను జట్టు మారుతున్నట్లు జైస్వాల్ తన లేఖలో పేర్కొన్నాడు. దీంతో 2025-26 సీజన్ నుంచి ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ గోవా తరపున దేశవాళీ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.

ఈ మధ్యకాలంలో దేశవాళీలో ముంబయి వీడిన మూడో ఆటగాడు జైస్వాల్. అంతకుముందు 2022-23 సీజన్ సమయంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్, మరో క్రికెటర్ సిద్దేశ్ లాడ్ కూడా ముంబయిని వీడి గోవాకు మారారు. ఇక, తాజా పరిణామాలపై గోవా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ శాంబ దేశాయ్ స్పందించారు. జైస్వాల్‌ను తమ జట్టులోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించని సమయంలో గోవాకు అతడు కెప్టెన్‌గా గానూ వ్యవహరించే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు.

2019లో జైస్వాల్ ముంబయి జట్టులో చేరాడు. అప్పటి నుంచి అన్ని ఫార్మాట్లలో కలిపి 63 మ్యాచ్లు ఆడాడు. రంజీల్లో 10, లిస్ట్ ఏలో 25, టీ20ల్లో 28 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. రంజీల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధశతకాలు ఉన్నాయి. ఇటీవల జాతీయ జట్టు ఆటగాళ్లు దేశవాళీల్లోనూ ఆడాలని బీసీసీఐ ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఏడాది జనవరిలో జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్లో జైస్వాల్ ఆడగా.. 4,26 పరుగులతో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.

# ‘2024’ సీన్ రిపీట్

## పంత్‌తో గోయెంకా సంభాషణ వివాదస్పదం

సన్ రైజర్స్ హైదరాబాద్కు షాక్ ఇచ్చిన లఖ్ నవూ సూపర్ జెయింట్స్‌కు సొంత మైదానంలో మాత్రం ఓటమి తప్పలేదు. పంజాబ్ కింగ్స్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే, మ్యాచ్ అనంతరం లఖ్ నవూ ఓనర్ సంజీవ్ గోయెంకా కెప్టెన్ రిషబ్ పంత్‌ల మధ్య సంభాషణ మళ్లీ సోషల్ మీడియాలో వైరల్గా మారింది. మరోసారి ‘కేఎల్ రాహుల్ గోయెంకా’ ఎపిసోడ్ రీక్రియేట్ అయినట్లు అనిపిస్తోందని కామెంట్లు వస్తున్నాయి. డ్రెస్సింగ్ రూమ్లోనూ పంత్ గోయెంకా చర్చించే వీడియోలు బయటకొచ్చా యి. ప్రతి మ్యాచ్ ఫలితంపై కెప్టెన్తో మాట్లాడాల్సిన అవసరం లేదని.. అందుకోసం కోచ్లు ఉన్నారని పలువురు కామెంట్లు చేస్తున్నారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలోనూ గోయెంకా ఇలాగే వ్యవహరించారని మరోసారి గుర్తు చేశారు. కెప్టెను స్వేచ్ఛ ఇస్తేనే ఫలితాలు సానుకూలంగా ఉంటాయనేది వారి వాదన. ఇతర ప్రాంచైజీల ఓనర్లు ఎవరూ ఇలా ప్రవర్తించడం లేదంటూ వ్యాఖ్యలు చేశారు.



**మేం 25 పరుగులు తక్కువ చేశాం: పంత్**

“పంజాబ్కు మేం నిర్దేశించిన లక్ష్యం సరిపోలేదు. కనీసం 25 పరుగులు అదనంగా చేయాల్సింది. ఇవన్నీ ఆటలో సహజమే. మా సొంత మైదానంలో పిచ్ కండీషన్లను సరిగ్గా అంచనా వేయాల్సి ఉంది. త్వరగా వికెట్లను కోల్పోతే భారీగా పరుగులు చేయడం కష్టమే. ప్రతిఒక్కరూ జట్టు కోసం కష్టపడుతున్నారు. పిచ్ మందకొడిగా ఉన్నప్పుడు స్లో బంతులను సంధిస్తే ఫలితం అనుకూలంగా వస్తుంది. ఈ మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకుసాగుతాం. కొన్ని సానుకూల అంశాలూ ఉన్నాయి. ఇంతకుమించి ఏమీ చెప్పలేను” అని వెల్లడించాడు.

# ముంబయి ఫ్రాంచైజీ కొనుగోలు చేసిన సారా టెండూల్కర్

## ఈ- క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో సచిన్ టెండూల్కర్ కుమారె



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ . గ్లోబల్ ఈ- క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జీఈపీఎల్) రెండో సీజన్లో ముంబయి ఫ్రాంచైజీకి యజమానురాలుగా మారింది. ఈ విషయాన్ని డిజిటల్ ఎంటర్‌టైన్మెంట్ అండ్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్గా ఉన్న జెట్సింథెసిస్ ధ్రువీకరించింది. ముంబయి ప్రాంచైజీకు సారా యాజమాన్య బాధ్యతలు స్వీకరించడం ఆమెకు ఈ ప్రాంతంతో ఉన్న బలమైన అనుబంధానికి తార్కాణం అంది. డిజిటల్ యుగంలో క్రికెట్ విస్తృతి పెంచడం అనే లీగ్ లక్ష్యాన్ని ఆమె చేరిక మరింత బలపరుస్తుందని అభిప్రాయపడింది. ‘ముంబయి ప్రాంచైజీను సారా టెండూల్కర్ కొనుగోలు చేయడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఆమె తీసుకున్న ఈ నిర్ణయం జీఈపీఎల్ పరిధిని విస్తరించడానికి, అభిమానులతో కనెక్ట్ కావడానికి మాకు ఎంతో సహాయపడుతుంది’ అని జెట్సింథెసిస్ సీఈఓ, ఫౌండర్ రాజన్ నవనీ అన్నారు. ‘క్రికెట్ మా కుటుంబంలో అంతర్భాగం. జీఈపీఎల్ లో ముంబయి ఫ్రాంచైజీ సొంతం చేసుకోవాలనే నా కల నిజమైంది. ఆట మీద నాకున్న ప్రేమే దీనికి కారణం. స్ఫూర్తిని, వినోదాన్ని అందించే ఈ-స్పోర్ట్స్ ప్రాంచైజీను ముందుకు నడిపించడానికి మా ప్రతిభావంతులైన బృందంతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాను’ అని ఆమె వెల్లడించారు. జీఈపీఎల్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ఈ- క్రికెట్ లీగ్. ఈ రియల్ క్రికెట్ ఇప్పటి వరకు 30 లక్షల డౌన్లోడ్లకు చేరుకుంది. జియోసినిమా, స్పోర్ట్స్ 18లో 24 లక్షల నిమిషాల వీక్షణ సమయాన్ని పూర్తి చేసుకుంది.

# టీ20ల్లో నంబర్‌వన్ బౌలర్‌గా డఫీ

## టాప్ ర్యాంకుల్లో గిల్, పాండ్య



గత రెండు వారాలుగా టీమ్ ఇండియా ఆటగాళ్లు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఆడటం లేదు. అయినాసరే ఐసీసీ ర్యాంకుల్లో కొందరు టాప్లోనే కొనసాగుతుండగా.. పలువురు మాత్రం కాస్త కిందికి పడిపోయారు. అయితే, టీ20ల్లో కివీస్‌కు చెందిన బౌలర్ జాకబ్ డఫీ (723 పాయింట్లు) అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఇలా ఏ ఫార్మాట్లోనైనా టాప్ ర్యాంక్ను అందుకొన్న కివీస్ పేస్ బౌలర్ గా నిలిచాడు. నాలుగు స్థానాలను ఎగబాకి అగ్రస్థానంలోకి చేరాడు. అంతకుముందు 2018లో న్యూజిలాండ్ నుంచి ఇష్ సోధి మాత్రమే ఇలా టాప్ లోకి వెళ్లాడు. కానీ, అతడు స్పిన్నర్. ఇక టీ20 బౌలర్ల జాబితాలో అకీల్ హుసేన్ (707), భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (706) ఒక్కో ర్యాంకు దిగజారి తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు.

భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్య (252) టాప్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్నాడు. ఈ జాబితాలో టాప్ - 10లో మరే ఇతర టీమ్ ఇండి యా ప్లేయర్ లేకపోవడం గమనార్హం. 12వ స్థానంలో అక్షర్ పటేల్ (161) నిలిచాడు. బ్యాటింగ్ విభాగంలో మాత్రం టాప్ -10లోనే భారత్ నుంచి ముగ్గురు బ్యాటర్లకు అవకాశం దక్కింది. రెండో స్థానంలో అభిషేక్ శర్మ (829), నాలుగో స్థానంలో తిలక్ వర్మ (804), ఐదో ర్యాంకులో సూర్య కుమార్ యాదవ్ (739) కొనసాగుతున్నారు. ఆసీస్ డేంజరస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (856)దే అగ్రస్థానం.

**వన్డే బెస్ట్ బ్యాటర్..**

వన్డేల్లో భారత క్రికెటర్ శుబ్మన్ గిల్ (784) అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. పాక్ ఆటగాడు బాబర్ అజామ్ (777) తర్వాత ప్లేస్లో ఉన్నాడు. టీమ్ ఇండియా సారథి రోహిత్ శర్మ (756) మూడో స్థానం, విరాట్ కోహ్లి (736) ఐదో స్థానం, శ్రేయస్ అయ్యర్ (704) ఎనిమిదో స్థానంలో నిలిచారు. వన్డే బౌలర్ల జాబితాలో టాప్-10 నుంచి ఇద్దరు టీమ్ ఇండియా ప్లేయర్లు ఉన్నారు. ఒక్క స్థానం మెరుగుపర్చుకుని కుర్దీప్ యాదవ్ (650) మూడో ర్యాంకుకు చేరాడు. రవీంద్ర జడేజా (616) ఒక ర్యాంకు పైకి చేరి 9వ స్థానంలో కొనసాగుతున్నాడు.

**విమర్శలకు సమాధానమిచ్చిన జడేజా..**

ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ లో కాస్త స్ట్రగుల్ అవుతోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్ ల్లో కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. ఇక చివరి రెండు మ్యాచ్ ల్లో పరాజ యం పాలైంది. ముఖ్యంగా వెటరన్లు ఎంఎస్ ధోనీ, రవీంద్ర జడేజాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు మ్యాచ్ ల్లో గెలిచే ఇంటెంట్ లేకుండా ఆడారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ తో ధోనీ తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ కు రావడంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా రవీంద్ర జడేజా ఈ విమర్శలకు సమాధానం అన్నట్లుగా ఒక పోస్టును షేర్ చేశాడు.

# హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ వివాదం ఎట్టకేలకు పరిష్కారం

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య చెలరేగిన వివాదం ఎట్టకేలకు క్లియర్ అయింది. ఇరువర్గాల ప్రతినిధుల మధ్య భేటీలో సమస్య పరిష్కారమైంది. అసలేం జరిగిందంటేహైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య చెలరేగిన టికెట్ల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో హెచ్‌సీఏ బెదిరిస్తోందని..ఇలా చేస్తే హైదరాబాద్ వదిలి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదే అదనుగా ఎస్ఆర్‌హెచ్ జట్టును ఏపీ ప్రభుత్వం ఆహ్వానించింది. చిలికి చిలికి గాలివానలా మారిన ఈ వివాదానికి ఇప్పుడు శుభం కార్డు పడింది. ఇవాళ హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్, బీసీసీఐ ప్రతినిధులు భేటీ అయ్యారు. ముగ్గురి మధ్య జరిగి త్రై పాక్షిక ఒప్పందం మేరకు నడుచుకునేందుకు అటు ఎస్ఆర్‌హెచ్ ఇటు హెచ్‌సీఏ ప్రతినిధులు అంగీకరించారు. దాంతో ఇకపై ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఎలాంటి ఆటంకం ఉండదు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్ దేవరాజ్ నేతృత్వంలో చర్చలు జరగగా ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్‌లు ఒప్పందాన్ని ఖరారు చేశారు. ఈ త్రై పాక్షిక ఒప్పందం ప్రకారం స్టేడియంలోని అన్ని కేటగిరీల్లో 10 శాతం టికెట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చాలా కాలంగా ఆచరిస్తూ వస్తున్నట్టే ప్రతి కేటగరీలో పాస్ విధానం కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిపాదించింది. ఎస్ఆర్‌హెచ్ సీఈవో షణ్ముగంతో ఫోన్ సంప్రదింపుల తరువాత 3900 కేటగరీ కాంప్లిమెంటరీ పాస్ విధానంలో ఎలాంటి మార్పులు ఉండవని తేలింది. ఎస్ఆర్‌హెచ్‌తో ప్రొఫెషనల్‌గా పూర్తిగా సహకారం అందించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంగీకారం తెలిపింది. గతంలో నెలకున్న వివాదాలు ఇక ముగిసినట్టేనని హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ సంయుక్తంగా ప్రకటించాయి.

# టీమిండియా సొంతగడ్డపై సిరీస్‌ల వేదికల, తేదీల ప్రకటన

ఈ ఏడాదికి సంబందించి బీసీసీఐ.. టీమిండియా పురుషుల జట్టు హోమ్ షెడ్యూల్ ను మంగళవారం ప్రకటించింది. వచ్చే జూన్ లో ఇంగ్లాండ్ పర్యటన తర్వాత వెస్టిండీస్, సౌతాఫ్రికాలతో సొంతగడ్డపై టీమిండియా మ్యాచ్ లను ఆడనుంది. తాజాగా దీనికి సంబంధించిన షెడ్యూల్ ను వెలువరించింది. అక్టోబర్ నెలలో ఇండియాలో హోం మ్యాచ్ లు జరుగుతాయి. అహ్మదాబాద్ లో వెస్టిండీస్ తో జరిగే తొలి టెస్టుతో హోం మ్యాచ్ లు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 2-6 వరకు తొలి టెస్టు, అదేనెల 10-14 వరకు కోల్ కతాలో రెండో టెస్టు జరుగుతుంది. ఆ తర్వాత కాస్త విరామం తర్వాత ఇండియాలో సౌతాఫ్రికా టూర్ మొదలు కాబోతోంది. ఈ సిరీస్ లో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లను భారత్, సౌతాఫ్రికాలు ఆడనున్నాయి. ఇక గువాహటిలో తొలిసారి టెస్టు మ్యాచ్‌ను నిర్వహించనున్నారు.

## కార్పొరేట్ కంపెనీలు, కాలుష్య కంపెనీల కోసం

# పర్యావరణాన్ని బలి పెడతారా?

- హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం దురాక్రమించడాన్ని ఖండించండి
- పాలమూరు అధ్యయన వేదిక పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** 1973లో ఇందిరాగాంధీ ఆరు సూత్రాల పథకంలోని రెండవ అంశాన్ని అమలుపరుస్తూ, అంతర్జాతీయ స్థాయిని తట్టుకునే విధంగా 2300 ఎకరాల భూమి కేటాయించి కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పేరుతో ఏర్పరిచారు. చరిత్రను ఆ విశ్వవిద్యాలయం దేశ నిర్మాణానికి అందించిన సామాజిక వైజ్ఞానిక శాస్త్రవేత్తలు అందించిన అందిస్తున్న దోహదాన్ని మరిచి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ భూముల దురక్రమనకు సిద్ధపడి అక్కడి పర్యావరణ, జీవావరణ వ్యవస్థను బుల్డోజర్లతో ధ్వంసం చేస్తున్నది.

ఈ విధ్వంసాన్ని భూ దురాక్రమనను మానుకొని భూములను వర్సిటీకి వదిలేయాలని డిమాండ్ చేస్తున్నాం అని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్ నగర్ కన్వీనర్ ఎం రాఘవాచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ రూపొందించిన ఇథనాల్ పాలసీ అమలు చేస్తూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఇథనాల్ కంపెనీని చిత్తనూరులో ఏర్పాటు చేయగా ఆ భూముల్లో నెమల్లు, జింకలు చనిపోయే పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు కోసం కాంగ్రెస్ బిజెపి కలిసి పనిచేసే అక్కడి సహజ పర్యావరణాన్ని దెబ్బతీసాయనీ పేర్కొన్నారు. ఇప్పుడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని, పోరాడుతున్న విద్యార్థులపై హింసకాండను ప్రదర్శిస్తున్నారని, దీన్ని పాలమూరు అధ్యయన వేదిక తీవ్రంగా ఖండిస్తోందని ప్రకటించారు. ఆ విశ్వవిద్యాలయ భూములు కాపాడేందుకు ప్రజాస్వామికవాదులు విద్యార్థుల పోరాటానికి మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా ప్రకటనలో కోరారు.

# రాష్ట్రంలోనే మొదటి స్థానం కామారెడ్డి రోడ్ రవాణా శాఖ

**కామారెడ్డి జిల్లా ప్రతినిది, (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం వివిధ పన్నుల వసూళ్ళలో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ కు 92.4% పూర్తిచేసి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుందని కామారెడ్డి రోడ్డు రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పన్నుల రూపంలో గత 2023 - 2024 సంవత్సరం లో 63 కోట్లు వసూలు చేయగా దానికి 16% జోడించి ప్రభుత్వం ఈ సంవత్సరం 73 కోట్ల టార్గెట్ ను విధించిందని అందులో 24 25 సంవత్సరానికి గాను 68 కోట్ల 19 లక్షల రూపాయల పన్నులు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 5.03% ఎక్కువగా పన్నులు వసూలు చేశామన్నారు.

# పేద ప్రజలకు సన్న బియ్యం బువ్వ..!!

- 3.10 కోట్ల పేద కుటుంబాలకు లబ్ధి
- రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల నూతన రేషన్ కార్డులు మంజూరు
- పాత గంజిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్




**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో పాత గంజిలోని చౌక ధర దుకాణం లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సభాపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభాపతి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులకు ప్రజా పంపిణీ పథకంలో భాగంగా చౌక ధరల దుకాణాలు ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల నూతన రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలో నూతనంగా 22,404 రేషన్ కార్డులను మంజూరి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,48,122 రేషన్ కార్డుల ద్వారా 8,52,122 మంది లబ్ధిదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా నెలకు 5,582 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసు చంద్ర, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా దుబ్బ తండా

# అన్నాచెల్లాల విజయ గాథ

## తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం

**తేజవత్ నేతాజీ రైల్వే స్టేషన్ మాస్టర్‌గా, రమాబాయి జూనియర్ లెక్చరర్‌గా, తేజవత్ అశోక్ నాయక్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక**







**మిర్యాలగూడ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** దామరచర్ల మండల పరిధిలోని పర్తునాయక్ తండ గ్రామ పంచాయతీ పరిధిలో గల దుబ్బతండాకి చెందిన అన్నతమ్ముళ్ళతో పాటుగా వారి సోదరి యేక్క విజయ గాథను తండావాసుల్లో పండగ వాతావరణం నెలకొన్నదని చెప్పవచ్చు.వారి విజయ గాథ ఈ విధంగా ఉన్నది ఒకరు రైల్వే స్టేషన్ మాస్టారు కాగా,ఇంకొకరు జూనియర్ లెక్చరర్ గా లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అన్నట్లు ఇంకొకరు తాజాగా విడుదలైన గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని సాధించారు.ఇక వివరాలలోనికి వెళ్తే తేజవత్ మల్య నాయక్ కి ముగ్గురు కొడుకులలో పెద్ద కుమారుడు చినసక్రు ఆతర్వాత కవల పిల్లలైన రాము,లక్ష్మణ్ వారి కుటుంబంలో మొదటగా రాము పెద్ద కుమారుడైన తేజవాత్ నేతాజీ రైల్వే స్టేషన్ మాస్టారుగా 2022 లో ఉద్యోగం సాధించగా( రాము హైదరాబాద్ లో వాచ్మెన్ గా పనిచేస్తూ ఇద్దరు కుమారులను ఉన్నత విద్యను అందించటానికి తీవ్రంగా కష్టపడడం జరిగింది ) ఆ తరువాత చినసక్రు యొక్క చిన్న కూతురైన రమాబాయి ఇంటర్మీడియట్ జూనియర్ లెక్చరర్ గా 2024వ సంవత్సరంలో ఉద్యోగం సాధించింది (చినసక్రు గ్రామంలో చిన్నకిరాణా దుకాణం నడుపుతూ అపుడప్పుడు చేపల వేటకు వెళ్ళి కుటుంబ ఆర్థిక పరిస్థితులను నెట్టకు వస్తూ పిల్లల చదువుల పట్ల ఎప్పుడు నిర్లక్ష్యం వహించలేదు)ఇక లక్ష్మణ్ పెద్ద కుమారుడైన తేజావత్ అశోక్ నాయక్ పరీక్ష ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్ గా-2025వ సంవత్సరంలో బాధ్యతలు నిర్వహిస్తారని సంతోషం వ్యక్తం చేస్తూ తను వ్యవసాయం చేసుకుంటూ ప్రతిరోజు పట్టణంలోని అడ్డా మీద కూలి పనికి పోయి తన ఇద్దరు కుమారులని ప్రభుత్వ ఉద్యోగాల కోసం హైదరాబాదు నగరంలో ఉన్నత చదువులు చదివించాలని నేను పడ్డ కష్టానికి ఫలితం ఇప్పుడు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.




# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళా

## సద్వినియోగం చేసుకోవాలి : ఏఎస్పి మౌనిక

**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 2 జనంసాక్షి :** నల్గొండ ఎస్పి శరత్చంద్ర పవార్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మౌనిక తెలిపారు. యువకులు సమాజంలో జరిగే ప్రతి విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని చెన్నంనేనిపల్లి గ్రామంలో పల్లె నిద్రలో భాగంగా ప్రజలతో వారు ముఖాముఖీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకుని లక్ష్య సాధనకై నిరంతరం కృషి చేయాలని తెలిపారు. మైనర్లు వాహనాలను నడుపరాదని, బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అమ్మాయిలపై వివక్ష చూపకుండా మంచి ఉన్నత చదువులు చదివించాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒక మహిళ ఉన్నత చదువులు చదివి ఉంటే ఆ కుటుంబం ఆర్థిక విద్య ఉద్యోగ రంగాలలో రాణిస్తుందన్నారు. తద్వారా తమ కుటుంబం సంతోషంగా గడుస్తుందని తెలిపారు. ఈ నెల 5న జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారివెంట మాజీ ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ ముత్యాల రాంమూర్తి, కానిస్టేబుల్ భాస్కర్, మాజీ సర్పంచి వెంకట్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులున్నారు.

# పారదర్శకంగా సన్నబియ్యం పంపిణీ

## నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 2 (జనం సాక్షి)** సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె నాగార్జునసాగర్ నియోజక వర్గం, తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి తో కలిసి సన్న బియ్యం పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా చౌకధర దుకాణాలలో తూకం సరిగా ఉండేలా చూడాలని చెప్పారు. మండలంలో ఖాళీగా ఉన్న అన్ని చౌక ధర దుకాణాల ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని కొత్త రేషన్ కార్డులకు మీ -సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని రేషన్ కార్డులో పేర్లను సైతం మీ- సేవ కేంద్రాలద్వారా చేర్చుకోవచ్చని చెప్పారు. చనిపోయిన వారి పేర్లను తామె స్వచ్ఛందంగా కార్డుల నుండి తొలగిస్తామని, పారదర్శకంగా నిర్వహించే ఈ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. దర్తి ఆబా యోజన కింద గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, తిరుమలగిరి సాగర్లోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ సన్న బియ్యం పథకం చారిత్రక కార్యక్రమాన్ని అన్నారు. ధనవంతులతో పాటు బీదవారు సైతం సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, తిరుమలగిరి సాగర్ స్పెషలాఫీసర్, ఏపీ డి శారద, మాజీ జెడ్పిటిసి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్ తదితరులు మాట్లాడారు.గృహనిర్మాణ శాఖ పి డి రాజ్ కుమార్,స్థానిక తహశీల్దార్ తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
03 మార్చి 2025

# శాతవాహన వర్శిటీకి లా కాలేజీ మంజూరు చేయండి



- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌కు బండి సంజయ్ వినతి
- వర్శిటీ వీసీ, మాజీ మేయర్ లతో కలిసి అరగంటకుపైగా న్యాయశాఖ మంత్రితో భేటీ
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- వచ్చే విద్యా సంవత్సరం నుండే కోర్సులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం

**కరీంనగర్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** కరీంనగర్ లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కోరారు. శాతవాహన వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావులతో కలిసి బండి సంజయ్ ఈరోజు మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ లో అరగంటకుపైగా కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. శాతవాహన వర్శిటీ పరిధిలో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి గతంలో విజప్తి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వర్చువల్ ద్వారా తనిఖీ నిర్వహించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వివరణలతో కూడిన నివేదిక కోరిందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపామని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల లా కోర్సుకు అనుమతి ఇవ్వాలని విజప్తి చేశారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అందుకు అనుగుణంగా శాతవాహన వర్శిటీకి అనుబంధంగా సాధ్యమైనంత తొందర్లో లా కాలేజీకి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అట్లాగే రాబోయే విద్యా సంవత్సరం(2025-26) నుండే లా కాలేజీ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు.

# అడవిలోని చెట్లు నరకకుండా రక్షించాలి

- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క




**ములుగు బ్యూరో,ఏప్రిల్02(జనంసాక్షి):** అడవిలోని చెట్ల ను నరకాకుండా రక్షించాలని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచించారు. బుధవారం తాడ్వాయి మండలం కేంద్రం లోని సమ్మక్క సారక్క కల్యాణ మండపంలో గుత్తి కోయ గిరిజనులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,ఎస్పీ శబరిష్ లతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క గుత్తి కోయ గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటు,కరెంట్ సమస్య,వాటర్ సమస్య,రేషన్ కార్డ్స్ మంజూరు చేయాలని గుత్తి కోయ గిరిజనులు కోరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూత్రాగు నీటి సమస్య రాకుండా వాటర్ మీకు ట్యాంకర్ లతో మీ గ్రామాలకు పంపిస్తానని,త్వరలో బోర్లు వేయిస్తానని, అడవులను నరకకుండా కాపాడాలని సూచించారు.అనంతరం మంత్రి సీతక్క గుత్తి కోయ గిరిజన కుటుంబాలకు రేషన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పి శివం ఉపాధ్యాయ,ఎఫ్డిఓ,డిఎస్పి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్,మండల ప్రత్యేక అధికారి రాంపతి,మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు,జిల్లాలోని 84 గుత్తికొయ గ్రామాల ముఖ్యమైన పెద్దలు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ కాలేజీలకు జూన్ 1 వరకు సెలవులు

- సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు: బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) :** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. ఈ సెలవులు మార్చి 30 నుంచి ప్రారంభమై జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు వేసవి సెలవులను స్వీయ అధ్యయనం, నైపుణ్యాల అభివృద్ధి, ఇతర ప్రయోజనకరమైన కార్యకలాపాలకు వినియోగించుకోవాలని సూచించింది. జూన్ 2నుంచి తరగతులు మళ్లీ ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు వెల్లడించింది. అలాగే, సెలవుల సమయంలో అనధికారికంగా తరగతులను నిర్వహించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# పదవీ విరమణతో ఆరోగ్య జీవితాన్ని గడపాలి


- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**జయ శంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని, పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనం దంగా గడపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎస్సై పోరిక లాల్ సింగ్ ను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ పూలమాలలు, శాలువాతో సత్కరించి, బహుమతులు ప్రధానం చేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమని తెలిపారు. కుటుంబానికి దూరంగా ఉంటూ ఎన్నో రకాల త్యాగాలతో పాటు, ప్రజలకు సేవలు అందించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1987 వ సంవత్సరంలో లాల్ సింగ్ పోలీసు కానిస్టేబుల్ గా జిల్లా పోలీసు వ్యవస్థలోకి అడుగుపెట్టి దాదాపు 38 సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థకు సేవలు అందించారని, శాంతి భద్రతల పరిరక్షణలో తనవంతు పాత్రను పోషించడం జరిగిందని ఎస్పీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నగేష్, రత్నం, పోలీస్ అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, పదవి విరమణ పొందుతున్న పొందిన ఎస్సై లాల్ సింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దయచేసి ఆ భూములను కాపాడండి

- సిఎం రేవంత్‌కు రేణూదేశాయ్ వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** కేంద్రీయ విశ్వవిద్యాలయం సమీపంలోని 400 ఎకరాల భూములపై హెచ్‌సీయూ, తెలంగాణ ప్రభుత్వం మధ్య వివాదం రోజు రోజుకు ముదురుతోంది. ఆ భూముల్లో ఎన్నో వన్యప్రాణులు జీవిస్తున్నాయి. అక్కడి భూమిలోని చెట్ల నరికివేతను ఆపాలని విద్యార్థులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అలాగే మరోవైపు జంతువులు, పర్యవరణానికి ప్రమాదం తేవద్దంటూ పలువురు టాలీవుడ్ సెలబ్రెటీ-లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులకు మద్దతు తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ లు చేస్తున్నారు. తాజాగా ఈ వివాదంపై సినీనటి రేణుదేశాయ్ స్పందిస్తూ ' తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వకంగా చేస్తున్న ఓ విన్నపం. నాకు రెండు రోజుల క్రితం ఐఈ÷ఖ భూముల వ్యవహారం గురించి తెలిసింది. అందుకు సంబంధించి కొన్ని విషయాలు కనుకున్నాను. రేవంత్ రెడ్డి గారు మీకు ఒక తల్లిగా రిక్వెస్ట్ చేస్తున్నాను, నాకు ఇప్పుడు 44సంవత్సరాలు రేపో మాపో చనిపోతాను. కానీ నా పిల్లలు అలాగే మన అందరి పిల్లలకు ఆక్సిజన్ అలాగే త్రాగునీరు కావాలి. అవును మాకు అభివృద్ధి కూడా కావలి, మాకు ఐటి పార్క్స్, భారీ భవనాలు, వరల్డ్ క్లాస్ సదుపాయాలు కావాలి. కానీ ఈ 400 ఎకరాల ప్రకృతిని, ఫారెస్ట్ ను ధ్వసం చేయకుండా ఆపడానికి మీకు ఏదైనా అవకాశం ఉంటే వెంటనే ఆపేయండి. మీరు పరిపాలిస్తున్నఈ రాష్ట్ర సిటిజన్‌గా అడుగుతున్న ఏదో ఒకటి చేయండి. మన దగ్గర ఎన్నో ఇతర భూములు ఉన్నాయి. మీరందరు నాకంటే ఏంతో సీనియార్స్. మీకు నాకంటే ఏంతో అనుభవం ఉంది. ఒక తల్లిగా రిక్వెస్ట్ చేస్తున్నాను. ఇందులో నా స్వార్ధం లేదు. ప్లీజ్ ఒకసారి ఆలోచించండి. గతంలో జరిగిన అబివృద్ధి వలనే ఈ రోజు మనం ఇక్కడ ఉన్నాం. కానీ ఆ 400 ఎకరాలు దయచేసి వదిలేయండి. ఒక తల్లిగా అభ్యర్థిస్తున్నాను సదరు అధికారులు ఈ విషయంలో మరోసారి ఆలోచించండి. ఈ నిర్ణయాన్నివెనక్కి తీసుకుంటే మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని

# సర్దార్ సర్వాయి పాపన్న ధీరత్వానికి ప్రతీక : కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) :** తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా కేటీఆర్ నివాళులర్పించారు. రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి ఎనలేనిది అని కొనియాడారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని చాటడానికి ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ పోరాటయోధుడి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను అని పేర్కొన్నారు. జోహార్ సర్వాయి పాపన్న! అని కేటీఆర్ నినదించారు.

**సబ్బండ వర్గాల సమానత్వానికి పాటుపడిన పాపన్న :హరీశ్‌రావు**

బహుజన పోరాట యోధుడు, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘన నివాళు లర్పించారు. పాపన్న గౌడ్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటేలా ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. పాలనలో సబ్బండ వర్గాలను భాగస్వామ్యం చేసి, వేలాది మంది దళిత, బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దింది బీఆర్ఎస్ ప్రభుత్వం. బహుజనుల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మకమైన పథకాలు, కార్యక్రమాలు అమలు చేసి వారి అభ్యున్నతికి పాటు పడింది. పాపన్న గౌడ్ గొప్ప సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ముందుకు సాగుదాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కాకాణి కోసం పోలీసుల వేట

- హైదరాబాద్‌కు ఎపి పోలీసుల రాక
- బంధువులకు నోటీసులు ఇచ్చి తిరుగు పయనం

**అమరావతి, ఏప్రిల్2 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధ రెడ్డి కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. తాజాగా హైదరాబాద్‌లోని కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లారు. కాకాణిపై అక్రమ మైనింగ్ కేసుతో పాటు- ఎస్సీ ఎస్టీ కేసు కూడా నమోదు అయ్యింది. ఇప్పటికే విచారణకు రావాలంటూ కాకాణికి రెండు సార్లు నోటీ-సులు ఇచ్చారు. అయినప్పటికీ విచారణకు మాజీ మంత్రి డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కాకాణి ఇంటికి ఏపీ పోలీసులు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్రమమైనింగ్‌కు సంబంధించి రెండు సార్లు కాకాణికి పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. నిన్న (మంగళవారం) మాజీ మంత్రి విచారణకు రావాల్సి ఉంది. అయితే నిన్నటి విచారణకు కాకాణి గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్న ఏపీ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. హైదరాబాద్‌లో కాకాణికి మూడు నివాసాలు ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్‌లోని నివాసానికి నెల్లూరు జిల్లా కావలి సీఐతో పాటు మనుబోలు ఎస్ఐ, సిబ్బంది వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు నెల్లూరు పోలీసులు కాకాణిని కలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలుస్తోంది.పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు రాగా.. తప్పించుకుని తిరుగుతున్నట్లు-తెలుస్తోంది. వివిధ రకాలుగా పోలీసులు ఆయన తప్పుదోవపట్టిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన బంధువులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఏ సమయానికి విచారణకు రావాలి అన్న అంశాలను అందులో స్పష్టంగా చెప్పారు. అక్రమమైనింగ్ కేసు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ- కేసులో ముందస్తు బెయిల్ కోసం కాకాణి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.పోలీసులకు సహకరిస్తానని చెబుతూనూ పలుమార్లు విచారణకు కాకాణి డుమ్మా కొట్టారు. ఆయన మొబైల్ సిగ్నల్ ఆధారంగా కాకాణి ఎక్కడున్నారో తెలుసుకుని అక్కడికెళ్లి నోటీసు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

## హెచ్‌సీయూ భూముల వివాదంపై
# సెలబ్రెటీల స్పందన

**హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) :** హెచ్‌సీయూ విద్యార్థులకు పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం సపోర్ట్ అందిస్తున్నారు. కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్పందిస్తూ..ఐటీ పార్క్ కోసం 400 ఎకరాల చెట్లని ధ్వంసం చేయడం ఎందుకు .. డెవలప్ చేయాలి అంటే చెట్లు లేని భూములు చాలా ఉన్నాయి కదా అని నాగ్ అశ్విన్ ఇటీవల ప్రశ్నించారు. ఐటీ పార్కులు, ఆకాశాన్ని తాకే భవనాలు అన్నీ అవసరమే. కానీ కుదిరితే ఈ ఒక్క 400 ఎకరాలు వదిలేయండి. తెలంగాణ సిటిజన్ గా నేను వేడుకుంటున్నా. దయచేసి ఏదో విధంగా దీనిని ఆపండి సార్. ఒక తల్లిగా మాత్రమే నేను రిక్వెస్ట్ చేస్తున్నా. ఆ 400 ఎకరాల్లో విధ్వంసం వద్దు అని రేణు దేశాయ్ వేడుకున్నారు. రష్మీ, ప్రకాశ్ రాజ్ ఇలా పలువురు తమ వాదనలు వినిపిస్తున్నారు. ఇప్పుడు ఇదే లిస్ట్‌లో అనసూయ కూడా చేరింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేస్తూ.. ఇది నిజంగా హార్ట్ బ్రేకింగ్ అంటూ రాసుకొచ్చింది. పచ్చని అడివి పూడ్చివేసే రోజు వచ్చింది. ఎరుపు రంగులో ఉన్న చెట్లు నేలకూ లాయంటూ కామెంట్ పెట్టింది. ఇలా అనసూయ కూడా హెచ్‌సీయూ వివాదంపై తన సపోర్ట్ తెలియజేసింది. ఇక రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగుతూనే ఉంది. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయ మే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టి బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అడవిలో వణ్య ప్రాణాలు ఘోష వినపడటం లేదా?

- హెచ్‌సీయూ ఘటన ఫలితం రేవంత్ అనుభవిస్తాడు
- రేవంత్‌ను జైలులో పెడితే కానీ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండదు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) :** ఎంతమంది మేధావులు, విద్యావంతులు హెచ్చరిస్తున్నా హెచ్‌సీయూ భూములను లాక్కుకుంటున్నారని.. ఇది ఫలితం రేవంత్‌రెడ్డి తప్పక అనుభవిస్తాడని ఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. హెచ్‌సీయూ బయో డైవర్సిటీ పార్క్ విధ్వంసం, భూముల కుంభకోణంలో కాంగ్రెస్ గుంట నక్కల ముఠాపై వెంటనే సుమోటోగా కింది కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 29, అటవీ సంరక్షణ చట్టం 1980లోని సెక్షన్ 2, తెలంగాణ వాల్టా చట్టం 2002లోని సెక్షన్ 35 కింద కేసులు నమోదు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, అతనికి సహకరిస్తున్న మంత్రులందరిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి. అప్పుడే తెలంగాణ సురక్షితంగా ఉంటుంది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఊర్లలో ఎడ్ల బండి మీద ఇల్లు కట్టడానికి వాగు నుండి తట్ట ఇసుకను తీసుకపోతే ఆ బండిని సీజ్ చేసి స్టేషన్‌లో పెట్టే పోలీసులు, రెవెన్యూ అధికారులకు.. అడవిలో వన్యప్రాణుల ఘోష వినిపించడం లేదా..? బుల్డోజర్లు కనిపించడం లేదా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ ఎక్కడ? విద్యార్థులను కిరాయి ఉద్యమకారులన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి రియల్ దందాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ కడుతున్న కట్టడాలను ప్రజలు ఎవరూ కొనకుండా బహిష్కరించాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# తక్కువకాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత

- భూముల కాపాడటంలో బీఆర్ఎస్ ఎంతో శ్రమించింది
- రేవంత్‌కు పాలన చేతకావడం లేదు : ఎమెల్సీ కవిత




**హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ పాలన ఎవరికి అర్థం కావడం లేదని.. ఇంత తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత కూడగట్టుకున్న సీఎం ఆయనే అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దుశ్చర్య వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయింది కాబట్టి 400 ఎకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించారు అని ఆమె అన్నారు. బుధవారం ఆమె మీడియాలో మాట్లాడుతూ హైదరాబాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 400 ఎకరాల భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని ఆమె పేర్కొన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారన్నారు. ఇది యూనివర్సిటీ భూమి అని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళవద్దన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 397 ఎకరాలను ఇతర చోట యూనివర్సిటీకి ఇచ్చామని ప్రభుత్వం వితండవాదం చేస్తుందని మండిపడ్డారు. పరిశ్రమల ఏర్పాటు, భూముల విక్రయం ఆ 397 ఎకరాల్లో చేసుకోవచ్చు కదా..? ప్రభుత్వం పర్యావరణం, ప్రకృతి కోణంలో కూడా ఆలోచించాలి అని కవిత సూచించారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు అయితే వాతావరణంపై ఎంత ఒత్తిడి పెరుగుతుందో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో మై హోమ్ విహంగ నిర్మాణానికి భూములు కేటాయించామనడంలో వాస్తవం లేదన్నారు. మై హోమ్ విహంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లను పంపించాలని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370